అక్టోబర్
2024

సంపుటి : 20 సంచిక : 5

222

వెల రు. 15 /-

MARXISTU

# మార్క్సిస్టు

## సైద్ధాంతిక మాసపత్రిక

ఈ సంచికలో ........

అరుణతార సీతారాం ఏచూరి
నిర్దిష్ట పరిస్థితుల నిర్దిష్ట విశ్లేషణే మార్క్సిజం సారాంశం
కుల నిర్మూలన సాధించే మార్గం
అగ్నిపథ్ : నిప్పుతో చెలగాటం?
మన దేశంలో ప్రస్తుత సాంస్కృతిక దృశ్యం
కాకలు తీరిన కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ ఆర్ఎస్
ఉత్తర భారతంలో రాజకీయ, పాలనా వ్యవస్థలు
చైనా 'లాంగ్ మార్చ్' కొనసాగుతోంది
అసామాన్యుడు ఎజి నూరాని
సామ్రాజ్యవాదుల కనుసన్నల్లో మోడి నడక

నివాళి

# అరుణతార సీతారాం ఏచూరి

యు రామకృష్ణ



"ఆయనో మార్క్సిస్టు-లెనినిస్టు.. క్రియాశీల కార్యకర్త.. బహుముఖ ప్రజ్ఞాశాలి.. భాషా కోవిదుడు, ఉత్తమ పార్లమెంటేరియన్.. సామాజిక వేత్త.. వామపక్ష దారి దీపం.. వ్యూహకర్త.. సిద్ధాంతవేత్త.. మార్గదర్శి.. విప్లవ కారుడు.. ఆర్థిక శాస్త్రవేత్త.. చరిత్రకారుడు.. భారతదేశ ఆలోచనకు రక్షకుడు.. విశ్వ మానవుడు.."

సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణంపై భారతదేశ ప్రధాన స్రవంతి మీడియాతోపాటు అనేకమంది రాజనీతిజ్ఞులు, మేధావులు చేసిన వ్యాఖ్యలవి. మార్క్సిజాన్ని భారతీయ పరిస్థితులకు వర్తింపచేసి విప్లవ శక్తులను కొత్తపుంతలు తొక్కించడానికి విరామమెరుగని కృషి చేసిన నిత్యశ్రామికుడు సీతారాం ఏచూరి. సామ్రాజ్యవాదం, మతోన్మాదంపై రాజీలేని యుద్ధం చేసిన పోరాట యోధుడాయన. కార్మిక-కర్షక పోరాటాల మార్గదర్శి. వామపక్ష - లౌకిక ప్రజాతంత్ర శక్తుల సమన్వయ రథసారథి. ఐదు దశాబ్దాలుగా ఎన్నో పోరాటాలకు ఊపిరి పోసిన ఆయన గత సెప్టెంబరు 12న కన్ను మూయడం భారత ప్రజలకు ఎనలేని నష్టం కలిగించింది. తీవ్ర విచారాన్ని మిగిల్చింది.

సీతారాం ఏచూరి 1952 ఆగస్టు 12న మద్రాసులో అత్యున్నత విద్యావంతుల కుటుంబంలో జన్మించారు. తల్లిదండ్రులు కల్పకం, సర్వేశ్వర సోమయాజులు. వారి ఇంటి పేరు ఏచూరి. సోమయాజులు నాన్న గారు 'సీతా రామారావు' పేరునే 'సీతారాం ఏచూరి'కి పెట్టారు. సీతారాం జన్మించింది మద్రాసులో అయినా, ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ వారి స్వస్థలం. కాకినాడ రామారావు పేటలోనే సీతారాం బాల్యం గడిచింది. అక్కడే వారికి తాతలనాటి ఇల్లు ఉంది. సీతారాం తండ్రి సోమయాజులు ఆర్టీసీలో ఉన్నతాధికారిగా పనిచేశారు. తల్లి కల్పకం ఉన్నత విద్యావంతురాలైన గృహిణి. ఆమె కాకినాడ కేంద్రంగా మూడున్నర దశాబ్దాలపాటు దుర్గాబాయి దేశ్‌ముఖ్ నిర్వహించిన అఖిల భారత మహిళా కాన్ఫరెన్స్ సభ్యురాలిగా సేవలందించారు. తండ్రి విజయవాడలో పనిచేస్తున్న కాలంలో సీతారాం 6వ తరగతి అక్కడే చదువుకున్నారు. తరువాత వారి మకాం హైదరాబాద్‌కు మారింది. అక్కడున్న కాలంలో 'ఆల్ సెయింట్స్'లో కొంతకాలం విద్యనభ్యసించారు. ఉద్యోగరీత్యా తండ్రి డిప్యుటేషన్‌పై ఢిల్లీ వెళ్లాల్సిరావడంతో సీతారాం కూడా అక్కడికే వెళ్లాల్సి వచ్చింది. అక్కడ 12వ తరగతి (సిబిఎస్‌సి) విద్యను పూర్తి చేశారు. సిబిఎస్‌సిలో ఆల్ ఇండియా ప్రథమ ర్యాంక్ సాధించారు. తరువాత సెయింట్ స్టీఫెన్ కళాశాలలో బిఏ (ఆనర్స్) ఆర్థిక శాస్త్రం చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జెఎన్‌యు) ఆర్థిక శాస్త్రంలో ఎంఏ పట్టా పొందారు. విద్యార్థి ఉద్యమంలో పనిచేస్తుడటం తో పిహెచ్‌డిని మధ్యలోనే వదిలి వేయాల్సి వచ్చింది.

'చదువు - పోరాడు' అనే భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నినాదానికి సీతారాం నిలువెత్తు రూపం. 1970ల్లో ఎస్ఎఫ్ఐ పత్రిక 'స్టూడెంట్ స్ట్రగుల్'కు సంపాదకులుగా పనిచేశారు. భగత్‌సింగ్‌ను ఆర్ఎస్ఎస్ సొంతం చేసుకునేందుకు చేసిన ప్రయత్నాలను 'స్టూడెంట్ స్ట్రగుల్' పత్రిక ద్వారా వమ్ము చేశారు. భగత్‌సింగ్ విప్లవకారుడని, కమ్యూనిస్టని, నాస్తికుడని రుజువుచేసే అనేక చారిత్రక ఆధారాలను పత్రికలో ప్రచురించారు. జాతీయోద్యమంలో కమ్యూనిస్టులకు సంబంధించిన చరిత్రను వెలికితీసి యథాస్థానంలో నిలిపే ప్రయత్నం చేశారు.

సీతారాం తాను చదువుకున్న జెఎన్‌యుకు స్టూడెంట్ యూనియన్ అధ్యక్షుడుగా ఎస్ఎఫ్ఐ పక్షాన మూడు సార్లు ఎన్నికయ్యారు. ఇది గ్రేట్ కదా అని ఎవరైనా అంటే.. 'నన్ను ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్న విద్యార్థులది మరింత గ్రేట్ కదా' అనేవారు. ఎమెర్జెన్సీలో కొంత కాలం అజ్ఞాతవాసం చేసినా ఆ తరువాత అరెస్టు చేసి జైలులో పెట్టారు. అక్కణ్ణుంచే ఆయన రాజకీయ ప్రస్థానానికి నాందీ ప్రస్తావన జరిగింది. ఎమెర్జెన్సీ అనంతరం జరిగిన ఎన్నికల్లో ప్రధాని ఇందిరాగాంధీ ఓటమి చెందినప్పటికీ, జెఎన్‌యు ఛాన్సలర్ పదవిలో కొనసాగు తుండటాన్ని వ్యతిరేకిస్తూ రాజీనామా ఇవ్వాలని ఆమె సమక్షంలోనే డిమాండ్ పత్రాన్ని చదివి వినిపించారు. దీంతో ఆమె రాజీనామా ఇవ్వక తప్పలేదు. ఆయన ఎస్ఎఫ్ఐ ఆలిండియా అధ్యక్షులుగా రెండు దఫాలు పనిచేశారు. 1984లో అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చివేసి నప్పుడు దేశవ్యాప్తంగా మద్దతు కూడగట్టే కృషిలో అగ్రభాగాన ఉన్నారు. 1985లో కలకత్తాలో జరిగిన సిపిఐ(ఎం) మహాసభల్లో ఆయన కేంద్ర కమిటీ సభ్యుడుగా ఎన్నుకో బడ్డారు. సిపిఐ(ఎం) అగ్ర నాయకులు మాకినేని బసవపున్నయ్య, హరికిషన్ సింగ్ సూర్జిత్, ఇఎంఎస్ నంబూద్రిపాద్, జ్యోతిబసు తదితరుల తర్ఫీదులో ఆచరణాత్మక విషయాలు ఆకళింపు చేసుకున్నారు. సీతారాం ప్రముఖ నాయకుడిగా ఎదిగేందుకు ఇది ఎంతో దోహదపడింది. 1988లో సిపిఐ(ఎం) కేంద్ర కార్యదర్శివర్గ సభ్యుడయ్యారు. 1989లో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడినప్పుడు హరికిషన్ సింగ్ సూర్జిత్‌తోపాటు ఆ పరిణామాలలో కీలకపాత్ర పోషించారు. ఆ కాలంలో సోవియట్ యూనియన్‌లో తలెత్తిన అంతర్గత పరిణామాలు, గ్లాస్‌నోస్త్, పెరిస్త్రో యికా పేరిట ఆ పార్టీ చేస్తున్న తప్పిదాల మూలంగా ఆ దేశం ప్రమాదంలో పడనుందని కేంద్ర కమిటీ హెచ్చరించింది. తూర్పు యూరప్ దేశాల్లో నెలకొన్న సంక్షోభాల మూలంగా సోషలిస్టు దేశాలు కూలిపోయాయి. సైద్ధాంతిక నిబద్ధత లోపించడం, సోషలిజం నిర్మాణంలో చోటు చేసుకున్న వక్రీకరణల మూలంగానే ఈ పరిస్థితులు దాపురించాయని సిపిఐ(ఎం) 1990 మేలో జరిగిన కేంద్ర కమిటీ తీర్మానించింది. ఈ తీర్మానాన్ని రూపొందించడంలో సీతారాం కీలకమైన ప్రాత పోషించారు. తదనంతర కాలంలో ఒక సమగ్ర సైద్ధాంతిక డాక్యుమెంటు రూపొందించడానికి ఈ తీర్మా నం పునాదిగా

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. అరుణతార సీతారాం ఏచూరి
యు రామకృష్ణ........2

2. నిర్దిష్ట పరిస్థితుల నిర్దిష్ట విశ్లేషణే మార్క్సిజం సారాంశం
సీతారామ్ ఏచూరి........4

3. కుల నిర్మూలన సాధించే మార్గం
ప్రభాత్ పట్నాయక్........9

4. అగ్నిపథ్ : నిప్పుతో చెలగాటం?
అశుతోష్ శర్మ........ 13

5. మన దేశంలో ప్రస్తుత సాంస్కృతిక దృశ్యం
. ........16

6. కాకలు తీరిన కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ ఆర్ఎస్
వై రాము........21

7. ఉత్తర భారతంలో రాజకీయ, పాలనా వ్యవస్థలు
ఎంవిఎస్ శర్మ.......... 23

8. చైనా 'లాంగ్ మార్చ్' కొనసాగుతోంది
పి జయప్రకాష్........26

9. అసామాన్యుడు ఎజి నూరాని
తీస్తా సెతల్వాద్........ 31

10. సామ్రాజ్యవాదుల కనుసన్నల్లో మోడి నడక
ఎ కోటిరెడ్డి........ 33



సంపాదకుడు :
**ఎస్.వెంకట్రావు**

సంపాదక వర్గం :
**బి.వి.రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్.వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్.వెంకట్రావు**
**ఫోన్: ఎడిటర్ : 94900 99333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at: cpim.org




# కామ్రేడ్ ఏచూరి

**మా**ర్క్సిజం-లెనినిజాన్ని ఔపోసన పట్టి, దాన్ని భారతీయ పరిస్థితులకు అన్వయించడంలో విద్యార్థి దశనుండే గొప్ప అనుభవాన్ని సాధించిన కామ్రేడ్ ఆయన. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) రెండవ తరం నాయకత్వంలోని అగ్రగణ్యుల్లో ఒకడు. అనన్యమైన రాజకీయ విశ్లేషణా సామర్ధ్యం, సులభతరమైన రచనా పద్ధతి ఆయన స్వంతం. గొప్ప ఉపన్యాసకుడు. ప్రస్తుత అంతర్జాతీయ పర్ధితులను మార్క్సిస్టు దృక్కోణంలో విశ్లేషించే అనేక పత్రాలు ప్రవేశపెట్టడం ద్వారా నేటి కమ్యూనిస్టు ఉద్యమంలో గుర్తింపు పొందిన నాయకునిగా ఎదిగిన అంతర్జాతీయ కమ్యూనిస్టు. ఆయనే గత నెల 12న మన నుండి శాశ్వతంగా దూరమైన మన సీతారామ్ ఏచూరి.

నేటి జాతీయ పరిస్థితుల్లో కామ్రేడ్ సీతారామ్ ఏచూరి ఎంతటి పాత్ర నిర్వహిస్తూ వచ్చారో ఆయన మరణానంతరం దేశం నలుమూలలనుండి, దేశ ప్రధాని నుండి సామాన్య ప్రజల వరకు, అన్ని రాజకీయ పక్షాల నుండి ముఖ్యంగా ప్రతిపక్ష రాజకీయ పార్టీల నుండి వచ్చిన స్పందన తెలియజేస్తుంది. పార్టీ పొలిట్ బ్యూరో నుండి సామాన్య కార్యకర్త వరకు ఆయన లేని లోటు తట్టి లేపింది. కమ్యూనిస్టు నాయకుని, ప్రతిపక్ష నేతనే కాదు దేశ రాజకీయాలను ప్రభావితం చేసే ప్రతిభాశాలిని కోల్పోయామని భారత దేశం యావత్తూ ఆయన మరణంపై స్పందించింది.

కామ్రేడ్ ఏచూరి ప్రతిభ బహుముఖమైనది. ఆయన గొప్ప వర్గపోరాట సిద్ధాంత వేత్త, దాన్ని ప్రజలకు సమర్ధవంతంగా చేరవేయగల కమ్యూనికేటర్. మంచి రచయిత. అనర్ఘళమైన ఉపన్యాసకుడు. రాజకీయాలను సామాన్యులకు కూడా అర్ధమయ్యేలా చతురోక్తులతో చెప్పగల నేర్పరి. పార్టీ లైనుకు అనుగుణంగా రాజకీయ పక్షాలతో వ్యవహరించగల నైపుణ్యం ఆయన సొంతం. ఢిల్లీ పీఠంపై మరింత లోతుగా పాతుకుపోతాడనుకున్న మోడీ పీఠాన్ని కదిలించే విధంగా 'ఇండియా' కూటమి ఏర్పాటులో ఆయన ముఖ్యమైన భూమిక నిర్వహించారని ప్రతిపక్ష నేతలంతా ముక్త కంఠంతో చెప్పారు.

ఒకవైపు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్న భూగోళం రాజకీయ మితవాదంవైపు పయనిస్తూ యుద్ధాన్ని ఆవాహన చేస్తున్న తరుణంలో, దేశంలో పెరుగుతున్న అసమానతలు, నిరుద్యోగం, ఉపాధిలేమి మొదలైన రుగ్మతలు పెంచుతున్న అసంతృప్తిని పక్కదారి పట్టించేందుకు మతతత్వ, కులతత్వ చీకటి శక్తులు జడలు విప్పి నాట్యం చేస్తున్న సమయంలో ఏచూరి వంటి రాజనీతిజ్ఞుడ్ని కోల్పోవడం సిపిఐ(ఎం)కు, వామపక్ష ఉద్యమానికే కాదు మొత్తం దేశంలోని లౌకిక, ప్రజాతంత్ర ఉద్యమానికే తీరని లోటు. ఈ దేశం, వామపక్ష ఉద్యమం ఆయన చొరవను కోరుకుంటున్న తరుణంలో మనకు దూరమైనారు. పార్టీ ప్రధాన కార్యదర్శిగా చురుకుగా పనిచేస్తూ, అకస్మాత్తుగా ఆ కామ్రేడ్ మరణించడం పైనుండి కింది వరకు ప్రతి పార్టీ సభ్యుని కలచి వేసే దుర్ఘటన. అయినా మ్రాన్పడి కూర్చునే సమయమూ కాదు, కామ్రేడ్ ఏచూరి మనకు ఇచ్చిన స్ఫూర్తీ అదికాదు. ఆయన అధ్యనశీలి. నిర్ధిష్ట పరిస్థితులను నిర్ధిష్టంగా అంచనా వేయగల నేర్పరి. నిత్య కృషీవలుడు. నిగర్వి. అంకిత భావంగల మార్క్సిస్టు కార్యకర్త, నేత. ఆయన చూపిన బాటను అనుసరించడం, వ్యక్తిత్వాన్ని అనుకరించడం, ఉద్యమ బాటలో ద్విగుణీకృత దీక్షతో ముందుకు సాగడం.. ఇదే నేడు కామ్రేడ్ సీతారామ్ ఏచూరికి మనం అందించే నిజమైన నివాళి.

ఈ మాసం ముఖ్యాంశం

# నిర్దిష్ట పరిస్థితుల నిర్దిష్ట విశ్లేషణే మార్క్సిజం సారాంశం



సీతారాం ఏచూరి

***(2022 ఫిబ్రవరి 21వ తేదీన రెడ్ బుక్స్ డే సందర్భంగా మార్క్సిజం దాని ప్రాసంగికత గురించి సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి చేసిన ప్రసంగ పాఠాన్ని అదే ఏడాది మార్చి మార్క్సిస్టు సంచికలో ప్రచురించాం. గత నెల 12న న్యూఢిల్లీలో అకస్మాత్తుగా కనుమూసిన కామ్రేడ్ ఏచూరి స్మృత్యర్థం ఆ వ్యాసాన్ని మార్క్సిస్టు పాఠకులకు మళ్లీ అందజేస్తున్నాం... సంపాదకుడు)***

ఈరోజు ప్రపంచంలోని అన్ని దేశాల్లోనూ మార్క్సిజం గురించి చర్చలు సాగుతున్న సందర్భంలో అంతర్జాతీయంగా 'రెడ్‌బుక్స్ దే'ను పురస్కరించుకుని వారం రోజుల పాటు మార్క్సిస్టు మూల సూత్రాల అధ్యయనంపై రకరకాల కార్యక్రమాల్ని చేయాలని నిర్ణయించుకున్నాం. 2008లో ప్రపంచ వ్యాపితంగా ఏర్పాడిన తీవ్రమైన ఆర్థిక సంక్షోభం ఇప్పటికీ కొనసాగుతోంది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఆ సంక్షోభానికి పెట్టుబడిదారీ వ్యవస్థలో పరిష్కారం కనపడలేదు. అందువల్ల పరిష్కారాన్ని కనుగొనే కృషిలో భాగంగా మార్క్సిజాన్ని పునరధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్న భావన బలపడుతోంది. దానితోపాటే అమెరికాలో వాల్‌స్ట్రీట్‌కి వ్యతిరేకంగా జరిగిన పోరాటాలు ఇతర దేశాల్లో ఉద్యమాలు వీటి అన్నింటిలోనూ ఒక భావన ముందుకొచ్చింది. 'పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉన్న తప్పులు సంక్షోభానికి కారణం కాదు అసలు కారణం పెట్టుబడిదారీ వ్యవస్థే' అన్న వాదన బలం పుంజుకుంటున్నది. పెట్టుబడిదారీ వ్యవస్థకి వ్యతిరేకంగా ఒక ప్రత్యామ్నాయ వ్యవస్థను –సోషలిజాన్ని తీసుకువస్తే తప్పిస్తే ఈ సంక్షోభం నుంచి బయటపడలేమన్న వాదనలు ఊపందుకుంటున్నాయి. ఈ పరిణామాలు మార్క్సిజం అధ్యయనాన్ని ప్రోత్సహిస్తున్నాయి. ఇలాంటి సమయంలో ఈ రెడ్‌బుక్స్ డే పిలుపునందుకుని ఆంధ్రా, తెలంగాణా కమ్యూనిస్టులు ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు పూనుకోవడం పట్ల వాళ్ళకి విప్లవాభినందనలు తెలుపుతున్నాను.

కానీ ఈ కార్యక్రమం పూర్తయిన తర్వాత అధ్యయనాన్ని ఆపేయకూడదు. ఈరోజు మనం మార్క్సిజం అధ్యయనాన్ని శాశ్వతంగా కొనసాగించాల్సిన అవసరం ఉంది. నేటి పరిస్థితుల్లో అధ్యయనం అసలు ఎందువల్ల అవసరం?

మొదటిది, ప్రతి మనిషికి తన జ్ఞానాన్ని పెంచుకోవాలన్న తపన ఉంటుంది. ఆ జ్ఞానాన్ని ఉపయోగించుకుని తన జీవితాన్ని మెరుగు చేసుకోవాలనే ప్రయత్నం ఉంటుంది. కాని మార్క్సిజం మనుకు నేర్పేదేమంటే, ఆ జ్ఞానాన్ని అంటే మార్క్సిస్టు మూలసూత్రాలు నేర్పిన వైజ్ఞానిక విజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ మనం మన జీవితాలను మార్చుకోవాలన్నా, మెరుగు పరుచుకోవాలన్నా ఈ వ్యవస్థనే మార్చాల్సిన అవసరం ఉందని.

అందు వల్ల ఈ వ్యవస్థని ఎందుకు మార్చాలి, ఏ విధంగా మార్చగలం, దోపిడీ నుంచి దారిద్యం నుంచి మనుషులు విముక్తి పొందడం ఎలా అని తెలుసుకునే ముందు మనం అసలు ఈ రకమైన దోపిడీ ఎందుకు జరుగుతోంది? దీనికి మూల కారణం ఏమిటి? ఈరోజు పెరుగుతున్న దారిద్ర్యం, నిరుద్యోగం వంటి వాటన్నిటికీ మూల కారణం ఏమిటి అనే విషయాలను స్పష్టంగా అర్థం చేసుకో వలసిన అవసరం ఉంది. అలా అర్థం చేసుకోవాలంటే మనం మార్క్సిజం మూల సూత్రాలను అధ్యయనం చేసి, అర్థం చేసుకోవడం అవసరం. మార్క్స్ కూడా స్వయంగా తన జీవితంలోనే ఈ విషయంలో విశేషమైన కృషి చేశాడు. ఆ రోజుల్లో హెగెల్ జర్మన్ పెద్ద తత్వవేత్త. గతితార్కిక సూత్రాలు (డైలక్టిక్స్) ప్రతిపాదించింది హెగెల్. కారల్ మార్క్స్ తొలుత యంగ్ హెగెలియన్‌గా ఉండేవాడు. అయితే హెగెల్ గతితర్కాన్ని పరిశీలిస్తూ హెగెల్ వచ్చిన నిర్ణయానికి భిన్నమైన నిర్ణయానికి వచ్చాడు మార్క్స్. ఇది అర్థం చేసుకోవలసిన చాలా ముఖ్యమైన అంశం. హెగెల్ గతితార్కిక సూత్రాలను సరిగ్గానే చెప్పాడు కానీ మనిషి చైతన్యం ఏవిధంగా పెరుగుతూ వస్తుందో దాని ఆధారంగా సమాజం కూడా పెరుగుతూ వస్తుందని హెగెల్ ప్రతిపాదించాడు. సమాజంలో ఏర్పడిన రాజకీయ సంస్థలు, న్యాయపాలిత సంస్థలు ఇవన్నీ పెరుగుతూ ఇంకా మెరుగవుతూ ఒక పౌర సమాజాన్ని (సివిల్ సొసైటీని) ఏర్పాటు చేస్తాయని ఆయన చెప్పాడు. దీన్ని అధ్యయనం చేసి మార్క్స్, హెగెల్‌కు భిన్నమైన నిర్ణయానికి వచ్చాడు. హెగెల్ చెప్పే సివిల్‌సొసైటీని రాజకీయ అర్థశాస్త్రం తీర్చి దిద్దుతుందని మార్క్స్ చెప్పాడు. సమాజాభివృద్ధికి మూలాధారం రాజకీయ అర్థశాస్త్రం (పొలిటికల్ ఎకానమి). ఆ పొలిటికల్ ఎకానమీ ఆధారంగా ఏర్పడే సామాజ నిర్మాణాన్ని పరిశీలించి వాటిని విశ్లేషించితే తప్పితే అసలు ఈ దోపిడీ ఎలా జరుగుతోందో, ప్రజలు ఈ దారిద్ర్యాన్ని ఎందుకు అనుభవిస్తున్నారో అర్థం కాదు. దానిని మనం గుర్తించి అర్థం చేసుకుంటే సరిపోదు. దానికి పరిష్కారం ఏమిటి అనేదాన్ని సరిగ్గా విశ్లేషించాల్సిన అవసరం ఉంది. ఆ రోజుల్లో జర్మనీలో ఫ్యూయెర్ బా అనే తత్వ వేత్త ఉండేవాడు. మార్క్స్, ఏంగెల్స్, ఫ్యూయెర్ బా గురించి చాలా రాశారు కూడా. ఫ్యూయెర్ బాకు ఒక చిన్న స్టడీ సర్కిల్ గ్రూపు

ఉండేది. ఈ రోజుల్లో ఏ విధంగా మనం స్టడీ క్లాసులు నడుపుతున్నామో అలాగా. ఆయన యంగ్ హెగేలియన్స్ అనే ఒక గ్రూపుని ఏర్పాటు చేశాడు. ఈ గ్రూపు స్టడీ క్లాసుల్లో మార్క్స్ కూడా పాల్గొన్నాడు.

యంగ్ హెగేలియన్స్ గ్రూపు మానవ విముక్తి గురించి చర్చలు జరిపేది. మతం ప్రభావాన్ని, మనుషుల చైతన్యాన్ని మనం మినహాయిస్తే తప్పితే మానవ విముక్తి సాధించలేం అనే నిర్ణయానికి గ్రూపు వచ్చింది. దీన్ని మార్క్స్ అంగీకరించలేదు. ఆయన ఈ చర్చల నుండి విభిన్నమైన అభిప్రాయానికి వచ్చాడు. అసలు మతం, చైతన్యం ఎలా పుట్టుకొని వచ్చింది. ఈ చైతన్యం పుట్టుకు రావాలంటే దానికి ఒక భౌతిక ఆధారం ఉండాలి. ఆ భౌతిక ఆధారాన్ని విశ్లేషిస్తే తప్పితే మనకు ఎందువల్ల ఈ రకమైన చైతన్యం పెరుగుతోందో అర్థం కాదు అని ఆయన తెలుసుకున్నాడు. ఆ భౌతిక ఆధారం ఏది? ఆ భౌతిక ఆధారమే రాజకీయ అర్థ శాస్త్రం. పెట్టుబడిదారీ వ్యవస్థలో దాని సూత్రాలేమిటి అనేదాన్ని విశ్లేషించి ఒక నిర్ణయానికి వస్తే తప్పితే మనం ఈ దోపిడీ ఎందువల్ల జరుగుతోందో, దాని నుండి ఏ విధంగా మనం విముక్తి సాధించగలమో అర్థం చేసుకోలేం. అది ఇవాళున్న పరిస్థితుల్లో చాలా ముఖ్యమైన అంశం. ఈ దోపిడీ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా సోషలిజాన్ని తీసుకురావాలను కుంటున్న మనం ఈ సూత్రాలను అర్థం చేసుకుని సరైన విశ్లేషణ చేసి దాని ఆధారంగా ఉద్యమాలనూ, పోరాటాలనూ నిర్మించాల్సి ఉంది.

అందువల్లనే మార్క్సిజం ప్రాసంగికత (రిలవెన్స్) ఈ రోజు ఇంకా చాలా పెద్ద ఎత్తున పెరిగింది.

ఈరోజు దోపిడీ ఎందుకు జరుగుతోంది? ఎందుకు జరుగుతోందంటే ఒక పెట్టుబడిదారుడు అవినీతిపరుడు కావడం వల్లనా? కచ్చితంగా అవినీతి చేస్తాడు, లేక ఒక పెట్టుబడిదారుడు మోసం చేయడం వల్లనా? కచ్చితంగా మోసం చేస్తాడు. కాని ఈ దోపిడీ జరిగేది ఆ మోసం వల్లనో, అవినీతి వల్లనో కాదు జరిగేది. దోపిడీ వెనుక ముఖ్యమైన కారణం పెట్టుబడిదారీ ఉత్పత్తి వ్యవస్థలోనే ఉంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి వ్యవస్థలోనే అంతర్గతంగా ఈ దోపిడీ జరుగుతుంది. పెట్టుబడిదారుడు ఎంత నిజాయితీగా ఉన్నా, ఎంత అవినీతికి లోంగకుండా ఉన్నా, మోసం చేయకుండా ఉన్నా దోపిడీ జరుగుతుంది. ఏ విధంగా ఆ దోపిడీ జరుగుతుంది అనేదాన్ని మార్క్సిజం శాస్త్రీయంగా విశ్లేషిస్తుంది.

**❝ అంటే పెట్టుబడిదారీ వ్యవస్థలో జరుగుతున్న దోపిడీ ఆ పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క ఉత్పత్తి క్రమంలోనే ఉంది. ఆ ఉత్పత్తి క్రమాన్ని మనం రద్దు చేయడం ద్వారా మాత్రమే దోపిడీని అంతం చేయగలమన్న మాట. దాన్ని రద్దు చేయాలంటే ఒక రాజకీయ ప్రత్యామ్నాయాన్ని తీసుకురావలసిన అవసరం ఉంది. అదే సోషలిజం. అది మనల్ని చివరికి కమ్యూనిజం వైపు తీసుకువెళుతుంది. ❞**

పెట్టుబడిదారీ ఉత్పాదన క్రమంలో అదనపు శ్రమ సృష్టి అవుతుంది. ఒక కార్మికుడు కొన్ని గంటలు శ్రమ చేసి ఒక వస్తువును ఉత్పత్తి చేస్తాడు. ఆ వస్తువు విలువ మార్కెట్‌లో ఆ కార్మికుడికి వచ్చే వేతనం లేక కూలీ కంటే ఎక్కువ ఉంటుంది. ఆ విధంగా పుట్టుకు వచ్చిన అదనపు విలువ పెట్టుబడిదారీ ఉత్పాదన వ్యవస్థలో లాభాల కింద మారుతుంది. ఆ అధిక విలువ పెట్టుబడిదారీ వ్యవస్థలోని ఉత్పత్తి క్రమంలోనే పుట్టుకు వస్తుంది. ఈ పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమాన్ని మనం రద్దు చేయకపోతే మన మీద జరుగుతున్న ఈ రకమైన దోపిడీని అంతం చేయలేం.

అంటే పెట్టుబడిదారీ వ్యవస్థలో జరుగుతున్న దోపిడీ ఆ పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క ఉత్పత్తి క్రమంలోనే ఉంది. ఆ ఉత్పత్తి క్రమాన్ని మనం రద్దు చేయడం ద్వారా మాత్రమే దోపిడీని అంతం చేయగలమన్న మాట. దాన్ని రద్దు చేయాలంటే ఒక రాజకీయ ప్రత్యామ్నాయాన్ని తీసుకురావలసిన అవసరం ఉంది. అదే సోషలిజం. అది మనల్ని చివరికి కమ్యూనిజం వైపు తీసుకువెళుతుంది. సోషలిజంలో వచ్చే ప్రత్యామ్నాయ ఉత్పాదక వ్యవస్థ ఎలా ఉంటుంది? సోషలిస్టు వ్యవస్థలో ఉత్పాదనా క్రమంలో వచ్చే అధిక విలువ పెట్టుబడిదారుల లాభాల కింద మారదు. అక్కడ అది సమాజానికి, ప్రజలందరి అభివృద్ధి కోసం ఉపయోగపడుతుంది. ఆ రకమైన వ్యవస్థను – సోషలిజాన్ని తీసుకువస్తే తప్పితే మానవ విముక్తి వైపుకి మనం ముందడుగు వేయ్యలేం.

ఈ అదనపు విలువ సూత్రాన్ని కనుగొనే క్రమంలో మార్క్స్.. పెట్టుబడిదారీ ఉత్పాదన వ్యవస్థ ఏంటి, దాని ఉత్పత్తి క్రమం ఏంటి? అన్న విషయాలను విపులంగా పరిశీలించి, చాలా లోతుగా విశ్లేషించి కనుగొన్న మార్క్సిస్టు మూల సూత్రాలను 'పెట్టుబడి' గ్రంథంలో మనకు వివరించారు. కమ్యూనిస్టు ప్రణాళికలో చెప్పిన విషయాలన్నింటినీ రుజువుచేయడానికి ఈ పెట్టుబడి గ్రంథంలో ఆయన అన్ని మూల సూత్రాలనూ వైజ్ఞానికంగా నిరూపించారు.

ఈ సూత్రాలన్నింటి గురించి విశ్లేషణ చేయ్యాలంటే ఒక క్లాస్‌లో, ఒక ఉపన్యాసంలో కుదరదు. వాటిని మనమందరం కలసి అధ్యయనం చేయవలసిన అవసరం ఉంది. ఇవాళ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో తీవ్రమైన సంక్షోభాన్ని అర్థం చేసుకోటానికి ఈ మూల సూత్రాలన్నిటినీ అధ్యయనం చేయడం, సరిగా అర్థం చేసుకోవడం అవసరం.

నేను పార్టీలో పూర్తికాలం కార్యకర్తగా వచ్చినప్పుడు మాకినేని బసవ పున్నయ్యగారు మార్క్స్–ఏంగెల్స్ రాసిన కమ్యూనిస్టు ప్రణాళిక ఎన్నిసార్లు చదివావు అని తరచూ అడుగుతూ వచ్చేవారు. అప్పుడు గ్రహించలేదు నేను. వ్యక్తిగతంగా ఇప్పుడు దాన్ని ఆత్మవిమర్శనా పూర్వకంగా చెప్పవలసిన అవసరం ఉంది. అన్ని సార్లు ఎందుకు చదవాలి ఒక్కసారి చదివితే చాలదా, ఒకసారి అర్థం అయితే చాలదా అంటే లేదు అని యం.బి.గారు ఎప్పుడూ చెబుతూ వచ్చేవారు. గతంలో నువ్వు చదివిన సమయంలో అర్థం కాని అనేక విషయాలు మారుతున్న పరిస్థితుల్లో అర్థం అవుతాయి. ఆ పుస్తకం అలా పదే పదే చదివే క్రమంలో దాని ప్రాసంగికత ఇంకా ఎక్కువ నీకు కనిపిస్తుంది. అందుకే ఈ మార్క్సిస్టు మూల గ్రంథాలను మళ్ళీ మళ్ళీ చదవాల్సిన అవసరం ఉంది అనేవారు.

ఇవాళ ఆ సమయం మళ్ళీ వచ్చింది. నేడు మనం ఉన్న పరిస్థితుల్లో నయా–ఉదారవాదం వల్ల ఇంకా తీవ్రంగా పెరుగుతున్న ఆర్థిక సంక్షోభాన్ని అర్థం చేసుకోవాలంటే మార్క్సిస్టు మూల గ్రంథాలను మళ్ళీ ఒకసారి తిరగ చదవాల్సిన అవసరం ఉంది. ఈ రెడ్ బుక్స్ డే పిలుపు ద్వారా మనం అందరం ఈ

> **❝ ప్రపంచంలో నేడున్న పరిస్థితుల్లో సంక్షోభం ఎంత పెరిగినా పెట్టుబడిదారీ విధానానికి ఒక రాజకీయ ప్రత్యామ్నాయం -సోషలిజం సృష్టి అయ్యేవరకూ, అది పెట్టుబడిదారీ వ్యవస్థను కూల్చే వరకూ ఆ సంక్షోభం నుంచి, దోపిడి నుంచి మానవాళి విముక్తి సాధించ లేదు. అది సాధించాలంటే మన ముందు విప్లవం తప్పితే వేరే మార్గం లేదు. ఆ విప్లవం ఎలా తీసుకురావాలి అనేదాన్ని అర్థం చేసు కుంటే సరిపోదు. అర్థం చేసుకుని దాని ఆధారంగా ఈ ప్రపంచాన్ని మార్చాలి. మార్క్స్, ఏంగెల్స్ కమ్యూనిస్టు ప్రణాళికలో ఇచ్చిన పిలుపు సారాంశం ఇదే. ❞**

అధ్యయనాన్ని కొనాసాగించాల్సిన అవసరం ఉంది.

**సంక్షోభం నుండి దానికదే విముక్తి రాదు**

మనం ఒకసారి వెనక్కి వెళితే... పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమంలోనే దోపిడీ జరుగుతుందనీ, ఈ దోపిడీ నుండి విముక్తి పొందాలంటే ఒక రాజకీయ ప్రత్యామ్నాయాన్ని ముందుకు తీసుకురావలసిన అవసరం ఉందనే విషయాన్ని చర్చించాం. ఈ సందర్భంగా మార్క్స్ చెప్పిన ఒక ముఖ్యమైన విషయం గుర్తుపెట్టుకోవాలి. అదేమిటంటే సంక్షోభం అనేది పెట్టుబడిదారీ వ్యవస్థలో ఎప్పుడూ సృష్టి అవుతూ ఉంటుంది. కానీ ఆ సంక్షోభం వల్ల ఎంత తీవ్రమైనాగానీ, ఆ సంక్షోభం వల్ల ఏన్నడూ పెట్టుబడిదారీ వ్యవస్థ ఆటోమ్యాటిక్‌గా కూలిపోదు.

అసలు పెట్టుబడిదారీ వ్యవస్థలో సంక్షోభం ఎందుకు పుట్టుకు వస్తుంది. పెట్టుబడిదారీ ఉత్పాదనలో అధిక విలువ సృష్టించబడుతుందని చెప్పుకున్నాం కదా! ఉత్పత్తయిన వస్తువు మార్కెట్‌లో అమ్ముడైతే తప్ప ఆ అధిక విలువ లాభాల్లోకి మారలేదు. ఆ వస్తువుని కొనుకున్ననే శక్తి ప్రజానికంలో లేకపోతే ఆ అధిక విలువ ఆ వస్తువులో ఉంటుంది. కాని లాభం కింద మారదు. ప్రజలపై దోపిడీ ఎంత తీవ్రంగా పెరుగుతే అంతగా వారి కొనుక్కునే శక్తి తగ్గుతుంది. అలాంటి పరిస్థితుల్లో వస్తువులు అమ్ముడు గాక అధిక విలువ లాభాల్లోకి మారక పెట్టుబడిదారీ వ్యవస్థలో ఆర్థిక సంక్షోభం పెరుగుతుంది. కానీ ఆ ఆర్థిక సంక్షోభానికి పరిష్కారం పెట్టుబడిదారీ వ్యవస్థలో దొరకదు. ఎందువల్ల? ప్రజానికానికి కొనుక్కునే శక్తిని ఇవ్వాలంటే పెట్టుబడిదారులు తమ లాభాలను తగ్గించుకోవాలి. కానీ లాభాలను తగ్గించుకునే పని పెట్టుబడిదారులు చేయరు. అందువల్ల ఈ సంక్షోభానికి పరిష్కారం లేకపోవడంతో అది ఇంకా తీవ్రంగా పెరిగే అవకాశం ఉంది. అదే ఇవాళ ప్రపంచంలోనూ, మన దేశంలోనూ జరుగుతోంది.

అయితే ప్రపంచంలో నేడున్న పరిస్థితుల్లో సంక్షోభం ఎంత పెరిగినా పెట్టుబడిదారీ విధానానికి ఒక రాజకీయ ప్రత్యామ్నాయం -సోషలిజం సృష్టి అయ్యేవరకూ, అది పెట్టుబడిదారీ వ్యవస్థను కూల్చే వరకూ ఆ సంక్షోభం నుంచి, దోపిడి నుంచి మానవాళి విముక్తి సాధించలేదు. అది సాధించాలంటే మన ముందు విప్లవం తప్పితే వేరే మార్గం లేదు. ఆ విప్లవం ఏ విధంగా తీసుకురావాలి, ఏ విధంగా జరుగుతుంది అనేదాన్ని అర్థం చేసుకుంటే సరిపోదు. అర్థం చేసుకుని దాని ఆధారంగా ఈ ప్రపంచాన్ని మార్చాలి. మార్క్స్, ఏంగెల్స్ కమ్యూనిస్టు ప్రణాళికలో ఇచ్చిన పిలుపు సారాంశం ఇదే. ఈ ప్రపంచాన్ని మార్చాలి అంటే, ఈ దోపిడీని అంతం చేయ్యాలి అంటే ఇవాళ ఆ పెట్టుబడిదారీ వ్యవస్థని కూల్చివేసి ఒక ప్రత్యామ్నాయ సోషలిస్టు వ్యవస్థను నిర్మిస్తే తప్పితే ఈ పని జరగదు. కానీ ఈ సోషలిస్టు వ్యవస్థను ఏ విధంగా నిర్మించగలం?

ఈ సందర్భంలో లెనిన్ మార్క్సిజాన్ని ఏ విధంగా ముందుకు తీసుకువెళతాడో విశ్లేషించి దానిని అర్థం చేసుకోవడం కూడా అవసరం. ఎందుకంటే రాజకీయ ప్రత్యామ్నాయమైన సోషలిజం అనేది మానవాళిని కమ్యూనిజం వైపు తీసుకుపోతుంది. మారిన పరిస్థితుల్లో అటువంటి రాజకీయ ప్రత్యామ్నాయాన్ని ఏ విధంగా మనం సాధించగలం అనేదాన్ని మనం లెనిన్ చేసిన విశ్లేషణల నుండి స్పష్టంగా గ్రహించగలుగుతాం. మార్క్సిజం ఒక ఒట్టి ఫార్ములా కాదు అంటాడు లెనిన్. ఒక విశ్లేషణ ఆధారంగా, ఏదో ఒక ఫార్ములా ఆధారంగా మనం విప్లవం సాధించగలమని అనుకోవడం తప్పు. నిర్దిష్ట పరిస్థితుల యొక్క నిర్దిష్ట విశ్లేషణే మార్క్సిజం యొక్క ముఖ్యమైన సారాంశం. పరిస్థితులు ఏవిధంగా మారుతున్నాయో ఆ మారుతున్న పరిస్థితుల విశ్లేషణ మారకపోతే చాలా పెద్ద తప్పులు జరుగుతాయి. దీని వల్ల విప్లవోద్యమం ముందుకు వెళ్ళడం కంటే అది ఎదురుదెబ్బలు తినే అవకాశం ఉంది.

అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలో సంక్షోభం వస్తుందనీ దాని నుండి మానవాళి విముక్తి సాధించాలంటే ఆ పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోసే రాజకీయ ప్రత్యామ్నాయం ఆధారంగా విప్లవ పరిస్థితిని సృష్టించాలని మార్క్స్-ఏంగెల్స్ చెప్పారు. కానీ ఇప్పుడు పెట్టుబడిదారీ వ్యవస్థ సామ్రాజ్యవాద దశకు చేరినప్పుడు లెనిన్ చేసిన విశ్లేషణ ఏమిటి? సామ్రాజ్యవాదం మొత్తం ప్రపంచాన్ని ఒక గొలుసులో కట్టేసింది. ఆ గొలుసులో ఉన్న బలహీనమైన లింక్ ఎక్కడైతే ఉందో అక్కడ నుంచి ఈ విప్లవం మొదలవుతుంది. దాని ద్వారానే సోషలిజం ప్రత్యామ్నాయాన్ని ముందుకు తీసుకురాగలం అని ఆయన చెప్పాడు. బలహీనమైన లింకు దగ్గర సామ్రాజ్యవాద గొలుసును తెగ్గొట్టడం. అది 1917లో జరిగిన రష్యన్ విప్లవం.

ఆనాడు రష్యా, సామ్రాజ్యవాద సర్కిల్‌లో ఉన్న బలహీనమైన లింకు. అక్కడ విప్లవోద్యమాన్ని నిర్మించి పెట్టుబడిదారీ వ్యవస్థను కూలగొట్టి ప్రత్నామ్నాయ సోషలిజం నిర్మాణాన్ని నిర్మించే పనిని రష్యన్ విప్లవం చేసింది. అంటే అభివృద్ధి చెందిన దేశాల్లోనే కాక అంతగా అభివృద్ధి చెందని దేశాలలో కూడా విప్లవం సాధించగలం, సామ్రాజ్యవాద గొలుసులోని బలహీనమైన లింకుగా ఉన్న దేశాల్లో ఆ రకంగా విప్లవం సాధించే అవకాశం ఏర్పడుతుంది అన్న విషయం దీనితో స్పష్టమైంది. దానిని విప్లవకారులందరూ ఉపయోగించుకోవలసిన అవసరం ఉంది. అది ఉపయోగించుకోవాలంటే ఆ దేశంలో ఉన్న నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా విశ్లేషించాలి. ఆ పరిస్థితులు నిర్దిష్టంగా ఏ స్టేజిలో ఉన్నామో గ్రహించాలి. ఈ విధంగా లెనిన్ రష్యన్ పరిస్థితులను నిర్దిష్టంగా విశ్లేషించి విప్లవం తీసుకు వచ్చాడు.

ఆ విప్లవోద్యమాన్ని మనం ముందగు తీసుకు వెళ్ళటానికి, విప్లవాన్ని సాధించదానికి మార్క్స్, ఏంగెల్స్ నేర్పిన మూల సూత్రాలను అధ్యయనం చేస్తే చాలదు. లెనిన్ చేసినట్లు మార్క్సిజాన్ని నిర్దిష్ట పరిస్థితులకు వర్తింపజేయాలి. నిర్దిష్ట పరిస్థితుల యొక్క నిర్దిష్ట విశ్లేషణే గతితార్కిక సారం. ఆ నిర్దిష్ట పరిస్థితులను మనం సరిగ్గా గుర్తించకపోతే తప్పులు జరుగుతాయి. అంటే పరిస్థితులను గుర్తించడం దాని ఆధారంగా శాస్త్రీయమైన


విశ్లేషణ చేయడం ఇవి రెండూ చాలా ముఖ్యమైన అంశాలు. విప్లవ శక్తుల బలం పెరుగుతుందా తగ్గుతుందా అనేది దీనిపై ఆధారపడి ఉంటుంది.

ఈ మార్క్సిస్టు మౌలిక సూత్రాల ఆధారంగానే ఇవాళ మనం ప్రపంచాన్ని మార్చగలం. విప్లవం సాధించడానికి కార్మికవర్గ పార్టీ అయిన కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో రాజకీయ ప్రత్యామ్నాయం ఏర్పారచడం, దాని ఆధారంగా విముక్తి సాధించడం జరగాలి. ఈరోజు మార్క్సిజం ప్రాసంగిత ఎందుకు పెరుగుతోందో దీని వల్లనే అర్థం అవుతోంది. ప్రజా విముక్తి జరగాలంటే ఈ వ్యవస్థనే మార్చాలి, మార్చాలి అంటే ప్రస్తుత పెట్టుబడిదారీ వ్యవస్థను కూలగొట్టాలి, దాన్ని కూలగొట్టాలంటే రాజకీయ ప్రత్యామ్నాయాన్ని ముందుకు తీసుకొచ్చే విప్లవ శక్తిని బలపరచాలి. ఇవన్నీ సాధించాలంటే ఇవాళ ఉన్న నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా విశ్లేషించాల్సిన అవసరం ఉంది.

సామ్రాజ్యవాదాన్ని ఎదిరించి నిలబడగలిగిన శక్తిగా ఉన్న సోవియట్ యూనియన్‌లో సోషలిజం దెబ్బతిన్న తర్వాత పెట్టుబడిదారీ వ్యవస్థకి తన లాభాలను ఇంకా పెద్ద ఎత్తున పెంచుకునే అవకాశాలు పెరిగాయి. ప్రపంచీకరణ లేక, నయా- ఉదారవాదం లక్ష్యం లాభాలను నిరంతరాయంగా పెంచుకుంటూ పోవడమే. లాభాలన్నే పెంచుకుంటూ పోవాలంటే ప్రభుత్వ రంగ సంస్థలనూ, సర్వీసులనూ ప్రైవేటీకరణ చేయాలి. అన్ని రకాల ప్రకృతి వనరులను – ప్రపంచంలో ఉన్న అడవులు, జల వనరులు, ఇంధనం... వగైరాలన్నిటినీ ప్రైవేటీకరించాలి. అలా చేస్తేనే లాభాలు నిరంతరంగా పెరిగే అవకాశం ఉంటుంది. నయా–ఉదారవాదం అంటే నియంత్రణ లేని పెట్టుబడి ప్రవాహానికి అవకాశం ఇవ్వం. పెట్టుబడి ఒక దేశం నుంచి మరో దేశానికి వెళ్ళడానికి ఎటువంటి ఆటంకాలు లేకుండా చేసే వ్యవస్థను సృష్టించడం. దాని వల్ల జరిగిందేమిటి?

దానివల్ల ఏదైతే మార్క్స్ విశ్లేషించాడో అటువంటి ఒక కొత్త రకమైన సంక్షోభం పుట్టుకు వచ్చింది. ఒకవైపు లాభాలు పెరుగుతున్నాయి. మరోవైపు ప్రజానికం చేతిలో కొనుక్కునే శక్తి అదే విధంగా తగ్గుతోంది. లాభాలు పెరగడం, ప్రజల కొనుగోలు శక్తి తగ్గడం ఇవి రెండూ పెట్టుబడిదారీ వ్యవస్థలో సహజంగా జరుగుతాయి. పెట్టుబడిదారీ వ్యవస్థలో లాభాలను పెంచగలిగినా, పెట్టుబడి ఇంకా ఎక్కువ పెంచినా, కొత్త ఫ్యాక్టరీలు

**“ ఈ మార్క్సిస్టు మౌలిక సూత్రాల ఆధారంగానే ఇవాళ మనం ప్రపంచాన్ని మార్చగలం. విప్లవం సాధించడానికి కార్మికవర్గ పార్టీ అయిన కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో రాజకీయ ప్రత్యామ్నాయం ఏర్పారచడం, దాని ఆధారంగా విముక్తి సాధించడం జరగాలి. ఈరోజు మార్క్సిజం ప్రాసంగిత ఎందుకు పెరుగుతోందో దీని వల్లనే అర్థం అవుతోంది. ”**




సరుకులు వచ్చినా వాళ్ళు ఉత్పత్తి చేసిన వస్తువుని అమ్ముకుంటే తప్పితే అధిక విలువ లాభంలోకి మారదు. అమ్ముకోవాలంటే కొనుక్కునే శక్తి ఉండాలి. ప్రజానికంలో అది తగ్గుతుండడంతో సంక్షోభం ఏర్పడింది. ఆ సంక్షోభం నుంచి బయటపడడానికి నయా–ఉదారవాదం ఎన్నుకున్న మార్గం ప్రజల మీద దోపిడీని ఇంకా తీవ్రం చేసి లాభాలను పెంచుకోడానికి ప్రయత్నించడం. అంటే దోపిడీ ఇంకా తీవ్రంగా పెరుగుతుంది. 2008లో వాల్‌స్ట్రీట్‌లో జరిగిన ద్రవ్య సంక్షోభం (ఫైనాన్సియల్ మెల్ట్ డౌన్) తర్వాత మనం అదే చూస్తున్నాం.

పొదుపు చర్యలు (ఆస్టిరిటీ మెజర్స్) అనే పేరుతో కార్మిక వర్గం మీద దోపిడి చాలా తీవ్రంగా పెరుగుతోంది. ఎనిమిది గంటలు పనిచేయాలని చాలా పెద్దఎత్తున కృషి చేసి, ఉద్యమాలు చేసి, త్యాగాలుచేసి, కార్మికవర్గం ఏదైతే సాధించిందో దానిని ఇవాళ అనేక దేశాలు 10 గంటల పనిగా మార్చాయి. మనదేశంలో 12 నుంచి 16 గంటల వరకు పనిచేయించుకుని లాభాలు పెంచుకుంటున్నారు. పెన్షన్‌లలో కోత, వేతనాల్లో కోత జరుగుతోంది. ఈ విధంగా ఈ లాభాలను పెంచుకోటానికి ఈ దోపిడీ ఇంకా తీవ్రంగా పెరుగుతోంది. నయా–ఉదారవాదం వల్ల ఈ దోపిడీ తీవ్రంగా పెరుగుతున్న కొద్దీ దానికి వ్యతిరేకంగా ప్రజల్లో అసంతృప్తి కూడా పెరుగుతోంది. ఈ అసంతృప్తి అనేక దేశాల్లో పెద్దపెద్ద ఉద్యమాలుగా మారి రాజకీయ మార్పులు కూడా తీసుకురావడం మనం చూసాం. లాటిన్ అమెరికాలోని చిలీలో ఐదు దశాబ్దాల క్రితం ఎన్నికైన కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని అమెరికా గూఢచారి సంస్థ సిఐఎ, సైన్యం కలిసి ఒక సైనిక కుట్ర ద్వారా కూలగొట్టి అక్కడ ఒక నియంతృత్వ ప్రభుత్వాన్ని స్థాపించాయి. ఆ ప్రభుత్వం ద్వారా ప్రపంచంలోనే మొదటి సారి నయా–ఉదారవాద విధానాలను అక్కడ ప్రారంభించారు. అటువంటి చిలీలో 50 సంవత్సరాల తరువాత ఇవాళ మళ్లీ వామపక్ష ప్రభుత్వం ఏర్పడింది. ముగ్గురు కమ్యూనిస్టు నాయకులు క్యాబినేట్‌లో ఉన్నారు. అక్కడ ప్రజా ఉద్యమం ద్వారా రాజకీయ రంగంలో వచ్చిన చాలా పెద్ద మార్పు ఈ వామపక్షాల ప్రభుత్వం రావటం. అదే విధంగా లాటిన్ అమెరికాలోని పెరూ, బోలివియా, హోండురాస్‌లో వామపక్ష ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాయి. అదే విధంగా పెద్ద సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా వెనుజులాలో పెద్ద పోరాటం జరుగుతోంది. సోషలిస్టు క్యూబా వీటన్నిటికీ ప్రేరణ ఇస్తోంది. క్యూబాకి వ్యతిరేకంగా సామ్రాజ్యవాదం ఆర్థిక ముట్టడి ఇంకా పెంచింది. అయినా ఈ మార్పులు జరుగుతున్నాయి.

ప్రజల యొక్క అసంతృప్తి ఒక ఉద్యమం కింద మారి తద్వారా వచ్చే ఒక రాజకీయ పరిణామాలు సోషలిజం వైపుకి మళ్ళుతే సామ్రాజ్యవాదానికి పెద్ద ప్రమాదం. నియో–లిబరల్ రాజకీయ వ్యవస్థ దీనిని ఎదుర్కోడానికి

> "ఇలాంటి పరిస్థితుల్లో మనం మార్క్సిస్టు మూల సూత్రాలను అధ్యయనం చేస్తూ నేటి నిర్దిష్ట పరిస్థితులకు వాటిని అమలు చేస్తూ విప్లవోద్యమాన్ని నిర్మించాలి. మార్క్స్-ఏంగెల్స్ ఇచ్చిన పిలుపును మనదేశంలో సాధించేందుకు, విప్లవం వైపుకి ముందడుగు వేయడం కోసం విప్లవ ప్రత్యామ్నాయాన్ని సృష్టించాలంటే ఈ బిజెపి ప్రభుత్వాన్ని అధికారం నుంచి దించాలి. దానికోసం తీసుకునే ఎత్తుగడ లను గురించిన వివరాలు మనం ఇటీవల విడుదల చేసిన పార్టీ 23వ మహాసభ ముసాయిదా రాజకీయ తీర్మానంలో ఉన్నాయి."

అనేక విధాలా ప్రయత్నిస్తోంది. అనేక దేశాల్లో ప్రజల్లో పెరిగిన అసంతృప్తి ఉద్యమాలుగా మారి రాజకీయ ప్రత్యామ్నాయం సోషలిజం లోకి మారకుండా చూడ్డానికి నయా-ఉదార వాదం ప్రజల్లో ఏర్పడుతున్న ఐక్యతను చెదరగొట్టడానికి ప్రయత్నిస్తున్నది. ప్రతి దేశంలోనూ నేడు ఈ పరిస్థితి మనకు కనిపిస్తుంది. అనేక దేశాల్లో నేడు నియంతృత్వ పోకడలు పెరుగుతున్నాయి. రాజకీయ రంగంలో మితవాదంవైపు మొగ్గు పెరుగుతోంది. బ్రెజిల్ అధినాయకుడు తాను ఫాసిస్టునని బహిరంగంగా చెప్పుకుంటు న్నాడు. ఫాసిజంలో ప్రజలకు హక్కులేమి ఉండవు. ట్రేడ్ యూనియన్ హక్కులేమి ఉండవు. అన్ని ట్రేడ్ యూనియన్‌ల మీద నిషేధం విధిస్తారు. కార్మిక వర్గ ఉద్యమాల మీద ఉక్కుపాదం మోపుతారు. అమెరికా మరికొన్ని దేశాల్లో వర్ణవివక్ష రూపంలో నియంతృత్వం అమలవుతున్నది. మన దేశంలో మతతత్త్వం ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేసి వారిలో పెరుగుతున్న అసంతృప్తి విప్లవోద్యమం వైపు మళ్ల కుండా ప్రయత్నిస్తోంది.

మన దేశంలో నేడు నయా-ఉదార వాదం కింద ఆర్థిక దోపిడీ చాలా తీవ్రంగా పెరుగుతోంది. అన్ని రంగాల్లోనూ జరుగు తున్న ప్రైవేటీకరణ, వనరుల లూటీ, లేబర్ కోడ్‌లు ప్రవేశపెట్టడం ద్వారా, ఇంకా అనేక విధాలా కార్మిక వర్గం మీద దాడులు, ప్రభుత్వ రంగ సంస్థలన్నిటినీ ప్రైవేటీకరించడం, ప్రభుత్వ ఆస్తుల నగదీకరణ, మన రైతాంగ వ్యవసాయాన్ని కార్పొరేట్ రంగం లూటీ చేసుకుని లాభాలు పెంచుకునే అవకావ కాశాలు పెద్దఎత్తున కల్పించడం, విదేశీ పెట్టుబడులు మన దేశంలోకి వచ్చి లాభాలు చేసుకోవడానికి అవకాశాలు పెంచడం.. ఇదంతా కూడా పెట్టుబడిదారుల లాభాలు పెంచడానికి తీసుకునే చర్యలే. దేశంలో ఇటు కార్పొరేట్ రంగం, మరోవైపు మతతత్వ హిందూత్వల మధ్య బాంధవ్యం వృద్ధి చెందింది. ప్రజలలో పెరుగుతున్న అసంతృప్తిని దారి మళ్లించడానికి మతతత్వాన్ని ఉ పయోగించుకోవడం అనేదానితోపాటు వాళ్ళకు మరో వ్యూహం కూడా ఉంది. మన దేశంలో ఉన్న లౌకిక ప్రజాస్వామ్య రాజ్యాం గాన్ని ఆర్ఎస్ఎస్ యొక్క మెజారిటీ మత తత్వంతో కూడిన హిందూత్వ రాజ్యంగా మార్చాలన్నది వారి లక్ష్యం. లౌకిక ప్రజాతంత్ర రిపబ్లిక్కును హిందూ రాష్ట్రగా మార్చాలన్నది వారి ధ్యేయం. అందుకే వారు మన రాజ్యాంగం మీద, రాజ్యాంగం యొక్క మూలస్థంబాల మీద, మన రాజ్యాంగ సంస్థల మీద నిత్యం దాడులు చేస్తున్నారు. పార్లమెంట్ నుంచి మొదలుపెట్టి న్యాయవ్యవస్థ, ఎలక్షన్ కమీషన్, ఎన్‌ఫోర్స్ మెంట్ డిపార్టుమెంట్, సి.బి.ఐ వంటి సంస్థలను ఉపయోగించుకుంటూ వాళ్ళ లక్ష్యాన్ని సాధించడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ రోజు ఏర్పడిన ఈ మతతత్వ, కార్పొరేట్ కూటమి విదేశీ పెట్టుబడిదారులతో చాలా గట్టి సంబంధాలు నెలకొల్పుకున్నది. దాని వల్లనే నేడు మన విదేశాంగ విధానం భారత దేశాన్ని సామ్రాజ్యవాదానికి ఒక జూనియర్ పార్టనర్ గా మార్చే స్థాయికి దిగజారిపోయింది. మోదీ ప్రభుత్వం దేశంలో నిరంకుశ పద్ధతులు అనుసరిస్తున్నది. ప్రజల అధికారాల మీద, ప్రజాతంత్ర హక్కులు, పౌర హక్కులు మీద తీవ్రమైన దాడులు చేస్తున్నది.

వీటన్నింటిలోనూ వీళ్ళ ముఖ్యమైన టార్గెట్‌గా నేడు కమ్యూనిస్టులు ఉన్నారు. రేపు అసెంబ్లీ ఎన్నికల మొదటి దశ మొదలవు తుందనగా ఇవాళ ప్రధాని నరేంద్ర మోదీ ఒక మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అనేక అంశాలను గురించి మాట్లాడుతూ ఒక ముఖ్య మైన మాట అన్నారు. దీన్ని మనం గుర్తించా ల్సిన అవసరం ఉంది. నేడు కమ్యూనిస్టుల బలం చాలా దిగజారింది. ఏదో దేశంలో ఒక కార్నర్‌లో కేరళాలో ఉన్నారు. అక్కడ కూడా ఎక్కువ రోజులు ఉండరు. కాని వాళ్ళు పార్లమెంట్‌లో ఉన్నా లేకపోయినా, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నా లేకపోయినా వాళ్ళ సిద్ధాం తం చాలా ప్రమాదకరమైనది, దానిని రద్దు చేయాల్సిన అవసరం ఉంది అని చెప్పాడు. ఎందువల్ల ఆయన అలా అన్నారు? ఈరోజు ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని సమీకరించి ఒక విప్లవ రూపం ఇచ్చే శక్తి మన సిపిఐఎంకే, మన కమ్యూనిస్టు ఉద్యమానికే, వామపక్ష ఉద్య మానికే ఉంది. ఆ ప్రమాదాన్ని గ్రహించా రు గనుకనే ఆయనకు కమ్యూనిస్టుల మీద దాడి ఎక్కుపెట్టారు. ఆర్ఎస్ఎస్, బిజెపి మదోన్మాదాన్ని ఎదిరించడంలోనూ, లౌకిక తత్వాన్ని కాపాడ్డంలోనూ, ముఖ్యంగా ఎటు వంటి రాజీ లేకుండా సూత్రబద్ధంగా మతత త్వాన్ని వ్యతిరేకిస్తున్నది సిపిఐ(ఎం), వామ పక్షాలే. ఏడాది పాటు జరిగిన రైతాంగ ఉ ద్యమం కానివ్వండి, లేక పెరుగుతున్న ట్రేడ్ యూనియన్స్ ఉద్యమాలు కానివ్వండి, మార్చి లో జరిగే రెండు రోజుల కార్మిక సమ్మె కానివ్వండి... వీటన్నింటి వెనుక లెఫ్ట్ ఒక ముఖ్యమైన శక్తి అనేది మన వర్గ శత్రువులే గమనిస్తున్నారు. అందువల్లనే వారు గురిచూసి మనమీద దాడి చేసి, ప్రజలల్లో ఉన్న అసంతృప్తి ఒక ప్రజా ఉద్యమంగా మారకుండా, ఆ ఉద్యమం ఒక విప్లవ స్థాయికి చేరకుండా ప్రయత్నిస్తున్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో మనం మార్క్సిస్టు మూల సూత్రాలను అధ్యయనం చేస్తూ నేటి నిర్దిష్ట పరిస్థితులకు వాటిని అమలు చేస్తూ విప్లవోద్యమాన్ని నిర్మించాలి. మార్క్స్-ఏంగెల్స్ ఇచ్చిన పిలుపును మనదేశంలో సాధించేం దుకు, విప్లవం వైపుకి ముందడుగు వేయడం కోసం విప్లవ ప్రత్యామ్నాయాన్ని సృష్టించా లంటే ఈ బిజెపి ప్రభుత్వాన్ని అధికారం నుంచి దించాలి. అలా దించడానికి తీసుకునే ఎత్తుగడ లను గురించిన వివరాలు మనం ఇటీవల విడుదల చేసిన పార్టీ 23వ మహాసభ ముసా యిదా రాజకీయ తీర్మానంలో ఉన్నాయి.

చివరిగా చెప్పదలచుకున్న మౌలిక విషయం ఏమంటే మార్క్సిజాన్ని అధ్యయనం చేసి, దాని మూల సూత్రాలను పునఃగ్రహించి, వాటిని నేటి నిర్దిష్ట పరిస్థితులలో నిర్దిష్ట విశ్లేషించు కుంటూ మానవాళి విముక్తి కోసం ముందడు గు వెయ్యాలి. నేటి ఈ ప్రపంచాన్ని మార్చటా నికి ముందడుగు వేయాలి. ఈ రెడ్ బుక్స్ డేని ప్రేరణగా తీసుకొని మీరు ప్రారంభించిన అధ్యయన కార్యక్రమం సంతోషించదగింది. అయితే అది ఈ వారం రోజుల కార్యక్రమం అయిపోవడం తోనే ఆగిపోకూడదు. అధ్యయ నాన్ని కొనసాగించాలి. ❈

ఈ మాసం ప్రత్యేకం

# కుల నిర్మూలన సాధించే మార్గం

ప్రభాత్ పట్నాయక్



రచయిత ప్రముఖ మార్క్సిస్టు ఆర్థిక వేత్త

ప్రాచీన కాలం నుండీ భారతదేశంలో ఉనికిలో ఉన్న నాలుగు వర్ణాల వ్యవస్థలో కుల వ్యవస్థ మూలాలు ఉన్నాయి. ఆ వ్యవస్థ మరింతగా విస్తరించే క్రమం కొనసాగుతోంది. నాలుగు వర్ణాల వ్యవస్థలో ప్రధానంగా బ్రాహ్మణులు (పురోహిత వర్గం), క్షత్రియులు (యుద్ధాలు చేసేవారు). మిగిలిన రెండు శ్రామిక తరగతులకు చెందినవారు. వీరిలో ప్రధానంగా లొంగదీసుకున్న స్థానిక తెగలకు చెందిన వైశ్యులు (చేతివృత్తులవారు, ఇతర ఉత్పత్తిదారులు), శూద్రులు (తక్కువస్థాయి పనులు చేసేశ్రామికులు) ఉన్నారు. రక్తసంబంధీకుల గుంపులతో, పుట్టుకను బట్టి అమలు జరిగే ఒక నిచ్చెన మెట్ల మాదిరి వ్యవస్థగా ఇది ఉంది. ఒక్కో గుంపు ఒక్కో ప్రత్యేకమైన వృత్తిని నిర్వహిస్తుంది. అది వంశపారంపర్యంగా సంక్రమిస్తుంది. ఈ వ్యవస్థలో అంతర్భాగంగా అంటరానితనం, కంట బడకూడని ఆచారం అనే సహించరాని ఆచారాలు ఉన్నాయి. తక్కువ కులపు వ్యక్తిని ముట్టుకున్నా, లేక చూసినా అగ్రకులానికి చెందిన వ్యక్తి మైల పడిపోతాడనే ఊహ ప్రాతిపదికన ఈ ఆచారాలు ఏర్పడ్డాయి. ఈ తక్కువ కులాలకు చెందిన వారు ఎటువంటి స్వంత భూమినీ కలిగివుండకూడదనీ, వారు తమ గ్రామాన్ని విడిచిపెట్టి పోరాదనీ ఆచారాలు ఆంక్షలు విధించాయి. తద్వారా అగ్రకుల భూయజమానులకు అవసరమైన కూలి మనుషులు ఎప్పుడు కావాలన్నా లభించే ఏర్పాటు జరిగింది. వ్యవసాయ భూములు సాధారణంగా గ్రామాలకు పరిసరాల్లో ఉంటాయి. ఆ రోజుల్లో కూలీలు వేరే ప్రదేశాలకు తరలిపోయి స్వంతంగా, స్వతంత్రంగా జీవించే అవకాశాలు మెండుగా ఉన్నాయి గనుక ఆ విధంగా జరగకుండా ఈ ఆంక్షలు వచ్చాయి.

సామాజిక, ఆర్థిక అసమానతలు ఈ విధంగా వ్యవస్థీకృతం అయిపోయిన ఈ సమాజంలో వలసపాలన ఫలితంగా చట్టం ముందు అందరూ సమానులే అన్న సూత్రం (మొక్కుబడిగానే) ప్రవేశించింది. ఐతే అదే వలసపాలన భౌతిక జీవితంలో అసమానతలను మరింత పెంచింది. పారిశ్రామిక ఉత్పత్తులను పెద్ద ఎత్తున దిగుమతి చేసి ఇక్కడి చేతివృత్తులను నాశనం చేయడం, పన్నుల పేరుతో రైతులనుండి భారీగా వసూళ్ళు చేసి ఆ ధనంతోనే ఇక్కడి వ్యవసాయోత్పత్తులను చేజిక్కించుకోవడం జరిగింది. దీనివలన తక్కువ కులాల ప్రజల భౌతిక జీవన పరిస్థితులు మరింత దిగజారాయి.

సామాజిక న్యాయం కోసం, విముక్తి కోసం 19, 20 శతాబ్దాలలో సాంఘిక ఉద్యమాలు జరిగాయి. వాటితోబాటు సమాంతరంగా సామ్రాజ్యవాద వలస పాలనకు వ్యతిరేకంగా పోరాటం జరిగింది. స్వాతంత్ర్యం వచ్చాక, ఒక రాజ్యాంగాన్ని రూపొందించడం జరిగింది. చట్టం ముందు అందరూ సమానులే అన్న మొక్కుబడి సూత్రం స్థానంలో ప్రజాతంత్ర పాలన, వయోజనులందరికీ ఓటుహక్కు, ఎన్నికలద్వారా ప్రభుత్వం ఏర్పాటు, షెడ్యూల్డ్ కులాలకు, షెడ్యూల్డ్ తెగలకు చట్ట సభలలో, ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్లు వచ్చాయి. ఆ తర్వాత కాలంలో ఈ రిజర్వేషన్లను కొన్ని బిసి కులాలకు కూడా వర్తింపజేశారు.

ఐతే, స్వాతంత్ర్యానంతర కాలపు అనుభవాన్ని బట్టి, ప్రజలను పుట్టుకను బట్టే ఎక్కువ, తక్కువ స్థాయిలకు చెందినవారిగా విడదీసే కులవ్యవస్థ ఉనికిలో ఉన్నంతకాలం, రాజ్యాంగపరంగా కుల అణచివేతను నిర్మూలించడానికి రూపొందించిన చర్యలు ఏవీ తమ లక్ష్యాన్ని నెరవేర్చలేవు అన్నది స్పష్టం అయింది. ఈ నిచ్చెనమెట్ల మాదిరి అసమానతలతో కూడిన కుల వ్యవస్థే అణచివేతతో కూడివుంది. **రిజర్వేషన్ల ఫలితంగా అన్ని వృత్తులలోనూ, ఉద్యోగాలలోనూ అణగారిన కులాలవారికి కూడా తమ జనాభా నిష్పత్తి ప్రకారం అవకాశాలు లభించాయని మాటవరసకి అనుకున్నా, సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న కుల వ్యవస్థ, దానిని బలపరిచే సిద్ధాంతం, భావజాలం ఉన్నంతకాలమూ (ఈ సిద్ధాంతానికి, భావజాలానికి అటు అణచివేసే తరగతులు, ఇటు అణచివేయబడుతున్న తరగతులు రెండూ తలొగ్గాయి) సమాజంలో సామాజిక అణచివేత కొనసాగుతూనేవుంటుంది. ఆర్థిక వ్యవస్థలో అణచివేతను తొలగించినంత మాత్రాన కుల వ్యవస్థ ఈ సమాజంలో అంతరించదు. కులపరంగా మనుషుల్ని గుర్తించే విధానమే మొత్తంగా అంతం కావాలి. అంబేద్కర్ చెప్పినట్టు కుల నిర్మూలన సాంతం జరగాలి.** గాంధీ దీనికి భిన్నంగా ఎక్కువ తక్కువలు లేని, అణచివేత లేని కుల వ్యవస్థ కొనసాగవచ్చునని అందులో చేసే పనికి కులానికి ఉన్న సంబంధాన్ని తెగతెంచి అందరూ అన్ని రకాల పనులనూ పంచుకునేలా మార్పు చేయవచ్చునని భావించాడు. (ఆ మేరకు గాంధీ ఆశ్రమాల్లో మరుగుదొడ్లు శుభ్రం చేయడంతో సహా అన్ని పనులనూ అందరూ పంచుకునేవారు.)

ఇక్కడే సంబంధాల చర్చ తలెత్తుతుంది. సమాజంలో ప్రతీ ఒక్కరికీ ఏదో ఒక సమూహంతో సంబంధం ఉంటుంది. ఇది నా స్వంత సమూహం అనే విధంగా ఆ సంబంధం ఉంటుంది. అది సాధారణంగా కుల సంబంధంగా ఉంటుంది. సమాజంలో వివిధ సమూహాల (కులాల) ప్రజలు పాదార్థిక జీవితంలో సమానత్వాన్ని సాధించినప్పటికీ, కుల వ్యవస్థ కొనసాగుతున్నందున, ఒక కులం పట్ల మరొక కులానికి చిన్నచూపు ఉండడం అనేది కొనసాగుతూనేవుంటుంది. అందువల్ల అణచివేత కొనసాగుతూనేవుంటుంది. ఫలితంగా సామాజిక అభివృద్ధి అసంపూర్ణంగా ఉండిపోతుంది. ఈ పరిస్థితి సహించరానిది.

**❝ తమ మీద అణచివేత సాగుతోందన్న వాస్తవాన్ని ఆ సమూహం గుర్తించకపోయినా, లేక, అణచివేతను వారు ఆమోదిస్తున్నా, కుల అణచివేత సాగుతోందంటూ చెప్పడం అంటే ఆ సమూహాలమీద (అణగారిన కులాల ప్రజల మీద) బలవంతంగా మన అభిప్రాయాన్ని రుద్దడమే అని వాదించే వారున్నారు. కాని ప్రస్తుతం తమమీద అణచివేత సాగడం లేదంటూ వారు తిరస్కరించినా, వారి సమస్య ఎప్పుడో ఒకప్పుడు స్పష్టమైన రూపు తీసుకుంటుంది. ❞**

అణచివేతను భరిస్తున్న తరగతుల ప్రజలు తమ పరిస్థితి ఆ విధంగా ఉండడం మామూలేనని భావించి సర్దుకుపోయేటట్టు వారిని భావజాలపరంగా సంసిద్ధం చేసినా, (ఇది దైవ నిర్ణయం అనో, తలరాత అనో, కట్టుబాట్లు అతిక్రమించకూడదనో భావించేలా చేయడం) వారిని అణచివేయడం అనేది జరుగుతూనేవుంటుంది. తమ కుల సమూహంతో వారికి ఉన్న సంబంధం రీత్యా కూడా వారు ఆ విధంగా అణచివేతకు తలొగ్గ వచ్చు. ఆ విధంగా వారు అణచివేతను ఆమోదించడం లేదా సహించడం బట్టి అణచి వేత సమర్ధనీయం ఎంతమాత్రమూ కాదు.

తమ మీద అణచివేత సాగుతోందన్న వాస్తవాన్ని ఆ సమూహం గుర్తించకపోయినా, లేక, అణచివేతను వారు ఆమోదిస్తున్నా, కుల అణచివేత సాగుతోందంటూ చెప్పడం అంటే ఆ సమూహాలమీద (అణగారిన కులాల ప్రజల మీద) బలవంతంగా మన అభిప్రాయాన్ని రుద్దడమే అని వాదించేవారున్నారు. కాని ప్రస్తుతం తమమీద అణచివేత సాగడం లేదంటూ వారు తిరస్కరించినా, వారి సమస్య ఎప్పుడో ఒకప్పుడు స్పష్టమైన రూపు తీసుకుంటుంది. అప్పుడు తరతరాలుగా సాగుతున్న అణచివేత మీద ఆగ్రహం పెల్లుబుకుతుంది. ప్రస్తుతం వారు మౌనంగా ఉన్నారనో, లేక ఆధిపత్య కులవ్యవస్థ కట్టుబాట్లకు వారు లోబడివున్నారనో వాదించడం అంటే వివక్షపూరితమైన కుల వ్యవస్థ కొనసాగడం మామూలేనన్న వైఖరి తీసుకోవడమే. అంతే గాక వివక్షతను భరించాలన్న తప్పుడు భావనను సమర్ధించడమే ఔతుంది. పైగా కుల ప్రాతిపదిక మీదనే సామూహిక సంబంధాలు కొనసాగడంలో తప్పు లేదని, అలా కొనసాగుతూనే వుంటాయని, కుల వ్యవస్థ ఉనికితో సామాజికాభివృద్ధికి ఏ సంబంధమూ లేదని వాదించడమే ఔతుంది.

మరొక్కసారి మననం చేసుకోవాలంటే, ఇప్పుడు కావలసింది ఈ వివక్షపూరితమైన, అణచివేతతో కూడిన వ్యవస్థను వదిలించుకుని ముందుకు పోవడం. దాంతోబాటు కుల పరంగా ఏర్పడిన సామూహిక సంబంధాలను, ఆ సంబంధాలను సమర్ధించే సైద్ధాంతిక భావజాలాన్ని కూడా వదిలించుకుని ముందుకు పోవాలి. కావలసినది కుల నిర్మూలన. అది జరగనంతకాలం, ప్రజలు తాము ఏదో ఒక కులానికి చెందినవారమేనన్న భావనతో ఉండి ఆ సంబంధాలను కొనసాగిస్తున్నంతకాలం నిజమైన సామాజిక పురోగతి అనేది సాధ్యం కాకుండాపోతుంది.

స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో కుల సమస్య పరిష్కారానికి రకరకాల ప్రయత్నాలు జరిగాయి. ప్రభుత్వ ఉద్యోగాలలో, ప్రభుత్వ విద్యా సంస్థలలో రిజర్వేషన్ విధానాన్ని ప్రవేశపెట్టి సామాజిక న్యాయం కోసం గట్టి జోక్యం చేసుకున్నారు. అదే సమయంలో అణచివేతకు గురౌతున్న కులాల ప్రజల్లో అస్థిత్వ రాజకీయాలు తలెత్తాయి. ముఖ్యంగా ఇవి ఎన్నికల రంగంలో వ్యక్తం అయాయి. ఒక వ్యక్తి-ఒక వోటు అన్న విధానం ఉంది గనుక, అణచివేతకు గురౌతున్న కులాల ప్రజలు సంఖ్యరీత్యా అధికంగా ఉన్నారు గనుక, ఆ తరగతుల పాదార్ధిక, సామాజిక, సాంస్కృతిక ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించే రాజకీయ పార్టీలను అధికారంలోకి తేవాలనే దిశగా ఇవి వ్యక్తం అయాయి. ఇటువంటివే మరికొన్ని వ్యూహాలు కూడా అమలు చేయడానికి ప్రయత్నాలు జరిగాయి. కులాల దొంతరలకు, వర్గపరమైన దొంతరలకు సంబంధం తెగ్గొట్టడానికి తోడ్పడుతుందన్న భావనతో దళిత పెట్టుబడిదారుల సంఖ్యను బాగా పెంచడానికి ప్రయత్నాలు జరిగాయి. కాని ఈ ప్రయత్నాలన్నీ ఆయా కుల సమూహాల సామాజిక సంబంధాల చట్రానికి లోబడే జరిగాయి. కుల అణచివేతకు ముగింపు పలకాలన్న ప్రయత్నంలో భాగంగా జరిగే ఈమాదిరి ప్రయత్నాలను బలపరచవలసిందే. కాని ఈ ప్రయత్నాలతోటే గమ్యం సిద్ధించదు. ఈ ప్రయత్నాలేవీ కుల నిర్మూలనకు దారి తీయవు.

జనాభాలో కులాలవారీగా ఏయే నిష్పత్తిలో ఉన్నారో, వివిధ వృత్తులు, ఉద్యోగాలు, వ్యాపకాల్లో ఆ కులాల భాగస్వామ్యం అదే నిష్పత్తిలో లేదు. ఈ పరిస్థితిని సరి చేయాలి. ఐతే అలా సరి చేసినంతమాత్రాన కుల అణచివేత అంతం కాదు. పైగా ఫక్తు అస్థిత్వ రాజకీయాలను అనుసరించడం ద్వారా గానీ, అస్థిత్వ ప్రాతిపదికన డిమాండ్లు లేవనెత్తి వాటిని సాధించుకోడానికి ప్రయత్నించడం ద్వారా గానీ నిష్పత్తిని సరి చేయడం సాధ్యం కాదు. ప్రస్తుతం సమాజంలో రాజకీయ, సామాజిక అధికారం అగ్రకులాలకు అనుకూలంగా సాగుతోంది. అందువలన అస్థిత్వ ప్రాతిపదికన లేవనెత్తిన డిమాండ్లను పరిష్కరించడానికి ఈ పరిస్థితి ఎంతమాత్రమూ ఒప్పుకోదు. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో అంగీకరించినా, ఆ తర్వాత ఆచరణలో వాటిని తిరస్కరించడం జరుగుతుంది. అంతేకాదు, ఇప్పుడు అమలులో ఉన్నవాటిని సైతం తిరగదోడడం జరుగుతుంది.

ప్రస్తుతం భారతదేశంలో దళితులకు, ఒబిసి లకు అమలులో ఉన్న రిజర్వేషన్లను రెండు వ్యూహాలతో దెబ్బ తీస్తున్నారు. మొదటిది: రిజర్వేషన్లు వర్తించే ప్రభుత్వ రంగాన్ని కుదించివేస్తున్నారు. ఇది ప్రభుత్వమే అమలు జరపడానికి పూనుకున్న, నయా-ఉదారవాద విధానాలు నిర్దేశించిన ప్రకారం జరుగుతోంది. మరోపక్క రిజర్వేషన్లను జాట్, పటేల్ వంటి వెనుకబడని కులాలవారికి కూడా వర్తింపజేయాలన్న డిమాండ్లు ముందుకు వస్తున్నాయి. ఆ కులాలకు చెందినవారు అనుసరిస్తున్న అస్థిత్వ రాజకీయాలలో భాగం ఇది. ఈ తరహా డిమాండ్లు నిజంగా అణచి వేతకు గురౌతూ రిజర్వేషన్ సదుపాయాన్ని పొందుతున్న తరగతుల పరిస్థితిని బలహీన పరుస్తుంది. (ఈ తరగతులవారికి రిజర్వేషన్లు కల్పించేటప్పుడు ఆర్థిక కొలబద్దను ప్రవేశ పెట్టాలన్న డిమాండ్ ఇందుకు ఒక ఉదాహరణ) ఇక రెండవది: ఒక కులానికి ఇంకొక కులానికి మధ్య ఘర్షణను పెంచేది. ఈ ఘర్షణల వెనుక కేవలం ఆయా సమూహాలుగా కలిగివున్న సంబంధాలే ప్రాతిపదికగా ఉంటాయి. అందుచేత అస్థిత్వ రాజకీయాలు ఆర్థిక పరంగా కుల అణచివేతను తగ్గించడానికి దోహద

పడవు. ఇక కుల నిర్మూలనకు తోడ్పడవని వేరే చెప్పనక్కరలేదు.

ఇప్పుడు కావలసింది కులం అనే ఒక ప్రాతిపదికన సామూహిక సంబంధాలను కలిగివుండే పరిస్థితిని మొత్తంగా అధిగమించడం. అణచివేతకు గురౌతున్న కులాలవారు, ఇతర కులాలకు చెందినవారితో కలిసి కుల సంబంధాలను అధిగమించి ఉమ్మడి అంశం ప్రాతిపదికన ఉన్నతస్థాయిలో సామూహిక సంబంధాలను పెంపొందించుకోవడం. కులాంతర వివాహాలు జరగడం, పేరులో కులాన్ని సూచించే భాగాన్ని విసర్జించడం వంటి సాంస్కృతికపరమైన చర్యలద్వారా ఈ లక్ష్యాన్ని చేరుకోవడం సాధ్యం అని ఒకప్పుడు భావించారు. ఇప్పటికీ ఆ విధమైనచర్యలు తోడ్పడతాయి. కాని వాటి ప్రభావం చాలా పరిమితంగా మాత్రమే ఉంటుంది. కుల సంబంధాలను అధిగమించగల సంఘీభావాన్ని పెంపొందించగల ఉమ్మడి పోరాటాలు చేపడితేనే కుల సంబంధాలను అధిగమించగలం.

యూరప్ ఖండంలోని అనుభవాలను చూసిన అనంతరం మన దేశంలో ఏర్పరచుకున్న మార్క్సిస్టు అవగాహన ప్రకారం పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందే కొద్దీ పెరిగే వర్గపోరాటాలు కులాలకు అతీతంగా కొత్త సంఘీభావాన్ని సాధించడానికి దారి తీస్తాయి. యూరప్‌లో పెట్టుబడిదారీ విధానం పాత ఫ్యూడల్ సమాజపు సామూహిక సంబంధాలను పూర్తిగా నాశనం చేసింది. ఆ క్రమంలో చెల్లాచెదురైనవారందరినీ తన చట్రంలో శ్రామికులుగా ఇముడ్చుకుంది. ఆ విధంగా ఒక దగ్గరకు చేరిన శ్రామికులు కొత్త సమూహాలుగా సంఘటితం కావడం ప్రారంభించారు. అటువంటి అనుభవమే భారతదేశంలో కూడా ఎదురౌతుందని మార్క్సిస్టులు భావించారు.

కాని ఆ విధంగా జరిగే అవకాశాలు కనిపించడం లేదు. యూరప్ పరిస్థితులకీ, ఇక్కడి పరిస్థితులకీ తేడా ఉంది. యూరప్ లో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి జరిగే క్రమంలో అక్కడి పాత ఫ్యూడల్ సంబంధాలు నాశనం అయ్యాయి. బతుకుతెరువు కోల్పోయిన వారు అమెరికా, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా తదితర ప్రాంతాలకు వలసలు పోయారు. అక్కడ వారు కొత్త జీవితాలను ప్రారంభించారు. దీనివలన ఇటు యూరప్ లోను, అటు కొత్తగా స్థిరపడిన ప్రాంతాలలోను పనులకు అవసరమైనంతమంది కార్మికులు లేకుండా పోయారు. నిరుద్యోగం చాలా పరిమితంగా ఉండేది. ఈ పరిస్థితుల్లో శ్రామిక జనం తమను తాము సంఘటితం చేసుకోవడం ప్రారంభించారు. తద్వారా ఇటు యూరప్‌లో ఫాక్టరీలలోను, అటు కొత్తగా స్థిరపడే ప్రాంతాలలోను వారు మెరుగైన జీవితాలను సాధించుకునే అవకాశాలు వచ్చాయి. భారతదేశం నుండి అటువంటి వలసలు పోగలిగిన పరిస్థితులు లేవు.

> **"పెట్టుబడిదారీ వ్యవస్థలో అందరికీ ఉపాధి కల్పించగల సామర్థ్యం లేదు. పాత సమాజంలో సాంప్రదాయ వృత్తులలో జీవిస్తూ ఇప్పుడు పారిశ్రామికీకరణ కారణంగా ఉపాధి కోల్పోయినవారితో బాటు జనాభా పెరుగుదల రీత్యా కార్మిక వర్గ కుటుంబాలలో కొత్తగా వచ్చే నిరుద్యోగులను కూడా కలిపితే వారందరికీ పెట్టుబడిదారీ వ్యవస్థ ఉపాధి కల్పించలేదు."**

పెట్టుబడిదారీ వ్యవస్థలో అందరికీ ఉపాధి కల్పించగల సామర్థ్యం లేదు. పాత సమాజంలో సాంప్రదాయ వృత్తులలో జీవిస్తూ ఇప్పుడు పారిశ్రామికీకరణ కారణంగా ఉపాధి కోల్పోయినవారితో బాటు జనాభా పెరుగుదల రీత్యా కార్మికవర్గ కుటుంబాలలో కొత్తగా వచ్చే నిరుద్యోగులను కూడా కలిపితే వారందరికీ పెట్టుబడిదారీ వ్యవస్థ ఉపాధి కల్పించలేదు. ఐతే నిరుద్యోగం బాహాటంగా కనిపించదు. శాశ్వత ఉద్యోగాలను మెరుగైన జీతాలను కలిగివుండే కార్మికులతోబాటు తాత్కాలిక ప్రాతిపదికన పని చేసే శ్రామికులు, కొన్ని రోజులు పనులు దొరికి, తక్కిన రోజుల్లో పనులు దొరకని కార్మికులు, స్వయం ఉపాధి వెతుక్కునే కార్మికులు– ఇలా ప్రచ్ఛన్నంగా నిరుద్యోగం విపరీతంగా పెరుగుతుంది. గౌరవప్రదమైన ఉపాధికి కొరత తీవ్రంగా ఉందని ఐఎల్ఓ స్వయంగా ఒప్పుకుంది. అటు గ్రామసీమల్లో దారిద్ర్యంతో సతమతమౌతున్న ప్రజానీకం, ఇటు పట్టణాల్లో ముక్కముక్కలుగా చెదిరిపోయిన శ్రామికజనం ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. ఈ కారణం చేత వారిలో బలంగా సంఘటితం అయే శక్తి కొరవడింది. అందరూ ఐక్యమై ఒకరికొకరు తోడుగా నిలిచే స్ఫూర్తి పెంపొందే అవకాశాలు లేవు.

ఈ పరిస్థితులు వారిలో అస్థిత్వ రాజకీయాలు బలపడడానికి, అందునా కుల ప్రాతిపదికన రాజకీయాలు బలపడడానికి దారి తీశాయి. పెట్టుబడిదారీ సరుకుల ఉత్పత్తి విధానం కార్మికులను ముక్కముక్కలుగా చీల్చి, ఒకరికి వ్యతిరేకంగా ఇంకొకరు నిలిచి ఘర్షించే పరిస్థితులు కల్పిస్తుంది. సంఘటితం కావడానికి పూర్తి వ్యతిరేక దిశలో ఈ చీలికలు ఉంటాయి. అటువంటి చీలికలను నివారించడానికే సంఘటితం కావడం అవసరం అవుతుంది. కాని అటువంటి సంఘటనలను నిర్మించడం కష్టం ఔతుంది. ముఖ్యంగా ఉద్యోగాలు తాత్కాలిక స్వభావంతో ఉండడం, రకరకాల పద్ధతులలో కార్మికులను పనుల్లో నియోగించడం వలన వారిని సంఘటితం చేయడం దుర్లభం ఔతుంది. ముక్కముక్కలుగా చీలిన కార్మికవర్గపు పరిస్థితికి రెండో ముఖంగా అస్థిత్వ రాజకీయాలు ముందుకొస్తాయి. నయా–ఉదారవాద శకంలో భారతదేశంలో స్థూల జాతీయోత్పత్తి ఎంత వేగంగా పెరిగినా, అది కార్మికులను ఆర్థికంగా ముక్కముక్కలుగా చీల్చివేస్తోంది. తగినంత సంఖ్యలో ఉపాధి కల్పించే సామర్థ్యం ఈ వ్యవస్థకు లేకపోవడమే ఇందుకు కారణం. అదే సమయంలో ఈ నయా–ఉదారవాద విధానాలు కార్మికవర్గ చీలికలకు రాజకీయ రూపంగా అస్థిత్వ రాజకీయాలను ముందుకు తెస్తున్నాయి.

కార్మికులను ఆర్థికంగా ముక్కముక్కలుగా చీల్చడం ఒకవైపు జరుగుతూంటే, అటు గ్రామసీమల్లో వ్యవసాయరంగంలోని శ్రామికులను సంఘటితం చేయడానికి కులం ఒక పెద్ద ఆటంకంగా ఉంటోంది. అటువంటి పరిస్థితి కార్మికోద్యమం తొలిరోజుల్లో పట్టణాలలో సైతం ఎదుర్కొంది. (కమ్యూనిస్టుల నాయకత్వంలోని కార్మిక సంఘాలతో సహకరించడానికి అంబేద్కర్ దళిత కార్మికుల సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఈ రెండు సంఘాల సభ్యులూ ఫాక్టరీ ఆవరణలోని ఒకే మంచినీటి కొళాయి నుండి నీరు తాగాలన్న షరతు పెట్టారు) అందుచేత కార్మికవర్గం సంఘటితమై కుల సమూహాల సంబంధాలను అధిగమించే స్థాయికి చేరుకోవడం కష్టసాధ్యం అవుతుంది. పైగా చిన్న ఉత్పత్తిదారులు, చిన్న రైతులు,

> **ఈ డిమాండ్లు వివిధ కుల సమూహాలకు చెందిన ప్రజలందరినీ ఒక దగ్గరకు చేర్చి వారు కుల బంధాలను అధిగమించగలిగే చైతన్యాన్ని పొందేట్లు చేయగలవు. ఐతే, అందరికీ ఉపాధి హక్కు కల్పించినంతమాత్రాన, హీనమైన పనుల్లో, ఎక్కువ కష్టం ఇమిడివున్న పనుల్లో తక్కువ కులాలవారే ఎక్కువమంది కుదురుకునే పరిస్థితి మారిపోదు. ఆ సమస్యను పరిష్కరించడానికి అన్నిస్థాయిలలోనూ రిజర్వేషన్లు అమలు చేయడం ఉపాధి హక్కు అందరికీ కల్పించిన అనంతరం కూడా అవశ్యం అవుతుంది.**

వ్యవసాయ కూలీలు కలిపితే చాలా పెద్ద సంఖ్యలో ఉంటారు. వారితో పోల్చితే కార్మికుల సంఖ్య చాలా తక్కువ. అందుచేత కుల బంధాలను అధిగమించగలిగేంత బలంగా శ్రామికవర్గ బంధాలు రూపొందడం చాలా కష్టం.

మరి కుల బంధాలను అధిగమించ గలిగేంత బలమైన బంధాలు శ్రామిక ప్రజానీకం నడుమ ఏర్పడి నిజమైన సామాజిక పురోగతిని సాధించడం ఎలా? మన రాజ్యాంగం ప్రకారం ఈ దేశంలో పౌరులందరూ సమానులే. ఆ ప్రాతిపదికన ప్రజలమధ్య ఒక విశాలమైన బంధం ఏర్పడడానికి ఆటంకంగా ఉపాధి అవకాశాల కొరత ఉంది. నయా-ఉదారవాద విధానాలు అమలయ్యే క్రమంలోనే ఈ కొరత పెరుగుతూ వచ్చింది. **కొన్ని సార్వత్రిక స్వభావం కల న్యాయమైన హక్కుల సాధన కోసం ప్రజలందరినీ సమీకరించి సంఘటితం చేయగలిగితే ఆ హక్కుల కోసం జరిగే పోరాటం ప్రజలను కుల బంధాలను అధిగమించగలిగేలా చేయగలుగుతుంది. ఇప్పుడు ప్రజలందరికీ సార్వత్రికంగా ఓటు హక్కు ఒకేలా ఉంది. మరికొన్ని న్యాయమైన ఆర్థిక కోర్కెల కోసం పౌరులను సంఘటితం చేయగలిగితే అప్పుడు వారంతా కుల బంధం కన్నా ఉన్నతమైన, విశాలమైన బంధం ఏర్పరచుకుంటారు. అటువంటి సార్వత్రిక ఆర్థిక హక్కుల సాధన కోసం జరిగే కృషి అస్థిత్వ రాజకీయాల అడ్డుగోడలను కూడా అధిగమించగలుగుతుంది. అప్పుడు కుల బంధాలు వెనక్కి పోతాయి. అదే సమయంలో సాంఘిక అసమానతలను తొలగించేందుకోసం ప్రస్తుతం అమలు జరుగుతున్న రిజర్వేషన్లు వంటి ప్రత్యేక ఏర్పాట్లను ఆ కృషి ఏ మాత్రమూ ఆటంకపరచదు.**

అటువంటి సార్వత్రిక హక్కులను, తక్షణం ఆచరించగలిగినవిగా ఉండేవాటిని కొన్నింటిని ఇక్కడ పేర్కొనవచ్చు. ఆహార హక్కు ఉపాధి హక్కు, ప్రభుత్వం ద్వారా ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలు పొందే హక్కు, ప్రభుత్వం ద్వారా ఉచితంగా నాణ్యమైన విద్య పొందే హక్కు, వృద్ధాప్యంలోను, అంగవైకల్యంతో ఉన్నప్పుడు పెన్షన్ పొందే హక్కు – ఈ హక్కులను అందరికీ వర్తించేలా చేయడం కోసం తగిన ఆచరణ చేపట్టాలి.

ఈ డిమాండ్లు వివిధ కుల సమూహాలకు చెందిన ప్రజలందరినీ ఒక దగ్గరకు చేర్చి వారు కుల బంధాలను అధిగమించగలిగే చైతన్యాన్ని పొందేట్లు చేయగలవు. ఐతే, అందరికీ ఉపాధి హక్కు కల్పించినంతమాత్రాన, హీనమైన పనుల్లో, ఎక్కువ కష్టం ఇమిడివున్న పనుల్లో తక్కువ కులాలవారే ఎక్కువమంది కుదురుకునే పరిస్థితి మారిపోదు. ఆ సమస్యను పరిష్కరించడానికి అన్ని స్థాయిలలోనూ రిజర్వేషన్లు అమలు చేయడం ఉపాధి హక్కు అందరికీ కల్పించిన అనంతరం కూడా అవశ్యం అవుతుంది. అంటే సార్వత్రిక హక్కుల సాధన కోసం జరిగే కృషి రిజర్వేషన్ల అవసరాన్ని ఏమాత్రమూ నిరాకరించదు. పైగా అటువంటి సార్వత్రిక హక్కుల కోసం జరిగే కృషి వలన అగ్ర కులాలలోని సామాన్యులు సైతం రిజర్వేషన్ల విషయంలో తమ ప్రతికూలతను అధిగమించగలుగుతారు. ఆ క్రమంలో కుల బంధాలను అధిగమించగలిగే ఐక్యత ప్రజల్లో ఏర్పడుతుంది. అక్కడినుంచి కుల నిర్మూలన దిశగా సాగిపోవడం తేలిక అవుతుంది. అదే అస్థిత్వ రాజకీయాలనే అనుసరించితే అవి కులాల నడుమ శతృత్వాన్ని పెంచి కుల నిర్మూలనను అసాధ్యం చేస్తాయి.

ఇక్కడ ఇంకొక ముఖ్యమైన విషయాన్ని కూడా పరిశీలించాలి. భారతీయ సమాజంలో కేవలం కులం అనేదే లోపం అని అనుకోరాదు. మతపరమైన చీలికలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా ఇవి హిందువులు, ముస్లింల నడుమ పెరుగుతున్నాయి. ఈ మధ్య కాలంలో ఇవి ముఖ్య భూమికను పోషిస్తున్నాయి కూడా. ఈ మతవిభేదాలు, కుల సమస్య రెండూ ముడిపడివున్నవే. భారత ఉప ఖండంలో ముస్లింలుగా మారినవారిలో అత్యధికులు తక్కువ కులాలనుండి వచ్చినవారే. మతం మారినప్పటికీ వారింకా చాలా అధమ స్థాయిలోనే కొనసాగుతున్నారు. వేరుగా చూడబడుతున్నారు. పైగా, హిందువులలోని తక్కువ కులాలవారికి ఉన్న మాదిరిగా రిజర్వేషన్లు వారికి లేవు. ఇస్లాం మతం కులాన్ని అధికారికంగా గుర్తించదు కనుకనే ఈ పరిస్థితి ఉంది. అందువల్లనే, విద్యాస్థాయి వంటి సామాజిక ప్రమాణాలను చూసినప్పుడు ముస్లింలు దళితులకన్నా దిగువ స్థాయిలోనే ఉన్నారు. ఇటీవల కాలంలో కొన్ని రాష్ట్రాలలో వెనుకబడ్డ కులాల కోటాలో అంతర్భాగంగా ముస్లింలకు కూడా రిజర్వేషన్లు కల్పించారు. (మొత్తం అన్ని రకాల రిజర్వేషన్ కోటాలూ కలిపి ఒకానొక శాతాన్ని మించి ఉండకూడదని సుప్రీం కోర్టు ఆదేశించింది) కాని హిందూత్వ వాదులు నిరంతరం హిందువులలో ముస్లిం-వ్యతిరేకతను రెచ్చగొడుతూన్నందువలన ముస్లింలకు ఉద్దేశించిన రిజర్వేషన్లు అమలుకాకుండా మిగిలిపోయాయి. పౌరులు అనే భావనను, ఆ పౌరులందరికీ కులం, మతంతో నిమిత్తం లేకుండా కొన్ని హక్కులు- ఓటు హక్కు ఉన్నట్టే -సార్వత్రికంగా ఉండాలన్న డిమాండ్‌ను ముందుకు తెచ్చినట్లైతే మనం ముందుకు పురోగమించడానికి దారి ఏర్పడుతుంది.

ఇదంతా చర్చించడం అంటే ఒకానొక 'పౌరుల పోరాటం' అనేదానిని తెచ్చి దానిని వర్గ పోరాటానికి ప్రత్యామ్నాయంగా చూడమని చెప్పడం ఎంతమాత్రమూ కాదు. అసలు వర్గ పోరాటం అనేదే ప్రతీ పౌరుడికీ కొన్ని కనీస ప్రమాణాలతో కూడిన పాదార్థిక, సాంస్కృతిక జీవితం గ్యారంటీ చేయడం లక్ష్యంగా ముందుకు సాగాలి అని మాత్రమే సూచిస్తున్నాను.

ఇక్కడ ఒక ప్రశ్న తలెత్తుతుంది. ఈ సార్వత్రిక హక్కులు అనేవి ఆచరణ సాధ్యమేనా? దీనికి సమాధానం ఒక్కటే. ఇప్పుడున్న పరిస్థితుల్లో మనం వేటిని మార్చగలం, ఏవి కొనసాగాలని భావిస్తున్నాం అన్నది ముందు మనం తేల్చుకోవాలి. ప్రస్తుత పరిస్థితుల్లో వేటినీ మార్చలేము అని అనుకుంటే అప్పుడు మనం ప్రస్తుత పరిస్థితులలోనే సర్దుకుని పోవలసి వుంటుంది. కుల బంధాలను, మతపరమైన బంధాలను అధిగమించి ఒక విశాలమైన

(మిగతా 36వ పేజీలో)

చర్చ

# అగ్నిపథ్ : నిప్పుతో చెలగాటం?




అశుతోష్ శర్మ

కానిస్టేబుళ్లు, ఖనిజాలు, అడవుల గార్డులు, జైలు వార్డెన్లు, ప్రత్యేక పోలీసు అధికారుల నియామకాల్లో 10% అగ్నివీరులకి కేటాయించాలని జులై 17 తేదీన హర్యానా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ రిజర్వేషన్ పద్ధతిని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తగ్గిన తన పరపతిని పెంచుకోడానికి ముఖ్య మంత్రి నాయబ్ సింగ్ సైనికఈ రిజర్వేషన్ పద్ధతిని ప్రకటించారు.

ఈ మధ్య కాలంలో అనేక రాష్ట్రాలు – ఒరిస్సా, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్ ఘర్, మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్ – సైన్యంలో అగ్నివీరుల సేవలు వినియోగించుకున్న తర్వాత, తమ తమ రాష్ట్రాలలోని యూనిఫారాలు వేసుకొనే సేవలలో వీరికి రిజర్వేషన్లుకల్పిస్తామని ప్రకటించాయి. జులై నెలలో జరిగిన పార్లమెంటు సమావేశాలలో ప్రతిపక్షం నుండి తీవ్రమైన విమర్శలు ఎదుర్కొన్న తరువాత హోమ్ శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్, మాజీ అగ్నివీరులకు ప్రభుత్వాల్లో సాధారణ విధులు నిర్వహించే కానిస్టేబుళ్లు, కేంద్ర సైనిక పోలీసు బలగం, అస్సాం రైఫిల్స్‌లో 10% రేజర్వేషన్లు కల్పిస్తామని, వయో పరిమితిని కూడా సవరించి పెంచుతామని ప్రకటించారు.

2022 జూన్ నెలలో అగ్నివీరుల నియామకాలను ప్రారంభించిన నాటి నుంచి ఈ పథకం అనేక విమర్శలకు తావిస్తోంది. ఈ పద్ధతి ఇదివరకటి సైనిక నియామక పద్ధతి స్థానంలో ప్రవేశ పెట్టబడింది. అగ్ని వీరులు సామాన్య సైనికుడి కన్నా తక్కువ జీతభత్యాలు పొందుతారు. వీరికి ఏడాదికి కేవలం 30 రోజులు మాత్రమే సెలవు ఉంటుంది. పైగా అగ్ని వీరులు ఉద్యోగంలో ఉండగా పెళ్లి చేసుకోకూడదు. వారు సైన్యంలో పనిచేసే నాలుగేళ్ల గడిచిన తరువాత, పెన్షన్లు గానీ , ఉచిత వైద్య సేవలు గానీ, ఇతర సదుపాయాలు గానీ పొందరు

అగ్ని వీరుల నియామకాలకు 17.5 నుంచి 21 ఏళ్ల లోపు వారు మాత్రమే అర్హులు. అగ్ని వీరులుగా నియమితులైన వారిలో 25% మందికి మాత్రమే తమ పదవీకాలం ముగిసిన తర్వాత కూడా సైన్యంలో కొనసాగే అవకాశం ఉంటుంది. మిగిలిన 75% ఇతర ఉపాధి వెతుక్కోవాల్సిందే. వారు పనిచేసిన కాలంలో దురదృష్ట వశాత్తు ఏ దుర్ఘటనలో చనిపోయినా, వారి కుటుంబాలకు సాధారణ సైనిక కుటుంబాలకు వచ్చే ఏ సౌకర్యం అందదు. ఆఖరికి పెన్షన్ కూడా రాదు.

మాజీ సైనికులకయినా ఉపాధి పొందడం అంత సులభమేం కాదు.

నిజానికి మాజీ సైనికులకు సైన్యం నుండి బయటికి వచ్చిన తర్వాత ఉద్యోగాలు దొరకడం ఇప్పటికే కష్టంగా ఉంది. ఉదాహరణకు నావీలోని అత్యంత ప్రతిష్టాత్మక మార్కోస్ కమాండోలలో టీమ్‌గా ఉన్న నలుగురిలో ప్రవీణ్ కుమార్ ఒకరు. ప్రవీణ్ కుమార్ సంగతే చూద్దాం. ఈయన 2008 లో ముంబైలో తాజ్ హెటల్‌ని తీవ్రవాదులు ఆక్రమించుకున్నప్పుడు, ఎదురునిలిచి పోరాడిన వారిలో ఒకరు. ఆ హెూటల్‌లో ఉన్న 200 మంది అతిథులను రక్షించడంలో అయిదు బుల్లెట్లు వాడారు. అతడు 33 వ ఏట పదవి విరమణ చేసారు. ఇప్పుడు అతనికి 39 సంవత్సరాలు. ఇప్పటికీ అతనికో ఉద్యోగం దొరకలేదు. ఉద్యోగ వేటలో సుదీర్ఘకాలం మునిగి, చివరికి , ఉన్నత విద్య వల్లనైనా జీవనోపాధి ఏర్పడుతుందనే ఆశతో లా లో డిగ్రీ సంపాదించారు. ఇప్పుడు ఢిల్లీలోని కర్కోరుడుమా జిల్లా కోర్టులో న్యాయవాద వృత్తి చేసుకుంటున్నారు.

ఆయన అగ్నిపథ్ స్కీమ్ గురించి మాట్లాడుతూ, "కేవలం వాగ్దానాలవలన ఒరిగేది ఏమీ ఉండదు. 33 నుంచి 60 ఏళ్లలోపు మాజీ సైనికులలో ఎక్కువమంది రక్షక ఏజెన్సీలలో పనులు చేసుకోవలసి వస్తున్నది. లేదా నిరుద్యోగులుగా మిగిలి పోవలసి వస్తున్నది. అందువలన అగ్ని వీరులుగా సేవలు ముగిసిన వెంటనే ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలలోని నియామకాలలో అగ్నివీరులకి రిజర్వేషన్‌లు ఉండేటట్టు చట్టం చేయాల్సి ఉంది" అన్నారు.

పదవీ విరమణ చేసిన మేజర్ జనరల్ యాష్ మోర్ మాట్లాడుతూ:"అగ్నిపథ్ పద్ధతిని సమగ్రంగా చర్చించాల్సిన అవసరం ఉంది. దాన్ని పూర్తిగా ప్రక్షాళన చేయాలి. సంస్కరించేటప్పుడు కింది స్థాయి నుంచి వచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది" అన్నారు. "అగ్నిపథ్ స్కీమును సైనికాధికారులు ఎందుకంగీకరించారో నాకైతే అర్థం అవ్వడం లేదు" అన్నారు. ప్రచార మాధ్యమాల్లో ప్రచారం జరుగుతున్నట్టు అది నిజంగా మంచి స్కీం అయి ఉంటే, దాన్ని సైన్యంలో అత్యంత ఉన్నత స్థాయిలో కూడా ప్రవేశపెట్టి ఉండవలసింది" అన్నారు. మేజర్ మనోజ్ ముకుంద్ నరవనే, 2022 ఏప్రిల్ 30వ తేదీన పదవీ విరమణ చేసిన తర్వాత "నాలుగు నక్షత్రాల గమ్యం" అనే తన స్వీయ చరిత్రలో తన జ్ఞాపకాలను పంచుకుంటూ ఈ పథకం గురించి ప్రస్తావించారు. అయితే, ఈ పుస్తక ప్రచురణకు రక్షణ మంత్రిత్వ శాఖ అనుమతి మంజూరు చేయవలసి ఉంది. 2023 డిసెంబర్‌లో వెలువడిన కొన్ని భాగాల ప్రకారం అగ్నిపథ్ పథకం ప్రవేశ పెడుతున్నట్టు తమకు ఏ మాత్రం సంకేతాలు కూడా రాలేదని నరవనె చెప్పారు. అది ఆకస్మికంగా తమకి తెలిసిందని అన్నారు. నౌకా దళం, ఎయిర్ ఫోర్స్ అధికారులు ఎవరికీ ఈ పథకం గురించి ఎఱుక లేదని అన్నారు. అగ్నివీరుల మొదటి సంవత్సరం, జీత భత్యాలు అన్నీ కలుపుకుని నెలకు రూ 20000/– ఉంటే సరిపోతుందని మొదట్లో ప్రతిపాదించడం జరిగింది. అయితే "ఇది మాకెవరికీ సమ్మతం కాదు. ఇక్కడ మనం దేశం కోసం తన ప్రాణాలను అర్పించడానికి సిద్ధపడిన ఒక సైనికుడి గురించి మాట్లాడు

**“భారతదేశ రక్షణ వ్యవస్థలో సంస్క రణలు తేవలసిన అవసరం ఉన్న మాట వాస్తవం. అయితే, అగ్నిపథ్ లాంటి సంస్కరణలు మాత్రం కాదు. ప్రభుత్వం ఎన్నిరకాల గారడీలు చేసినా, అగ్నిపథ్ లాంటి విధానం, భారతదేశ సైనిక వ్యవస్థను బలహీనపరుస్తుందన్న వాస్తవాన్ని మరుగు పరచలేదు. స్వతంత్రంగా ఒక ఆయుధ వ్యవస్థను వినియోగించడానికీ, ఒక టీమ్‌ని సమర్ధవంతంగా నడపడానికీ కనీసం ఎనిమిది, తొమ్మిదేళ్ల శిక్షణ అవసరం ఉంటుంది.”**

కుంటున్నాము. ఒక సైనికుడిని ఒక రోజువారీ జీతగాడితో సరిపోల్చలేం. ఆ తర్వాత మేమంతా గట్టిగా ప్రతిపాదించిన తరువాత దానిని రూ 30,000కి పెంచారు” అని చెప్పారు.

ఆ తరువాతి కాలంలో అన్ని సైనిక విభాగాల అధిపతులు ఈ పద్ధతికి ఆమోదం తెలిపారు. రక్షణ మంత్రి, ప్రధానమంత్రి, ఈ మధ్యకాలంలో కేంద్ర ఆర్థిక మంత్రి ఈ పథకానికి ఆమోదం తెలిపారు. ఈ ఏడాది జూన్ మాసంలో జనరల్ నరవనే ఒక వ్యాసం రాస్తూ, అగ్నిపథ్ పథకం ప్రయోజనకరంగా ఉందని రుజువయింది. దీనిని కేంద్ర అనుబంధ సంస్థలతో సహా అన్ని కేంద్ర ప్రభుత్వ సంస్థలలోనూ ప్రవేశ పెట్టవచ్చు. అయితే తగిన మార్పులు చేర్పులు చేయాల్సి ఉంటుంది అన్నారు. ఫ్రంట్ లైన్ పత్రిక విలేకరి ఆయనను సంప్రదించగా, “అదనంగా చెప్పాల్సింది ఏమీ లేదు” అని బదులిచ్చారు.

**ఖర్చులు తగ్గించుకునే పనేనా?**

పెన్షన్లు, జీతాల ఖర్చులు విపరీతంగా పెరిగిపోతుండటం వలన ఖర్చులు తగ్గించుకోవడానికి ఈ చర్య తీసుకున్నారని కొంతమంది విశ్లేషకులు అంటున్నారు. “మన రక్షణ విభాగపు పెన్షన్ ఖర్చులు పాకిస్థాన్ రక్షణ బడ్జెట్‌ని మించి ఉంటుంది. అది గ్రామీణ ఉపాధి పథకానికి గానీ, మన బడిపిల్లల మధ్యాన్న భోజన పథకానికి గానీ కేటాయించిన బడ్జెట్ నిధుల కంటే ఎక్కువ” అని రక్షణ శాఖ నిపుణుడు సుశాంత్ సింగ్ పేర్కొన్నారు. సైనిక పెన్షన్ ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయని ఆయన అన్నారు. వన్ రాంక్ వన్ పెన్షన్ పద్ధతి అమలులోకి వచ్చిన తరువాత ఈ ఖర్చు మరింత పెరిగింది. సైనిక బలగాల భారాలు మోయడం రోజురోజుకు తమకు మరింత భారంగా మారుతున్నదని ఒప్పుకోడానికి నరేంద్ర మోడీ ప్రభుత్వం వెనకాడుతున్నది. “ఇది అత్యంత గొప్ప జాతీయవాద ప్రభుత్వం. కానీ ఇది స్వారీ చేస్తున్నది సైన్యం భుజాలపైనే” అన్నారు.

“భారతదేశ రక్షణ వ్యవస్థలో సంస్క రణలు తేవలసిన అవసరం ఉన్న మాట వాస్తవం. అయితే, అగ్నిపథ్ లాంటి సంస్కరణలు మాత్రం కాదు. ప్రభుత్వం ఎన్నిరకాల గారడీలు చేసినా, అగ్నిపథ్ లాంటి విధానం, భారతదేశ సైనిక వ్యవస్థను బలహీనపరుస్తుందన్న వాస్తవాన్ని మరుగు పరచలేదు. స్వతంత్రంగా ఒక ఆయుధ వ్యవస్థను వినియోగించడానికీ, ఒక టీమ్‌ని సమర్ధవంతంగా నడపడానికీ కనీసం ఎనిమిది, తొమ్మిదేళ్ల శిక్షణ అవసరం ఉంటుంది. అగ్నిపథ్ పథకం సైనికులకు కేవలం మౌలిక కర్తవ్యాలను మాత్రమే నేర్పించగలుగుతుంది. గార్డుల శిక్షణ, ఆయుధాల నిర్వహణ వంటివాటిలో మాత్రమే శిక్షణ ఇవ్వగలుగుతారు” అని ఆయన అన్నారు .

ఈ పథకం సైన్యంలో విధేయత, సహకారం, పొందిక, స్నేహం పెంచడానికి బదులుగా పోటీ పెంచే అవకాశాలు ఉన్నాయి అంటారు మేజర్ జనరల్ మోర్ .

“అగ్నిపథ్ పథకాన్ని పోలీసు లేదా పారా మిలిటరీ శాఖలలో అమలు చేసి ఉండవలసింది. దీనిని పూర్తిగా తొలగించకుండా ఉండవలసి వస్తే, కనీసం 75% మందిని సైన్యంలో సాధారణ నియామకాల్లో ఇముడ్చుకుని మిగిలిన 25% మందిని బయటికి పంపేటట్టు చూసుకుని ఉంటే బాగుండేది”అని ఆయన అన్నారు.

ఇజ్రాయిల్, సింగపూర్, దక్షిణ కొరియాలలో లాగా భారతదేశం సైన్యం నియామకాలను “సరదా ప్రయాణం” గా అమలు చేయలేం. మనకి 7,000 కిలోమీటర్ల సరిహద్దు ఉంది. అది కూడా చైనా, పాకిస్థాన్ వంటి విరోధులతో. నాలుగేళ్లు మాత్రమే తన జీవితంలో రిస్క్ తీసుకోవలసి వస్తుందంటే, ఎవరైనా సామాజికంగా ఆర్థికంగా అందుకు సిద్ధ పడకపోవచ్చు. అది సరిహద్దుల్లో పని చేయడానికి నిరుత్సాహం కలిగిస్తుంది. అగ్నిపథ్ విధానం ప్రవేశపెట్టకమునుపు భారతదేశ రక్షణ శాఖ ఏడాదికి 60,000 మందిని సైన్యంలో నియమించుకుంటూ ఉండేది. కోవిడ్ కాలంలో దాదాపు మూడేళ్లు ఎటువంటి నియామకాలు జరగలేదు. అంటే లక్షా ఎనభై వేల నియామకాలు నిలిచిపోయాయన్నమాట. అగ్నిపథ్ పథకం కింద ప్రతి విభాగంలో కేవలం 45,000 మందిని మాత్రమే నియమించారు.

రష్యా -ఉక్రేన్ యుద్ధాన్ని ఉదాహరణగా పేర్కొంటూ “సరదాగా సైన్యంలో చేరడంలోని దుష్ఫలితాలను మనం రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో చూసాం. అటువంటప్పుడు ప్రభుత్వం ఎందుకు సైన్యంలో నియామకాలను తగ్గించిందో అర్థం కావడం లేదు. దీని ప్రభావం ఇప్పటికే జమ్మూ-కాశ్మీర్‌లో తీవ్రవాద చర్యలు పెరగడంలో, ఉత్తర లడక్‌లో సైన్య నిర్మాణంలో కనిపిస్తున్నది”' అంటున్నారు విశ్రాంత మేజర్ జనరల్ జిడి బక్షి. ఆయన అగ్నివీర్ పథకాన్ని “ దొడ్డిదారిన నిర్బంధ విధానం” అమలు చేయడం అని, ”అది భారత దేశ సైన్యాన్ని అస్థిరపరచగలదు “ అని చెప్పారు.

విశ్రాంత అడ్మిరల్ అరుణ్ ప్రకాష్ ఫ్రంట్ లైన్ పత్రిక విలేకరితో మాట్లాడుతూ, “సైన్యాన్ని 'సరైన మోతాదులో' ఉంచడం అన్నది తప్పనిసరిగా అవసరమైనదే . కానీ, “భారతదేశం ఎదుర్కొంటున్న రక్షణ సమస్యను, విస్తృతంగా ఉన్న దాని సరిహద్దులను, సముద్ర తీరాన్ని దృష్టిలో ఉంచుకున్నప్పుడు మన రక్షణ వ్యవస్థకు అధునాతన ఆయుధాల అవసరం ఉంది. వాటిని వినియోగించడానికి సరైన శిక్షణ అవసరం ఉంది. ఆ శిక్షణని సైన్యానికి అందించవలసి ఉంది” అన్నారు.

ఈ పద్ధతి సైనిక వృత్తిని స్వీకరించడంలోని మెరుపుని పూర్తిగా మసక బార్చింది.

గ్రామీణ ప్రాంతాలలోని యువకులను ఈ పథకం ఆకట్టుకోడం లేదా?...అవుననే అంటున్నారు యాష్ మోర్: ఇప్పుడు భారతదేశంలోని 16-17 ఏళ్ల యువకులు ఏ తప్పుడు మార్గాలలో అయినా విదేశాలకు వెళ్ళడానికే మొగ్గుచూపుతున్నారు. వారంతా ఇదివరకు సైన్యంలో చేరడానికి సిద్ధపడేవారు. ఇప్పుడు సైన్యంలో చేరడం అన్నది ఏ దారి లేనప్పుడు మాత్రమే ఎంచుకుంటున్న దారి. మరేదారి లేనప్పుడు మాత్రమే ఈ దారికి వస్తున్నారు. పోలీసు, పారామిలిటరీ వృత్తుల

తర్వాత మాత్రమే సైన్యంలో చేరడానికి సిద్ధపడుతున్నారు."

బీజేపీ ప్రధాన కార్యదర్శి కైలాష్ విజయవర్గీయ 2023లో అగ్నివీర్‌లను బీజేపీ ఆఫీస్‌లలో రక్షకులుగా చేర్చుకోవడానికి ప్రాధాన్యత ఇస్తామని ప్రకటించడం వివాదాస్పదంగా మారింది.

హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు, అగ్నిపథ్ పథకం వలన యువకులు సైన్యంలో చేరడానికి మొగ్గు చూపడం లేదని అన్నారు.

బర్మానలో అదానీ గ్రూప్ అగ్నివీర్ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించిన హిమచల్ ప్రదేశ్ మాజీ సైనికోద్యోగుల కార్పొరేషన్ చైర్మన్ బ్రిగేడియర్ (విశ్రాంత) మదన్ శీలం శర్మ కూడా అగ్నిపథ్ యువకులను సైన్యంలో చేరడానికి నిరుత్సాహ పరుస్తోందని అన్నారు.

ఈ పథకం ప్రవేశ పెట్టే సమయంలో పంజాబ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన కెప్టెన్ అమరేందర్ సింగ్ వంటి ముఖ్యులు దీనిని సహితం బలపరచలేదు. అనుమానాలు వ్యక్తపరిచారు. 2024 ఎన్నికలలో ప్రతి పక్షం పాలకపక్షంపై ఈ పథకం గురించి విమర్శ నాస్త్రాలు సంధించింది . నేషనల్ డెమొక్రటిక్ ఏలియన్స్ భాగస్వామి జనతాదళ్ (యునైటెడ్), లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్ పాశ్వాన్) కూడా తమ అభ్యంతరాలు తెలియచేసారు.

**❝ ఆయుధాలలో ప్రాథమిక శిక్షణ పొందిన అగ్ని వీరులు సమాజానికి హానికరంగా మారే ప్రమాదం ఉందని అనేక పరిశోధనలు ,సాహిత్యం తెలియచేస్తున్నాయి. భారతదేశ విభజన సమయంలో, పెద్ద ఎత్తున జరిగిన జాతి శుద్ధి కార్యక్రమంలో పాల్గొన్న వారిలో ఎక్కువమంది రెండో ప్రపంచయుద్ధంలో పాల్గొని బయటికి పంపి వేయబడిన సైనికులే. ❞**



అగ్నిపథ్‌కు వ్యతిరేకంగా హర్యానాలో నిరసన ప్రదర్శన జరుపుతున్న యువకులు

మొదట్లో సైన్యంలో పెద్ద ఎత్తున జరగబోయే 'మార్పుకు నాందిగా చెప్పుకునే ఈ పథకం, కాలక్రమంలో అనేక వివాదాస్పద శీర్షికలకు మూల మయింది. 2023 ఆగస్టులో ఈ పథకం మొదలుపెట్టిన నాటి నుండి ఇప్పటి వరకు 20 మంది అగ్నివీరులు మరణించారు. అందులో ఎక్కువ మంది ఆత్మహత్యలు చేసుకున్నవారే. ఎందుకీ ఆత్మహత్యలు జరుగుతున్నాయనే అంశాన్ని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ మాజీ సైనికోద్యోగుల విభాగం చైర్మన్ రోహిత్ చౌదరి లేవనెత్తారు. "వారికిచ్చే శిక్షణ తగిన విధంగా లేదా? వారు మానసికంగా ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యం కలిగి లేరా? అని ప్రశ్నించారు. ఆయన మాట్లాడుతూ ,"నేను సైన్యం నుండి బయటికి వచ్చాను. అక్కడ 47 ఏళ్ళు పని చేసిన తర్వాత బయటికి వచ్చాను. నేను పనిచేసిన కాలమంతటిలో కేవలం ఒకే ఒక ఆత్మ హత్యని చూసాను. ఆ కాలంలో ఆత్మ హత్యలు జరగడం అరుదు" అన్నారు.

**సైన్యం నుండి బయటికి పంపబడిన అగ్నివీరులు ముప్పుగా మారే ప్రమాదం**

కొందరు అగ్నివీరులు అవినీతి కేసులలో ఉన్నారు. నేరపూరిత చర్య లకు పాల్పడుతూ పట్టుబడుతున్నారు. ఆగస్టు 13 వ తేదీ అగ్నివీర్‌కి చెందిన ఒక సైనికుడు అరెస్టు చేయబడ్డాడు. అతనితో పాటుగా మరో ఆరుగురు కూడా ఖైదు చేయబడ్డారు. వారు తుపాకీతో బెదిరించి ఒక వ్యాపారి నుంచి 50 లక్షలు సొమ్ము గుంజారు . వారిని ప్రశ్నించిన సందర్భంలో తాము ' రెవ' లోని ఒక బ్యాంకు దోపిడీకి కూడా పాల్పడాలని అనుకున్నట్లు తెలియ చేసారు. జులై నెలలో మోహిలి పోలీసులు కొంతమంది వ్యక్తులను అరెస్ట్ చేశారు. వారు కూడా అగ్ని వీరులుగా సైన్యం నుండి తొలగించబడినవారే. వారు వాహనాలు దొంగతనాలు చేస్తున్నారట .

ఆయుధాలలో ప్రాథమిక శిక్షణ పొందిన అగ్నివీరులు సమాజానికి హానికరంగా మారే ప్రమాదం ఉందని అనేక పరిశోధనలు ,సాహిత్యం తెలియచేస్తున్నాయి. భారతదేశ విభజన సమయంలో, పెద్ద ఎత్తున జరిగిన జాతి శుద్ధి కార్యక్రమంలో పాల్గొన్న వారిలో ఎక్కువమంది రెండో ప్రపంచయుద్ధంలో పాల్గొని బయటికి పంపి వేయబడిన సైనికులే. ' వియాత్నం యుద్ధంలో పాల్గొని బయటికి వచ్చిన సైనికులే ఆ తరువాత కాలంలో సామాన్య పౌరులపై వీధులలో హింసకి పాల్పడినట్టు హాలీవుడ్ సినిమాలలో చూస్తుంటాము. అటువంటి ఘటనలే రువాండాలో,యుగస్లోవియాలో కూడా జరిగాయి. " అన్నారు సుహన్ట్ సింగ్ ఫ్రంట్ లైన్‌తో.

ఇప్పటి భారతదేశ పరిస్థితులకి అటువంటి అనుభవాలను అన్వయించుకుంటే, "ఈ విధానం వలన మన సమాజానికి ఎంతటి ప్రమాదాలు పొంచివున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఒకవైపు " భారతదేశ ఆర్థిక వ్యవస్థ కుదేలవుతున్నది. రాజ్య హింస కున్న గుత్తాధిపత్యం నెమ్మదిగా సడలుతున్నది . ఆయుధాలలో మంచి శిక్షణ నిచ్చిన యువకులు రాజకీయంగా మెజారిటీ మత ప్రభావంలో మునిగి ఉంటే, దాని పర్యవసానాలు తీవ్రంగా ఉండి, సమాజం అస్థిరతకు దారితీయొచ్చు. ఫలితంగా ఆ తర్వాత పరిణామాలు చేజారిపోయే అవకాశాలు ఉన్నాయి ." అన్నారు సుశాంత్ సింగ్.

సైన్యంలో రెండు నుంచి మూడు శాతమే ముస్లింలు ఉంటున్న నేటి పరిస్థితులలో, " రాజకీయాలను హిందూకరించాలి , హిందువులని సైనికరించాలి" అనే వి డి సావర్కర్ సిద్ధాంతాన్ని అనుసరిస్తున్న పాలకపార్టీ, దాన్ని అగ్నివీరులకి ఎక్కిస్తున్నది.

**(అనువాదం: కె. ఉషారాణి)**

సాంస్కృతిక రంగం

# మన దేశంలో ప్రస్తుత సాంస్కృతిక దృశ్యం

**సాంస్కృతిక రంగంలో పార్టీ అవగాహన కోసం ఇటీవల విజయవాడలో జరిగిన సదస్సులో సమర్పించబడిన పత్రాల్లో కొన్నిటిని మార్పిస్తు పాఠకులకు అందిస్తున్నాం**

**1. వర్తమానం :**

సామ్రాజ్యవాద దేశాల యథేచ్ఛ దోపిడీకి నయా-ఉదార ఆర్థిక విధానాలు సాధనాలుగా దోహదపడ్డాయి. సరళీకరణ, ప్రయివేటీకరణ, గ్లోబలీకరణకు అనుగుణంగా ప్రజల ఆలోచనలను మార్చి, వారిని అంగీకరింపచేసే సాంస్కృతిక వాతావరణం నెమ్మదిగా నిర్మితమవుతూ వచ్చింది. సాంస్కృతిక రూపాలను సరుకుగా, సరుకులను ప్రమోట్ చేసే సాధనంగా మార్చేశారు. వినిమయ తత్వాన్ని, పోటీతత్వాన్ని, వ్యక్తివాదాన్ని పెంచే ధోరణులు పెంచి పోషించారు.

ఒకప్పుడు మన దేశ పాలకవర్గాలకు ఆలిండియా రేడియో (ఆకాశవాణి) ప్రధాన ప్రచార సాధనం. తన అనుకూల ప్రచారానికి రేడియోను సాధనంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉపయోగించుకొంది. ఎమర్జెన్సీ కాలంలో ప్రతిపక్షాల వాణిని వినిపించకుండా కేవలం అధికార పక్ష ప్రచారాన్నే ఊదరగొడుతూ ఆలిండియో రేడియో 'ఆల్ ఇందిరా రేడియో'గా మార్చబడిందన్న విమర్శలు ఎదుర్కొంది. 1936లో బ్రిటీషుకాలంలో ప్రారంభమైన రేడియో ప్రసారాల వ్యవస్థ 90వ దశకం వరకూ మంచి ప్రాచుర్యం పొందింది. ప్రజల సాంస్కృతిక కార్యకలాపాలకు వేదికగానూ ఉంది. హరికథలు, బుర్రకథలు, నాటికలు, నాటకాలు, సంక్షిప్త శబ్దచిత్రాలు, మనోరంజని సినిమా పాటలు, యువవాణి, మహిళావాణి, పాడిపంటలు, బాలభారతి వంటి కార్యక్రమాలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. దూరదర్శన్ వచ్చి, ఆ స్థానంలో భాగస్వామ్యం పంచుకొంది. 90వ దశకం మధ్యలో ప్రైవేటు టీవీ ఛానెళ్లూ, తరువాతి కొద్ది కాలానికి రేడియాలో ప్రైవేటు ఎఫ్ఎం ఛానెళ్లూ మొదలయ్యాయి.

ప్రజాజీవితంతో సంబంధం లేని 'వినోదం' ఒక పరిశ్రమగా ముందుకొచ్చింది. కాలక్షేపమే ఒక వ్యాపకంగా మారింది. 'పనీపాటా' అనే పదబంధంలో రోజువారీ జీవితమూ, సాంస్కృతిక వ్యాపకమూ కలగలిసి ఉన్నాయి. ఉదారవాద విధానాలు ఉధృతమైన కాలంలో ఆ బంధాన్ని తెంచే విధంగా వినోద పరిశ్రమ నడవటం మొదలైంది. "వారంలోని ఐదు రోజులూ పనిచేయండి డబ్బు కోసం... వారాంతపు రెండ్రోజులూ ఆ శ్రమను, అందులోని ఒత్తిడిని మర్చిపోయి సరదాగా గడిపేయండి.." అని ప్రబోధిస్తుంది ఈ వినోదం.

ఎఫ్ఎం రేడియోలూ, ప్రయివేటు వినోద చానెళ్లూ ఈ ధోరణితోనే సాగుతున్నాయి.

దేశంలో ఇప్పుడు ప్రసారభారతి ఆధ్వర్యాన 420 వరకూ రేడియో స్టేషన్లు ఉన్నాయి. 23 భాషల్లో ప్రచారాలను కొనసాగిస్తున్నాయి. వీటికి అనుబంధంగా ఎఫ్ఎం ఛానెళ్లూ ఉన్నాయి. ఇవిగాక ప్రతి నగరంలోనూ ప్రయివేటు ఎఫ్ఎం రేడియో స్టేషన్లు ఉన్నాయి. దేశంలో 1000 వరకూ ఉంటాయి. కొన్ని ఇంజినీరింగ్ కాలేజీలు కూడా తమ క్యాంపస్ పరిధిలో ఎఫ్ఎంలను నడుపుతున్నాయి. స్థానిక సమాచారం ఎప్పటికప్పుడు తెలియజేయడం, సినిమా పాటలు వినిపించటం, సరదా సంభాషణలు, పుట్టినరోజు శుభాకాంక్షలు, ఇంటర్వ్యూలతో ఇవి నడుస్తున్నాయి. కారు ప్రయాణాల్లో, పనిప్రదేశాల్లో వినోద సాధనాలుగా ఉన్నాయి.

ఆలిండియా రేడియాను ప్రధాని మోడీ 'మన్ కీ బాత్' కోసం విరివిగా ఉపయోగిస్తున్నారు. మొదట్లో ఆ సంభాషణలు పత్రికల్లోనూ వివరణాత్మక వార్తగా వచ్చేవి. ఇప్పుడూ వస్తున్నా, కేటాయిస్తున్న స్పేస్ తగ్గింది. ఎఫ్ఎం తరహాలోనే పాడ్‌కాస్టింగ్ ఈ మధ్య పెరిగింది. ఇందులో వీడియో ఉండదు. వాయిసే ప్రధానం. ఏవొక కబుర్లు చెప్పటం, కథలూ, నవలలూ చదివి వినిపించటం ఇందులో జరుగుతోంది. చదివేందుకు ఓపిక, తీరిక లేనివారు ప్రయాణాల్లో ఈ సౌలభ్యాన్ని బాగా ఉపయోగిస్తున్నారు. "కుకు" వంటి యాప్‌లూ వచ్చాయి. ఇందులో వేలాది ఆడియో బుక్స్ ఉంటాయి. నెలనెలా రెంట్ కట్టి, ఆ బుక్స్ 'వినొచ్చు.' ఇలాంటి ఫ్లాట్‌పారమ్ మీదికి అభ్యుదయకరమైన కథలూ నవలలూ వెళ్లేలా చూడాలి.

**2. పుస్తకాలు - వారపత్రికలు :**

ఒకప్పుడు పుస్తకాలు ఇటు అభ్యుదయానికి, అటు కాలక్షేపానికి ఆలంబనగా ఉన్నాయి. టీవీ సీరియళ్లు, యూట్యూబ్ ఛానెళ్లూ వచ్చాక వినోద పుస్తక సాహిత్యానికి ఆదరణ తగ్గింది. దీంతో, ప్రింట్ రూపంలో వచ్చే ప్రధాన వారపత్రికలన్నీ ఆగిపోయాయి. స్వాతి వీక్లీ, మంత్లీ తప్ప మిగతా అన్నీ మూతపడ్డాయి. సినీ వారపత్రికలు కూడా మూతపడ్డాయి. కొందరు కొత్తగా వెబ్ పత్రికలు స్థాపించి నడుపుతున్నారు. సినిమా వార్తలన్నీ ఇప్పుడు వెబ్‌లోనే వెలువడుతున్నాయి. కౌముది, సంచిక, రాస్తా, సారంగ, నెచ్చలి వంటివి ఇందులో ఉన్నాయి. అభ్యుదయ సాహిత్య సంస్థలు నడుపుతున్న సాహిత్య ప్రస్థానం, అరుణతార, ప్రజాసాహితి వంటి సాహిత్య మాస పత్రికలు ప్రింటు ఎడిషన్లు వెలువడుతున్నాయి.

ఇంతకు ముందులా సినిమా విమర్శ పత్రికల్లో రావడం లేదు. యూట్యూబుల్లో కొందరు విశ్లేషణలు చేస్తున్నారు. సినిమాల మంచిచెడ్డల గురించి సోషల్ మీడియాలో ప్రసారం చేయటానికి చాలా అవకాశం ఉంది.

నవలల ప్రచురణ బాగా తగ్గింది. అన్వీక్షికి, పుస్తకం వంటి సంస్థలు ఈ మధ్యనే రూ. 10 లక్షల విలువైన నగదు బహుమతులతో నవలల పోటీని నిర్వహించింది. నవలలు చదివేవారు ఉన్నారని, ఆధునిక యువతకీ, కాలానికీ తగ్గట్టుగా నవలలు తీసుకొస్తే చదువుతారని ఆ సంస్థలు తమ అనుభవాలను సానుకూలంగానే వివరించాయి. ఆ నవలల ఎంపిక జరిగింది. పుస్తక రూపంలో రావాల్సి ఉంది. ఆ నవలలు రాసిన వాళ్లు, పాఠకులుగా ఉన్నవాళ్లూ ఎక్కువ యువతీ యువకులే! అక్కడ జరుగుతున్న కృషిని, అనుభవాలను అధ్యయనం చేయాలి.

> “ తెలుగు నాట నెలలో ఒకటి రెండు నాటక పరిషత్తులు జరుగుతూనే ఉన్నాయి. రెండు, మూడు సంస్థలు ఏటా నాటక రచనల పోటీలను నిర్వహిస్తున్నాయి. మన రాష్ట్రంలో ఏటా 50 వరకూ నాటక పరిషత్తులు నడుస్తున్నాయి. ఈ వేదికల మీద వివిధ సమస్యలను, సామాజిక అంశాలను కథలుగా ఆవిష్కరించే అవకాశం ఉంది. వాటిని అధ్యయనం చేసి, అదే వేదికల మీద మంచి ప్రదర్శనలు వచ్చేలా కృషి చేయొచ్చు. ”

తెలుగు నాట సొంత పుస్తక ప్రచురణ విపరీతంగా పెరిగింది. డిజిటల్ ప్రింటింగ్ అందుబాటులోకి వచ్చాక 50, 100 పుస్తకాలు కూడా అచ్చు వేయించుకునే అవకాశం ఉన్నందున – ఎక్కువ మంది తమ సొంత రచనలు ప్రింటు వేయిస్తున్నారు. సోషల్ మీడియాలో వందలాది సాహిత్య గ్రూపులు నడుస్తున్నాయి. వాటి ప్రేరణతో వేలాదిమంది కవిత్వమూ కథలూ రాస్తున్నారు. యువతీ యువకులు, గృహిణులు, రిటైర్డు ఉద్యోగులు, వివిధ సంస్థల్లో పనిచేస్తున్నవారూ కొత్తగా రాస్తున్నారు. కొందరు పుస్తకాలు వేస్తున్నారు. ఇలాంటివాటిలో ఎక్కువ భాగం అమ్మకానికి కాక, మిత్రులకు పంపటానికి ఉపయోగిస్తారు. ఇలా వచ్చే కొన్ని మంచి పుస్తకాలను మనం ఆవిష్కరించొచ్చు. పరిచయ సభలు పెట్టొచ్చు. సామాజిక రచనలు చేసే వారిని గుర్తించి, సమీకరించి, ప్రోత్సహించొచ్చు.

**3. నాటికలు – నాటకాలూ :**

తెలుగు నాట నెలలో ఒకటి రెండు నాటక పరిషత్తులు జరుగుతూనే ఉన్నాయి. రెండు, మూడు సంస్థలు ఏటా నాటక రచనల పోటీలను నిర్వహిస్తున్నాయి. ప్రదర్శనలు జరిపి పెద్దమొత్తాల్లో బహుమతులు అందిస్తున్నాయి. ప్రభుత్వం నంది నాటకోత్సవాలను నిర్వహిస్తోంది. ముఖ్య నగరాలు, పట్టణాల్లో నాటక సమాజాలు ఉన్నాయి. క్రమేణా ఈ సంఖ్య, ప్రదర్శనలు తగ్గుతున్నా– జరుగుతున్న కృషి కూడా గణనీయంగానే ఉంది. మన రాష్ట్రంలో ఏటా 50 వరకూ నాటక పరిషత్తులు నడుస్తున్నాయి. ఈ వేదికల మీద వివిధ సమస్యలను, సామాజిక అంశాలను కథలుగా ఆవిష్కరించే అవకాశం ఉంది. వాటిని అధ్యయనం చేసి, అదే వేదికల మీద మంచి ప్రదర్శనలు వచ్చేలా కృషి చేయొచ్చు.

మానవ సంబంధాలు, వృద్ధాప్య సమస్యలు, అమెరికా జీవితాలు, వృద్ధాశ్రమాలు, దేశభక్తి – సైనికుల త్యాగాలు వంటి అంశాల చుట్టూ ఈ పరిషత్తు నాటకాలు నాటికలు నడుస్తున్నాయి. అవసరమైన కొత్త అంశాలతో ఇందులో జోక్యానికి అవకాశం ఉంది. ఆయా రచయితలు, సమాజాలతో మాట్లాడడం, మనమే కొన్ని పోటీలు పెట్టి, కొత్త అంశాలు వచ్చేలా ప్రయత్నం చేయొచ్చు.

**4. డ్యాన్సు ట్రూపులు :**

గడిచిన ఇరవై ఏళ్లలో ప్రతి పట్టణంలో డ్రాన్సు ట్రూపులు పెద్ద సంఖ్యలో నెలకొన్నాయి. కొన్ని ప్రయివేటు వినోద టీవీ ఛానెళ్లు డ్యాన్స్ పోటీలను విపరీతంగా ప్రోత్సహించాయి. అందులో ఎంపికకు ముందు, ఆ తరువాత పట్టణాల్లో యువతీ యువకులు కొందరు అదే పనిగా ప్రాక్టీసు చేయటం, చేయించటం ద్వారా శిక్షణాలయాలు ప్రారంభించారు. వివిధ కుటుంబ కార్యక్రమాలు, జాతరల్లో ప్రదర్శనలు ఇవ్వడం ద్వారా ఉపాధి పొందుతున్నారు. విద్యాసంస్థల వార్షికోత్సవాలు, పెళ్లిళ్ల సంగీత్‌లో నృత్య ప్రదర్శకులకు వీరే శిక్షణ ఇస్తున్నారు. చిన్న పట్టణాల్లో కూడా ఐదారు ట్రూపులు, వంద మంది వరకూ కళాకారులు ఉంటారు.

**ఆర్కెస్ట్రాలు :** పెళ్లిళ్లు, జాతరల్లో ఆర్కెస్ట్రాలు ఇప్పటికీ సాగుతున్నాయి. టీవీ, సినిమా కళాకారులతో సమన్వయం చేసుకుంటూ వారితో ప్రోగ్రాములు నడుపుతున్న సంస్థలూ ఉన్నాయి. మాటీవీ రేలారేలా కార్యక్రమం ద్వారా గుర్తింపులోకి వచ్చిన జానపద కళాకారులు కూడా వివిధ ట్రూపులు నడుపుతున్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో జానపద కళాకారుల ట్రూపులు ఉన్నాయి. కొంతమంది జానపద పాటలతో వీడియోలు చేసి, యూట్యూబ్‌లో ప్రచారం పొందుతున్నారు. మిరియాల రామ్ (పిఠాపురం – హైదరాబాద్) వంటి కళాకారులు సామాజిక స్పృహ ఉన్న పాటలు రాసి, చిత్రీకరిస్తున్నారు. ఆ పాటలకు లక్షలమంది వ్యూయర్‌షిప్ వస్తోంది. “అలాయ్ బలాయ్” పాటలో సామరస్య భావన, “ఏం పూరెళ్తావ్ మామా ఏ పూరెళ్తావ్” అన్న పాట గ్రామాల్లో వచ్చిన మార్పుల గురించిన స్పృహ బాగా వినిపించారు. “చౌరస్తా” పేరుతో బ్యాండు నిర్వహిస్తున్నారు. ఇలా ఇంకొందరు ఉన్నారు. అలాంటి వారితో ఏవైనా కార్యక్రమాలు ప్లాన్ చేయొచ్చు.

**5. డీజేలు, ఫ్లాష్‌మాబ్‌లు :**

ఇవి యువతను బాగా ఆకట్టుకుంటున్నాయి. ఒక్కసారిగా జనం దృష్టిని తన వైపు లాక్కోవటానికి ఇవి ఉపయోగపడతాయి. ఫ్లాష్‌మాబ్‌లను తరచూ సామాజిక చైతన్య అంశాలకు కూడా ఉపయోగిస్తున్నారు. జనం ఎక్కువగా ఉన్న కూడళ్లలో, సముద్ర తీరాల్లో, షాపింగ్ మాళ్లలో సడెన్‌గా ఈ కళాకారులు ప్రత్యక్షమై, ఎన్నుకున్న పాటను లేదా సందేశంతో కూడిన నాటికను ప్రదర్శిస్తారు. కొన్ని నిమిషాల్లో ప్రదర్శన ముగుస్తుంది. ఎన్నికల ప్రచారంలోనూ ఈ మధ్య ఉపయోగించారు. తక్కువ టైంలో ఎక్కువ ప్రచారం, ప్రభావం చేకూర్చటానికి ఇది అనువైన ప్రక్రియ.

**బ్యాండ్లు :** మన దగ్గర ఇవి తక్కువ. ఇతర దేశాల్లో ఉద్యమ ప్రచారంలోనూ ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. అక్కడ ఈ బ్యాండ్ల ద్వారానే ప్రాచుర్యం పొందిన ఉద్యమ గీతాలూ ఎన్నో ఉన్నాయి. యూట్యూబ్ ప్రచారానికి కూడా ఈ శైలి బాగానే ఉపయోగపడుతుంది. ఇటీవల మిరియాల రామ్ వంటి వారు రూపొందించిన గీతాలు ఇలాగే ప్రసిద్ధి గాంచాయి. హైదరాబాదులో 20 వరకూ ప్రాచుర్యం పొందిన బ్యాండ్లు ఉన్నాయి. లైవ్ షోలుగా ఇవి యువతను ఆకట్టుకుంటున్నాయి.

**6. జానపద కళలు :**

తప్పెటగుళ్లు, కోలాటం, చెక్క భజనలు ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో సాంస్కృతిక సందడి చేస్తున్నాయి. తిరుపతి తిరుమల దేవస్థానం సహకారంతో చాలా గ్రామాల్లో భజన బృందాలు ఏర్పడ్డాయి. ఇందులో ఎక్కువమంది శ్రామిక కుటుంబాల వారే ఉంటారు. అందులోనూ మహిళలు ఎక్కువ. చాలా గ్రామాల్లో మహిళా కోలాట బృందాలు ఉన్నాయి. వారే సొంతంగా డబ్బు వెచ్చించి, గురువును పెట్టుకొని నేర్చుకుంటున్నారు. గ్రామాల్లో జాతరలు జరిగినప్పుడు వారే ప్రదర్శనలు ఇస్తున్నారు. ఆ బృందాల్లో అర్థవంతమైన శ్రామిక, సమైక్య, ఉద్యమ గీతాలను ప్రవేశపెట్టవచ్చు. గ్రామాల్లో అలాంటి బృందాలను తయారు చేయొచ్చు.

తప్పెటగుళ్లు ఉత్తరాంధ్రలో, అందులోనూ శ్రీకాకుళంలో ఎక్కువ. కొన్ని గ్రామాల్లో బృందాలు ఉన్నాయి. వివిధ జాతరలకు డబ్బు

> **“ సంస్కృతి అంటే సాంస్కృతిక కార్యకలా పాలు మాత్రమే కాదు; మన దైనందిన జీవితం మొత్తం. తిండీ, బట్ట, ఇల్లు, అల వాట్లు, అభిరుచులు, ఆలోచనలు... ఇలా అన్నీ, వాటిల్లోకి జొర బడి, మనిషి మైండ్‌సెట్ మార్చటానికి వినిమయ సంస్కృతి వివిధ సాంస్కృతిక కార్యకలాపాల రూపంలో ప్రయత్నిస్తోంది. అందాల పోటీలు అందులో ఓ భాగం.. దానికి అనువుగానే తెల్లగా ఉంటే, ముఖం నిగారింపుతో ఉంటే రాకుమారుడు వస్తాడని, ధైర్యం వస్తుందని ప్రకటనలు గుప్పిస్తారు. అమ్మకాలు పెంచుకుంటారు. ”**

ఒప్పందం మీద వచ్చి కళాప్రదర్శనలు ఇస్తున్నారు.

తీన్‌మార్ (డప్పుల) బృందాలు చాలా ప్రాంతాల్లో ఉన్నాయి. అన్ని రకాల జాతరలు, ప్రచారాల్లో కచ్చితంగా ఈ బృంద ప్రదర్శనలు ఉంటున్నాయి. చాలాచోట్ల వీరికి ప్రజాసంఘాలతో సంబంధాలు ఉండి ఉంటాయి.

**7. ప్రింటు మీడియా :**

ఎలక్ట్రానిక్ మీడియా ప్రబలంగా ఉన్నా ప్రింటు మీడియా తన ప్రాబల్యాన్ని కొనసాగిస్తోంది. ప్రతి మీడియా సంస్థకూ అనుబంధ వార, మాస పత్రికలు ఉండేవి. అవన్నీ మూతపడ్డాయి. దినపత్రికలు ఏదొక పార్టీకి బాహటంగా కొమ్ము కాస్తున్నాయి. ప్రజల ప్రయోజనాల నుంచి కాక ఆయా మద్దతు పార్టీల ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నాయి. టీవీల్లో కనిపిస్తున్న ప్రవచన కారుల వ్యాసాలు, సంభాషణలూ పత్రికల్లోనూ వస్తున్నాయి. వారాలు వర్జ్యాల ప్రచారం పెరిగింది. ఒకప్పుడు విశ్వాసాలను ఇది విశ్వాసం అని స్పష్టంగా రాసే పత్రికలు విశ్వాసాలను కూడా నిజం అన్నట్టు వండి వార్చుతున్నాయి. భక్తి ఒరవడిని పెంచటానికి ఇతోధికంగా తోడ్పడుతున్నాయి. దీనికి తగ్గట్టు అనుదిన శీర్షికలను ఇస్తున్నాయి.

వార్తలను వార్తలుగా ఇచ్చి, అవగాహనను పాఠకుడి విచక్షణకు వదిలే పద్ధతి పోయింది. ఆ పత్రిక రాజకీయ మద్దతుకు అనుగుణంగా వార్తలు ప్రజంట్ చేయబడుతున్నాయి. ఏ పత్రిక చదివినా పూర్తి సత్యం ప్రజలకు తెలియని పరిస్థితి నెలకొంది. దాదాపు అన్ని ప్రధాన పత్రికల్లోనూ దేశీయ పెద్ద పెట్టుబడిదారుల పెట్టుబడులు ఉన్నాయి. ఈ కారణం చేతనే అంబానీ ఇంట్లో నిశ్చితార్థం జరిగినా, విందు జరిగినా ఈనాడు వంటి పత్రికల్లో పుంఖానుపుంఖంగా ఆ విశేషాలు ప్రచురితమవుతున్నాయి.

ఈ పత్రికల్లో కథలూ కవితలూ సామాజిక అంశాలపై కేంద్రీకరించి రాస్తే ప్రచురించటం తగ్గింది. 'వ్యంగ్యమూ హాస్యమూ ఉన్న కథలకే ప్రాధాన్యం ఉంటుం దని' ఈనాడు ప్రకటిస్తోంది. మతోన్మాదాన్ని నిరసించే కవితలకు ఆంధ్రజ్యోతిలో చోటివ్వ టం లేదని కవులు చెబుతున్నారు. రోహిత్ ఆత్మహత్య తరువాత ఆ అంశంపై రాసిన కవితలను ప్రచురించలేదని చెప్పినవారూ ఉన్నారు. అన్ని రూపాల్లోనూ ప్రజాభిప్రాయానికి చోటివ్వని స్థితి ప్రధాన ప్రింటు మీడియాలో కనిపిస్తోంది. సాహిత్యమూ, కళలకు సంబంధించి వివాదాస్పద అంశాలకు ప్రాధాన్యం ఇవ్వడం తప్ప – సమాజ పురోగమనానికి దోహదపడేవాటికి ప్రాముఖ్యం ఇవ్వటం లేదు. ఉదాహరణకు శ్రీశ్రీ వర్ధంతో జయంతో వస్తే– ఆయన వ్యక్తిత్వం మీదా, ఆయన రచనల్లో విస్మరించిన విషయాల మీదా పెద్ద చర్చ నడుస్తోంది. ఆయన రచనల ఉద్దేశం అంతా పక్కకు పోతుంది.

కొన్ని చిన్న పట్టణాల నుంచి వెలువడు తున్న పత్రికలు పూర్తిగా ప్రకటనలకే ప్రాధాన్యం ఇస్తున్నాయి. ప్రింటు లేకుండా వాట్సాపుల్లోనే ప్రచురితమవుతున్న పత్రికలు పెరిగాయి. సాహిత్యం, సాంస్కృతిక విషయాలపై సీరియస్‌గా చర్చించటం తగ్గింది.

**8. గ్రామాల్లో జాతరలూ – ఆటలూ పాటలూ**

గ్రామాల్లో జాతరలు పెద్ద ఖర్చుతో జరుగుతున్నాయి. ఒక మోస్తరు గ్రామాల్లో స్పాన్సర్డు ప్రోగ్రాములు పెరిగాయి. ఒకప్పుడు ఊరంతా విరాళాలు పోగేసి, వారి భాగస్వామ్యంతో జరిగితే ఇప్పుడు కొత్తగా రాజకీయాల్లోకి వచ్చేవారూ, కాంట్రాక్టర్లూ, రియల్ ఎస్టేటు వ్యాపారులూ ఎక్కువ డబ్బు వెచ్చిస్తున్నారు. ఈ సందర్భంగా జరిగే ఆటల పోటీలకు పెద్ద మొత్తంలో బహుమతులు ఇవ్వడం ఒక అలవాటుగా మారింది. కబడ్డీ, వాలీబాల్, బాడ్మింటెన్, చెస్, ముగ్గులు, కుర్చీలాట వంటివి స్పాన్సర్డు పోటీలుగా ఉంటున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలు కూడా స్పాన్సర్ చేయబడుతున్నాయి. కళాకారులు బయటినుంచి వస్తున్నారు. కొందరు స్థానికంగానూ ఉంటారు. ఎక్కువ మంది పాల్గొవటం దశ నుంచి కేవలం చూడడం దశకు గ్రామీణ సాంస్కృతిక దృశ్యంలో మార్పు వచ్చింది.

అదే సమయంలో టీవీ ఛానెళ్లు, విద్యాసంస్థలూ వివిధ పోటీలు నిర్వహిస్తున్నం దున డ్యాన్సు నేర్చుకోవడం, ప్రదర్శించటం అన్ని స్థాయిల కుటుంబాల్లోనూ ఒక సాధారణ అంశంగా ముందుకు వచ్చింది. యూట్యూబుల్లో చూసి, డాన్సు నేర్చుకుంటున్నారు. చాలామంది రీల్స్ చేసి, యూట్యూబ్‌లో పెట్టటం ఒక ధోరణిగా మారింది.

**9. సౌందర్య సాధనాలు – ప్రసార మాధ్యమాలు :**

సౌందర్య సాధనాల మార్కెట్టును పెంచుకోవటానికి అందాల పోటీల్లో మన దేశం నుంచే అందాల సుందరులు ఎన్నిక చేయబడ్డారు. 1995 నాటికి రూ.12 కోట్లు దాటని మనదేశ సౌందర్య సాధనాల వార్షిక టర్నోవరు ఇప్పుడు రూ.5320 కోట్లకు చేరింది. 1997లో అందాల పోటీలపై దేశంలో పెద్దఎత్తున నిరసనలు సాగాయి. మహిళాసంఘాలకు ప్రజల నుంచి, పత్రికల నుంచి గొప్ప మద్దతు లభించింది. కొన్ని స్థానిక వ్యాపార సంస్థలు తాము తలపెట్టిన ఫ్యాషన్ షోలను అప్పట్లో రద్దు చేసుకున్నాయి.

అప్పటికే ప్రచారంలో ఉన్న, తమలో ఏర్పడి ఉన్న భావాలను ప్రజలు అంత సులభంగా వదులుకోరు. కొత్త భావాలకు అంత తొందరగా గురికారు.

సంస్కృతి అంటే సాంస్కృతిక కార్యకలాపాలు మాత్రమే కాదు; మన దైనందిన జీవితం మొత్తం. తిండీ, బట్ట, ఇల్లు, అలవాట్లు, అభిరుచులు, ఆలోచనలు ... ఇలా అన్నీ. వాటిల్లోకి జొరబడి, మనిషి మైండ్‌సెట్ మార్చటానికి వినిమయ సంస్కృతి వివిధ సాంస్కృతిక కార్యకలాపాల రూపంలో ప్రయత్నిస్తోంది. అందాల పోటీలు అందులో ఓ భాగం.. దానికి అనువుగా అనేక ప్రకటనలు. తెల్లగా ఉంటే, ముఖం నిగారింపుతో ఉంటే రాకుమారుడు వస్తాడని, ధైర్యం వస్తుందని, ఉద్యోగం వస్తుందని ప్రకటనలు గుప్పిస్తారు. అమ్మకాలు పెంచుకుంటారు. మనదేశంలో ఇది చాలా వేగంగా జరిగింది. ఇప్పుడు ప్రతి స్కూల్లో ఫ్యాషన్ షో కామన్ అయిపోయాయి.

1984 వరకూ టెలివిజన్ ఇంతగా విస్తరించలేదు. ఆలిండియో రేడియోనే పెద్ద వినోద, సమాచార సాధనం. దానిపై ప్రభుత్వ

నియంత్రణ... ఎమర్జన్సీ సమయంలో ఆలిండియో రేడియో ఇందిరా రేడియోగా మారిందని, ప్రభుత్వ బాకా అని విమర్శలను ఎదుర్కొంది. టీవీ రాకతో వారానికి ఒకసారి సినిమా ఇంట్లోకి వచ్చింది. కొన్నాళ్ల పాటు ఊరందరికీ లేదా కొన్ని కుటుంబాలకు అదే థియేటరు అయింది. తరువాత ఇంటింటికీ, గదిగదికీ, ఇప్పుడు సెల్‌ఫోను రూపంలో మనిషి మనిషికీ .. ఎవరి ప్రపంచం వారిది అయిపోయింది. ప్రతి మనిషీ ఒక వినియోగదారుడుగా నేరుగా కంపెనీల గుప్పిట్లో ఉన్నాడు. అమెజాన్, బిగ్‌బాస్కెట్, మీసో లాంటి వ్యాపార సంస్థలకు మన ఫోనే ఒక సేల్స్ విండో అయింది.

1996 తరువాత ప్రయివేటు టీవీ ఛానెళ్లు స్థానిక పెట్టుబడితో ప్రారంభమయ్యాయి. రకరకాల సరుకుల అమ్మకానికి నిరంతర అడ్వర్‌టైజ్‌మెంట్లతో మన ఇంట్లోనే ప్రచారం జరుగుతోంది. సౌందర్య ఉత్పత్తుల అమ్మకం గణనీయంగా పెరిగింది.

తరవాతి కాలంలో అన్ని రకాల మీడియా లోకి విదేశీ పెట్టుబడి నేరుగా వచ్చింది.

స్పాన్సర్డు వినోదం పెరిగింది.. సరుకులను ప్రమోట్ చేయడం, వినియోగదారులుగా మనల్ని మార్చటం దాని ప్రధాన లక్ష్యం అయిపోయింది.

విద్య, వైద్య రంగాలు లాభసాటి వ్యాపారంగా మారాయి.

పోటీ ప్రపంచంలో పరుగులు తీస్తే అనేక సుఖాలను అందుకోవొచ్చనే భ్రమలు హెచ్చాయి.

సామాజిక స్పృహకు అవకాశం ఇవ్వని చదువులు, ఒత్తిళ్లూ మొదలయ్యాయి.

మనకు ముందూ వెనుకా ఏం జరిగిందో, సమాజం ఇలా ఎందుకు ఉందో, ఏఏ పరిణామాలు జరిగాయో తెలిపే సామాజిక శాస్త్రాల బోధన లేకుండా పోయింది.

దీనికి విద్య కాషాయీకరణ తోడైంది. ప్రశ్నించే సహజతత్వాన్ని నిర్వీర్యం చేస్తోంది.

ఎల్‌పిజి విధానాలు సృష్టించిన సంపద ఒక సంపన్న వర్గాన్ని తయారు చేసింది. వారి వినోద విహారాల కోసం పబ్బులు, క్లబ్బులూ వెలిసాయి. మాదక ద్రవ్యాల వినియోగం పెరిగింది. ఆ ఉచ్చులోకి కొత్తగా ఎదిగిన మధ్య తరగతిని యువతనూ ఆకర్షించటం పెరిగింది.

1. ఈ తిరోగమన సంస్కృతి యువతని నిర్వీర్యం చేస్తోంది. చదువు, ఉద్యోగమూ అన్నీ పరుగుల ప్రపంచం అయింది. ప్రైవేటురంగం లోని ఉద్యోగ అభద్రత, అనిశ్చితి నలిబిలి చేస్తోంది. మతభావాల వైపు, విద్వేషం వైపూ మళ్లిస్తోంది. యోగాలూ, పాత భావాల వైపు ఆకర్షించటం పెరిగింది. గతమంతా ఘనం అనుకోవడం, భిన్నత్వాన్ని గౌరవించకపోవడం జరుగుతోంది.

ఈ ప్రపంచాన్ని మర్చిపో .. ప్రశాంతంగా గడుపు అని బోధించే గురువులు, ప్రవచనకారులు పెరిగారు.

**ఉదా :** జగ్గీవాసుదేవ్, రామ్ దేవ్ బాబా, చాగంటి కోటేశ్వరరావు, గరికపాటి నరసింహారావు ..

ఇంకా యూట్యూబ్ ఛానెళ్లలో అనేక మంది అమ్మలూ, స్వాములు, సన్యాసులూ, జ్యోతిష్యులూ ప్రాచుర్యం పొందారు.

ప్రతి సందర్భంలోనూ వాళ్ల అభిప్రాయాలు సోషల్ మీడియా నిండా తిరుగుతున్నాయి.

2. మరోవైపు సరైన చదువుల్లేక, ఉపాధి లేక, బతుకు తెరువు కోసం ఉన్న ఊళ్లనూ, ప్రాంతాలను వదలి అస్తిత్వాన్ని, సాంస్కృతిక మూలాలనూ వదిలిపోయే యువత కూడా ఉంది.

వారి సాంస్కృతికరూపాల్లోకి వ్యాపార ప్రచారం, మత ప్రచారం చొచ్చుకువస్తోంది.

**టీవీ ఛానెళ్లు :** 24 గంటలూ ప్రచారమయ్యే భక్తి ఛానెళ్లు పెరిగాయి. కార్తీకమాసంలో, అయ్యప్పమాల తరుణంలో మెగా ఈవెంట్లు స్వయంగా టీవీ యాజమాన్యాలే నిర్వహిస్తున్నాయి. ఎన్టీటీవీ చౌదరి, మైహోం కృష్ణారావు వంటివారు దీనికి ఉదాహరణ.ఒకప్పుడు ప్రవచనాలు వినాలి అంటే ఏ గుడి వద్దకో వెళ్లి వినాలి. ఇప్పుడూ 24 గంటలూ నట్టింట్లో, నెట్టింట్లో ప్రవచనాలూ, మత కార్యకలాపాలూ జరుగుతున్నాయి.

**ఎంటర్‌టైన్‌మెంట్ ఛానెళ్లల్లో** కన్నీళ్ల, కక్షల సీరియళ్లు.. క్షుద్రపూజలు, దెయ్యాలూ భూతాలూ, చేతబడి, మూఢత్వం ప్రవహిస్తోంది. రంగురాళ్లు, గవ్వలూ, తాళ్లు, ఉంగరాలూ, విభూతి అమ్ముకునే వ్యాపారులు ఈ చానెళ్ల రాజపోషకులుగా తయారయ్యారు.

"అప్రధాన వార్తలు.. సంచలనాలకు ప్రాధాన్యం.. ప్రజా సమస్యల పట్ల పట్టింపులేనితనం పెరిగింది. ఈ విష వలయంలో యువతరం మొత్తం మునిగిపోతున్నదని ఈ మధ్య బిగ్‌బాస్, జబర్దస్త్ వంటి కార్యక్రమాలు వెల్లడిస్తోంది. వెకిలి హాస్యం, పురుషాధిక్య భావజాలం, ఆడవాళ్లకు ఆడ వాళ్లే శత్రువులన్న ప్రచారం పెరిగింది. అన్ని రకాల సమస్యలకూ 'మరిచి పోయే' కాలక్షేపమే మందు అన్న తీరు ప్రబలమయ్యింది."

**వార్తాఛానెళ్లలో** అప్రధాన వార్తలు.. సంచలనాలకు ప్రాధాన్యం.. ప్రజాసమస్యల పట్ల పట్టింపులేనితనం పెరిగింది. ఈ విషవలయంలో యువతరం మొత్తం మునిగిపోతున్నదని ఈ మధ్య బిగ్‌బాస్, జబర్దస్త్ వంటి కార్యక్రమాలు వెల్లడిస్తోంది. వెకిలి హాస్యం, పురుషాధిక్య భావజాలం, ఆడవాళ్లకు ఆడవాళ్లే శత్రువులు అన్న ప్రచారం పెరిగింది. అన్ని రకాల సమస్యలకూ 'మరిచిపోయే' కాలక్షేపమే మందు అన్న తీరు ప్రబలమయ్యింది. ఉదా : టిక్‌టాక్, రీల్స్. ప్రచారం, ఆదాయ వ్యామోహంతో సోషల్ మీడియా నిండా పోస్టులూ వీడియోలూ వస్తున్నాయి.

**ప్రజల భాగస్వామ్యం :** చానెళ్లలో ఆటపాటల్లో అపార్టమెంటు వాసులు పాల్గొంటున్నారు. వంటలు చేస్తున్నారు. ఏ కొందరో వీడియోలతో పేరొందితే, ఎందరో ఆ దారిని అనుసరిస్తున్నారు. ఉదా :వెస్ట్ గోదావరి దుర్గారావు, బర్రెలక్క, అన్వేష్, బెజవాడ బేబక్కాయ్..

**టీవీలో జానపదాలు :** ప్రజాకళలను సరుకుగా మార్చిన వైనం రేలా రేలా రేలా వంటి కార్యక్రమాల్లో కనిపిస్తుంది. ప్రజల్లో ఉన్న పాటలు టీవీల్లో పాపులర్ అవడం మంచి అయితే, ప్రజల్లో ఉండాల్సిన కళాకారులు చాలామంది స్టూడియోల చుట్టూ తిరగడం, ఎక్కువ ప్రచార యావతో ఆ పోటీల్లో మునిగిపోవడం చెడు.

**10. సినిమాలు :**

1970, 80 దశకాల వరకూ సినిమాల్లో ఎన్ని పరిమితులు ఉన్నప్పటికీ ప్రజల స్థితిగతులూ, ఆకాంక్షలూ వ్యక్తమయ్యేవి. సమాజం అభ్యుదయం వైపు వెళ్లాలనే పద్ధతిలో కథాకథనాలు, పాటలు, మాటలు నడిచేవి.

సత్యజిత్ రే, మృణాల్ సేన్, హృతిక్ ఘాట్, మధుసూదనరావు, బి నరసింగరావు వంటి దర్శకులు గొప్ప చిత్రాలను నిర్మించారు. మార్పును కోరే ప్రగతిశీల సినిమాలు తీశారు.

**❝ ప్రజలు వివిధ సాంస్కృతిక రూపాల్లో తమను తాము వ్యక్తం చేసుకోవటానికి, భాగస్వాములు కావటానికి ఉత్సాహం గా ఉన్నారు. పెట్టుబడీదారీ వ్యవస్థ కళను వ్యాపారీ కరించి, ప్రజలను ప్రేక్షకులుగా వీక్షకులగా చేస్తోంది. తన భావాలను అందుకునే వారిగా మారుస్తోంది. ప్రజలూ తమ అభిప్రాయా లను చెప్పే వేదిక లను ఉపయో గించుకుంటున్నారు. భజనలు, కోలాటాలూ నేర్చు కుంటున్న మహిళల సంఖ్య మన రాష్ట్రంలో ఇటీవల పెరిగింది. బాలోత్సవాలు విజయవంతం అవుతున్నాయి.❞**

తెలుగులో పౌరాణిక సినిమాలు కూడా సమకాలీన దృక్పథాన్ని, అభ్యుదయ భావాలను పలికించాయి. ఉదాహరణకు 'మాయాబజార్'.

తరువాత జానపద సినిమాలు నడిచాయి. ఫ్రాక్షన్ సినిమాలు మొదలయ్యాయి. కృష్ణారెడ్డి లాంటి వాళ్లు కుటుంబ సంబంధాల్లో ఫ్యూడల్ భావాలను పునరుద్ధరించే ప్రయత్నం చేసేవారు. 90 తరువాత మన దేశం, మన ఊరు, యువతరం కదిలింది లాంటి సమూహ స్వభావ పేర్ల స్థానే 'నీ', 'నా' అనే వ్యక్తిగత కథలు, ప్రేమలూ తెర నిండా పరచుకున్నాయి. ఒక్కడు, ఒకే ఒక్కడు వంటి హీరోయిజాలు నడిచాయి. ఒక్కడు పూనుకుంటే సమాజం మారిపోతుంది అన్నట్టుగా లీడరు, శ్రీమంతుడు, భరత్ అనే నేను వంటి. సినిమాలు వచ్చాయి.

బిజెపి పెరుగుతున్న దశలోనే సినిమాల్లో కాషాయీకరణ మొదలైంది. 2019 ఎన్నికలకు ముందు వరసగా 12 సినిమాలు హిందూత్వను హైలైట్ చేస్తూ, పక్క దేశాన్నో, ముస్లిం పాలకులనో నిందిస్తూ సినిమాలు వచ్చాయి. సైనికుల దేశభక్తి ముస్లిం వ్యతిరేకతగా చూపబడుతోంది. దేశంలో హిందూత్వ ఉగ్రవాదం గాంధీ హత్యతో మొదలై కొనసాగుతోంది. కానీ, మన సినిమాల్లో ఇప్పటికీ ఉగ్రవాదులు ఎప్పుడూ ముస్లిములే కనిపిస్తారు. పాకిస్తాన్ వ్యతిరేకత, ద్వేషం వెండితెరపై దేశభక్తిగా చెలామణి అవుతోంది.

కొన్ని సినిమాల్లో కథలో అవసరం లేకున్నా కాషాయజెండాలు, కాషాయ బట్టలు, రుద్రాక్షలు, ఓం చిహ్నం ఓ ధర్మరక్షణగా బ్యాక్‌గ్రౌండ్లో ఉంటాయి. ఇవి మతచిహ్నాలుగా గతంలో సాధారణ జనం చూసేవారు కాదు.

కాశ్మీర్ ఫైల్స్, కేరళ స్టోరీ వంటి నేరుగా కాషాయ రాజకీయం చేశాయి. నేరుగా ప్రధాని మోడీ వాటిని ప్రమోట్ చేశాడు.

కొంతమంది ప్రముఖ నటులను, రచయితలను తమ వైపు లాక్కోవటానికి బిజెపి నిరంతర ప్రయత్నం చేస్తోంది. దీనికి అనుకూలత చూసేవాళ్లు ఉన్నట్టే ప్రతిఘటించే వారూ కన్నడ, తమిళ, మలయాళ సినీ పరిశ్రమల్లో ఉన్నారు. తెలుగు సినీ పరిశ్రమలో ప్రజాసమస్యలపై నేరుగా స్పందించటం తక్కువ.

**11. అంతర్జాలం :**

శాస్త్ర సాంకేతిక రంగాల్లో వచ్చిన మార్పు ఎన్నో ప్రచార, సాంస్కృతిక వాహికలను ముందుకు తెచ్చింది. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ వంటివి.

**కొత్త రూపాలు :** స్టాండప్ కామెడీ, రీల్స్, షార్ట్ వీడియో, సెల్ఫీ (లోకేష్ ప్రచారం), మోడీ బొమ్మతో రైల్వే వంటివి వచ్చాయి.

**పోల్స్ :** జనం అభిప్రాయం తెలుసుకోవడం ఈ మధ్య కాలంలో ఎక్కువైంది.

**స్టాండప్ కామెడీ :** ఒకప్పటి మన పిట్టల దొర చేసిన పనినే ఈ స్టాండప్ కామెడీ చేస్తోంది. హిందీ చానెళ్లలో అనేకమంది స్టాండప్ కమెడియన్లు ఈ మధ్యకాలంలో ప్రాచుర్యంలోకి వచ్చారు. దేశ వర్తమాన రాజకీయాల మీద బ్రహ్మాండమైన కామెడీ వినిపిస్తున్నారు. నోట్ల రద్దు, మోడీ విదేశీ పర్యటనల మోజు, ప్రసంగాల తీరు, ప్రశ్నిస్తే చైనా, పాకిస్తాన్ ఏజెంట్లు అంటూ వ్యాఖ్యానించే తీరుపైనా చాలా కామెడీ చేశారు.

కునాల్ కర్మ, వరుణ్ గ్రోవర్, అభిజిత్ గంగూలీ, మనీష్ పవార్, డేనియల్ ఫెర్నాండేజ్ వంటి వారు ఈ తరహా స్టాండప్ కామెడీతో పాపులర్ అయ్యారు. హిందీ, ఇంగ్లీషు భాషల్లో ఈ కామెడీ బాగా నడుస్తోంది.

బిజెపి పాలనపైనా, కోవిడ్ సమయంలో వైఫల్యాలపైనా విమర్శలు చేసిన స్టాండప్ కమెడియన్ మున్వార్ ఫరూఖీ బిజెపి అనుచరులు ట్రోలింగ్‌కి, బెదిరింపులకు గురయ్యాడు. వారు అతడి బెంగళూరు ప్రదర్శనను అడ్డుకున్నారు.

తెలుగులో ఈటీవీ ప్లస్ లో ఇలాటి స్టాండప్ కామెడీ (జాతిరత్నాలు) చేస్తున్నా– అది వర్తమాన సమస్యలపై కాకుండా జబర్దస్త్ షో మాదిరిగానే ఉంది.

ఇది ఇతరత్రా సరంజామా అవసరం లేకుండా ఒక వ్యక్తి చేసే ప్రదర్శన కాబట్టి– ఈ తరహా కామెడీని మనమూ ప్రయత్నించవొచ్చు. సోషల్ మీడియాలోనూ, వేదికలపైనా ప్రదర్శించవొచ్చు. పిట్టల దొర ప్రదర్శన గతంలో మన కార్యక్రమాల్లో ఉన్నదే!

**12. పత్రికల్లో వచ్చిన మార్పులు :** మన దేశంలో పత్రికలు స్వాతంత్ర్యాభిలాష, సంఘ సంస్కరణ ప్రధాన లక్ష్యాలుగా ప్రారంభమయ్యాయి. స్వాతంత్ర్యం వచ్చాక వ్యాపార ధోరణి మొదలైంది. సాహిత్యానికి, కళలకు కొంతైనా స్థానం ఉండేది. ఇప్పుడు కార్పొరేటు పెట్టుబడితో నడుస్తున్నాయి. స్థానిక యాజమాన్యాలు నడుపుతున్నట్టు కనిపిస్తున్నా దేశంలో ప్రధాన మీడియాలో 70 శాతం పెట్టుబడి అంబానీ, అదానీలది. 80 శాతం మీడియా ఇప్పుడు బిజెపి అదుపాజ్ఞల్లో ఉంది. ప్రజాపక్షం వహించే మీడియా మీద నిర్బంధం, కక్షసాధింపు నడుస్తున్నాయి.

**13. కర్తవ్యాలు :**

ప్రజలు వివిధ సాంస్కృతిక రూపాల్లో తమను తాము వ్యక్తం చేసుకోవటానికి, భాగస్వాములు కావటానికి ఉత్సాహంగా ఉన్నారు.

పెట్టుబడీదారీ వ్యవస్థ కళను వ్యాపారీకరించి, ప్రజలను ప్రేక్షకులుగా వీక్షకులగా చేస్తోంది. తన భావాలను అందుకునేవారిగా మారుస్తోంది. ప్రజలూ తమ అభిప్రాయాలను చెప్పే వేదికలను ఉపయో గించుకుంటున్నారు. భజనలు, కోలాటాలూ నేర్చుకుంటున్న మహిళల సంఖ్య మన రాష్ట్రంలో ఇటీవల పెరిగింది. బాలోత్సవాలు ఊహించిన దానికన్నా ఎక్కువ విజయవంతం అవుతున్నాయి. వ్యయ ప్రయాసలకోర్చి, పిల్లలను భాగస్వాములను చేస్తున్నారు. ఆర్టిస్టుల ఫోరం చిత్రలేఖన శిబిరాలు నిర్వహిస్తే అంచనాలకు మించిన హాజరు కనిపించింది. సాంస్కృతిక ఉత్సవాలు ఎక్కడ నిర్వమించినా జనం పెద్దసంఖ్యలో వచ్చి చూస్తున్నారు.

భావజాల రంగంలో ప్రచారానికి ఇది అనుకూల సమయం.

ప్రపంచ వ్యాప్తం నేడు ప్రజల ఆకాంక్ష, నిరసన ఈ రూపంలోనే ఎక్కువగా వ్యక్తమవుతుంది. 2019 – చిలీ, నేటి పాలస్తీనా ప్రజల కళారూప ఆందోళనలు ఈ సంగతినే చెబుతున్నాయి. నిన్నగాక మొన్న అంగన్వాడీ నిరవధిక దీక్షల్లో వాళ్లకు వాళ్లే పాపులర్ బాణీల్లో పాటలు కూర్చి పాడారు. ఆటలూ పాటలూ ప్రజల శ్రమ జనితాలు. ప్రజల పోరాటాలకు అవి గొప్ప ఉపకరణాలు.

❋

నివాళి

# కాకలు తీరిన కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ ఆర్ఎస్




**వై రాము**

రచయిత డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు


నిరంతరం ప్రవహించే గోదావరి ప్రక్కనే ఓ గ్రామం. ఆ గ్రామానికి ఓ చరిత్ర. దానికి కారణం ఓ కమ్యూనిస్టు. ఆ గ్రామం పేరు చించినాడ. ఆ కమ్యూనిస్టు ఆర్ఎస్ అని పిలుచుకునే కామ్రేడ్ రుద్రరాజు సత్యనారాయణ రాజు. క్రమశిక్షణ దృఢ సంకల్పం, ఆవేశం, నిత్యపోరాటాల కలబోతే ఆర్ఎస్ జీవితం. ఆయన జీవితమంతా ప్రజలతో ముడిపడ పోయింది. విప్లవోద్యమంలో త్యాగాలు, నిర్బంధాలు, కష్టనష్టాలు అంతర్భాగమే. అయితే సైద్ధాంతికంగా మితవాదం, అతివాదాలను నిర్దిష్టంగా విశ్లేషించుకోవడం అంత సులభమేమి కాదు. ఆ ఒడిదుడుకులను ఎదుర్కొన్నారు. ఆనాటి సిపిఎం జిల్లా కార్యదర్శితో సహా జిల్లా ముఖ్య నేతలంతా వ్యక్తిగత హింసావాదం వైపు కొట్టుకుపోయినా ఆ ప్రభావం లేకుండా స్థిరంగా సిపిఎం వైపు నిలబడ్డారు . భూస్వామ్య కుటుంబంలో పుట్టినా తన జీవితాన్ని కష్ట జీవుల కోసం త్యాగం చేశారు. వృద్ధాప్యం రీత్యా కామ్రేడ్ ఆర్ఎస్ తన 97వ ఏట సెప్టెంబర్ 5, 2024వ తేదీన భీమవరంలో కన్నుమూసారు.

ఆర్ఎస్ పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం చించినాడ గ్రామంలో 1928వ సంవత్సరంలో పుట్టారు. తండ్రి రుద్రరాజు గోపాలరాజు, తల్లి సూరమ్మలకు మూడవ సంతానం. మొత్తం నలుగురు అన్నదమ్ములు, ఇద్దరు చెల్లెళ్లు. నరసాపురం టేలర్ హై స్కూల్, పాలకొల్లు ఎంఎంకెఎన్ఎం హైస్కూల్‌లో పాఠశాల విద్య, భీమవరం డి.ఎన్.ఆర్ కాలేజిలో ఇంటర్ చదివారు. నర్సాపురం టేలర్ హై స్కూల్‌లో చదువుతున్న సమయంలోనే ఏఐఎస్ఎఫ్‌లో పని చేశారు విద్యార్థి నాయకుడిగా నర్సాపురం తాలుకాలో పలు విద్యార్థి సమస్యలపై పోరాడారు. 1950 సంవత్సరంలో ఇంటర్ పూర్తి చేసారు. అది ప్రజా ఉద్యమాలను నిషేధించిన కాలం. ఏఎస్ఎఫ్ఐ గుంటూరులోని రాష్ట్ర కేంద్రంలో రహస్యంగా కార్యకలాపాలు కొనసాగించేది. రాష్ట్ర నాయకత్వం అజ్ఞాతంలోకి వెళ్లాల్సి వచ్చింది. నాయకత్వం సూచనమేరకు రాష్ట్ర కేంద్రంలో ఆర్ఎస్ పని చేశారు. అనంతరం కామ్రేడ్ ఉద్దరాజు రామం, కామ్రేడ్ అల్లూరి సూచన మేరకు చించినాడ వచ్చి పని చేశారు.

1950వ సంవత్సర కాలంలో చించినాడ గ్రామంలో కమ్యూనిస్టు పార్టీ ఎదుగుదలను భూస్వాములు, కాంగ్రెస్ పెత్తందారులు సహించలేకపోయారు. లంక భూముల పోరాటమే కారణం. పార్టీని విచ్ఛిన్నం చేయడానికి బెదిరింపులు చేసినా, కులాన్ని డబ్బులను ఉపయోగించినా ఫలించలేదు. గ్రామంలో కూలి 4 లేదా 5 రూపాయలు మించి ఇచ్చేవారు కాదు. 2 సంవత్సరాల పోరాటాల అనంతరం 8 రూపాయలకు పెంచుకోగలిగారు. బియ్యం ధర మార్కెట్లో 3 రూపాయలుండేవి. ఆ మొత్తం కూలీలకు, పేదలకు భారంగా ఉండేది. పార్టీ ఆధ్వర్యంలో ధాన్యాన్ని సేకరించి. వాటిని బియ్యంగా చేయించి కిలో 1.50 పైసలకు విక్రయించారు. దీంతో గ్రామంలో కమ్యూనిస్టు పార్టీ ప్రజలకు చేరువయింది.

**దాడులకు ఎదురునిలిచి..**

గ్రామంలో భూస్వాములు నిత్యం దళితుల మధ్య, పేదల మధ్య ఘర్షణ వాతావరణాన్ని సృష్టించేవారు. ఈ క్రమంలో సిపిఎం కార్యకర్తలను గ్రామ మునసబు రుద్రరాజు చిరంజీవిరాజు అనుచరులు దాడి చేసి కొట్టారు. తీవ్రంగా గాయపడిన వారిని ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రాణాలు నిలిపారు. ఈ సంఘటన సంచలనంగా మారిపోయింది. అమాయకులైన వారిపై దాడి చేయడాన్ని ప్రజలు సహించలేదు, కార్యకర్తల్లో పట్టుదల పెరిగింది. మరింత సంఘటితమయి భూస్వాములకు ధీటుగా సమాధానమిచ్చారు. ఈ నేపథ్యంలో గ్రామంలో సంవత్సరకాలం పాటు పోలిస్ పికెటింగ్ నిర్వహించారు. ఆ తరువాత జరిగిన ఘర్షణల్లో కామ్రేడ్ పంతగాని సూరన్న, వేండ్ర సత్యనారాయణ, వీరవల్లి నారాయణలను భూస్వాములు హత్య చేశారు. విలువైన ముగ్గురు కామ్రేడ్స్ ప్రాణాలర్పించారు. 1950 లో

> **❝కామ్రేడ్ ఆర్ఎస్ 1953లో 25 ఏళ్ల వయస్సులో చించినాడ గ్రామ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 1966 వరకు పని చేశారు. 5 వేల రూపాయలున్న పంచాయితీ ఆదాయాన్ని 40 లక్షల వరకు పెంపులో విశేష కృషి చేశారు. ప్రజలపై భారాలు వెయ్యకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో ఆదాయాన్ని ఎలా పెంచుకోవచ్చో ఒక రోల్ మోడల్‌గా గ్రామాన్ని తీర్చిదిద్దారు. వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని ఏర్పాటు చేశారు. 300 మంది పేద కుటుంబాలకు 50 ఎకరాల భూమి పంచి పట్టాలు ఇప్పించారు.❞**

అయిదుగురు అమరుల ప్రాణత్యాగం ఆర్ఎస్‌లో ఉద్యమస్ఫూర్తిని రగిల్చాయి.

### స్నేహితులే సారథులు

కమ్యూనిస్టు ఉద్యమంలో గొప్ప స్నేహితులు అనేకమందున్నారు. అందులో కామ్రేడ్ ఆర్ఎస్., కామ్రేడ్ అల్లూరుల స్నేహం ఒకటి.. ఇరువురూ జీవిత కాలం ఉద్యమ సహచరులు, కామ్రేడ్ అల్లూరు సత్యనారాయణ స్వగ్రామం తూర్పు గోదావరి జిల్లా సఖినేటిపల్లి, ఇద్దరూ నర్సాపురంలోని టేలర్ హై స్కూల్‌లో కలిసి చదువుకున్నారు. ఒకేసారి కమ్యూనిస్టు పార్టీ సభ్యులయ్యారు, చీలిక సమయంలో సీపీఎం పార్టీ వైపు నిలబడ్డారు. అల్లూరి సత్యనారాయణ 1968 సం.నుండి 1994 సం.వరకు పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. ఆయన రాష్ట్ర కేంద్రానికి వెళ్ళిన అనంతరం కామ్రేడ్ ఆర్ఎస్ జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఉద్యమ నిర్మాణంలో ఇరువురు జంట కవుల్లా పనిచేశారు. కామ్రేడ్ ఉద్దరాజు రామం గైడెన్స్‌తో రాటుతేలారు, విశాఖపట్నం జైలులో ఒక సంవత్సరం పాటు జైలు శిక్షను అనుభవించారు. నిర్మాణ విషయాలను ఎప్పటికప్పుడు చర్చించుకుని ముందుకు సాగారు. ఆర్ఎస్‌లోని ఆవేశం అల్లూరులోని సిద్ధాంత స్థాయే వారి 70 ఏళ్ళ ఉద్యమ ప్రస్థానం.

### మార్గదర్శే ప్రత్యర్థి

నమ్మిన సిద్ధాంతం కోసం అంకితభావంతో జీవితచరమాంకం నిలబడడం గొప్ప విషయం. కొందరు మధ్యలోనే ఆదర్శాలకు, విలువలకు తిలోదకాలిచ్చి దిగజారిపోయేవారుంటారు. అలాంటి కోవకు చెందిన వ్యక్తి పరకాల శేషావతరం. ఈయన నర్సాపురం తాలూకా కమ్యూనిస్టు పార్టీకి ఆర్గనైజర్‌గా పని చేశారు. ఆ సమయంలో ఆర్ఎస్ 'హై స్కూల్ విద్యార్థిగా స్టూడెంట్ ఫెడరేషన లో పనిచేస్తున్నారు. పరకాల శేషావతారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కమ్యూనిస్టు పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరి మంత్రి అయి భూస్వాములకు కొమ్ముకాసారు. చించినాడ మునసబుకు తన అండ దండలు ఇస్తూ కమ్యూనిస్టుల పైకి ఎగదోసాడు.

అక్రమంగా కేసులు బనాయించడంలో పరకాల పాత్ర ఉంది. తను మంత్రిగా ఉన్న సమయంలో పరపతిని ఉపయోగించి ఆర్ఎస్‌కు శిక్ష పడేలా చేశారు. చించినాడ గ్రామ అభివృద్ధి పనులకు నిరంతరం ఆటంకపరిచేవాడు. 1962 వ సం,,లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో నర్సాపురం నుండి కమ్యూనిస్టు పార్టీ తరుపున ఆర్ఎస్, కాంగ్రెస్ తరుపున పరకాల శేషావతారం ప్రత్యర్థులుగా తలపడ్డారు. అ ఎన్నికల్లో ఆర్ఎస్ ఓడిపోయారు 1967వ సంలో జరిగిన ఎన్నికల్లో పరకాల పై 4500 ఓట్ల మెజార్టీతో ఆర్ఎస్ గెలుపొందారు.

### జైలు జీవితం – నిర్బంధం

1974 సంవత్సరంల మే1వ తేదీన రైల్వే కార్మికుల పోరాటంలో 15 రోజుల పాటు రాజమండ్రి సెంట్రల్ జైలులో, 14 రోజుల పాటు నెల్లూరు జైలులో ఉన్నారు. చించినాడ భూపోరాటంలో 1977–78, 1979 సంవత్సరాలలో 4 నెలలు జైలు జీవితం అనుభవించారు. ఆర్ఎస్‌తో పాటు 150 మందిపై 36 క్రిమినల్ కేసులు బనాయించారు. అందులో 3 హత్య కేసులు, 4 హత్యాయత్నం కేసులున్నాయి. అన్ని కేసుల్లో ఆర్ఎస్ మొదట ముద్దాయి. ఒక హత్యకేసులో ఏలూరు జిల్లా సెషన్ కోర్టు ఆర్ఎస్, కేతా సూర్యారావులకు జీవిత ఖైదు విధించింది. మిగిలిన వారికి 2 సం॥లు జైలు శిక్ష విధించింది. తర్వాత పై కోర్టు సాక్ష్యాధారాలు సరిగ్గాలేవని కేసుని కొట్టేసింది. కామ్రేడ్ ఆర్ఎస్ కామ్రేడ్.కేతా సూర్యారావులు జైలులో ఉండగానే చించినాడ పంచాయితీ ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ నాయకులు పార్టీ పని అయిపోయిందని దుష్ప్రచారం చేసారు. పార్టీ కేడర్‌ని భయ భ్రాంతులకు గురి చేశారు. అంతచేసినా పార్టీ అభ్యర్థి రుద్రరాజు సూర్యనారాయణ రాజు ఘన విజయాన్ని అడ్డుకోలేకపోయారు.

### ప్రజా ప్రతినిధిగా

కామ్రేడ్ ఆర్ఎస్ 1953లో 25 ఏళ్ల వయస్సులో చించినాడ గ్రామ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 1953–1966 వరకు పని చేశారు. 5 వేల రూపాయలున్న పంచాయితీ ఆదాయాన్ని 40 లక్షల వరకు పెంపులో విశేష కృషి చేశారు. ప్రజలపై భారాలు వెయ్యకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో ఆదాయాన్ని ఎలా పెంచుకోవచ్చో ఒక రోల్ మోడల్‌గా గ్రామాన్ని తీర్చిదిద్దారు. వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని ఏర్పాటు చేశారు. 300 మంది పేద కుటుంబాలకు 50 ఎకరాల భూమి పంచి పట్టాలు ఇప్పించారు. గ్రామ ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్లారు. 1967 లో ప్రత్యర్థి పరకాలపై నరసాపురం ఎమ్మెల్యేగా గెలుపొందారు. తుఫాన్ సంభవించినప్పుడు ప్రజల మధ్యనే ఉండి పనిచేసారు. మత్స్యకారుల సమస్యలపై, గిట్టుబాటు ధరల కోసం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వసతుల కోసం, చేతివృత్తిదారుల సమస్యలపై, సాగునీరు, త్రాగునీరు, రవాణా సమస్యలపై, దళిత, గిరిజన, ఉద్యోగ,ఉపాధ్యాయ సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తారు.

కత్తులు దూసుకుపోయినా, నెత్తుటేరులు పారినా ఎత్తిన జెండాని దించని స్వభావం ఆర్ఎస్ ది. తన తలను కోట గుమ్మానికి వ్రేలాడదీస్తామని భూస్వాములు ప్రకటించినా వెరవని వ్యక్తిత్వం, ఆస్తులు, పొలాలు ధ్వంసం చేసినా, ఇంటిని లూటీ చేసినా, బంధువులను బెదిరించినా తన సంకల్పాన్ని మార్చుకోలేదు. ప్రత్యర్థులు ఒంటరిని చేసినా ఓడిపోలేదు. పడే బాధల్లో పోరాటమే ఓదార్పుగా సాగారు. కార్యకర్తలు కష్టంలో ఉంటే వెంటనే స్పందించి సహాయపడేవారు. ఎలా ఉన్నారు అని ఎవరైనా పలకరిస్తే ఏముంది “నిత్య కళ్యాణం – పచ్చ తోరణం” అంటూ ఛలోక్తిగా మాట్లాడేవారు. తన 97ఏళ్ల నిండు జీవితంలో 75 సంవత్సరాలు ఉద్యమానికి అర్పించారు. జీవితాంతం తను నమ్మిన సిద్ధాంతం కోసం నిలబడ్డ నిఖార్సైన కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ ఆర్ఎస్. ❋

చరిత్ర

# ఉత్తర భారతంలో రాజకీయ, పాలనా వ్యవస్థలు

## (క్రీ.శ.700-1000 మధ్య కాలంలో)


రచయిత ప్రజాశక్తి మాజీ సంపాదకుడు

ఎంవిఎస్ శర్మ

**కేంద్రీకృత అధికారాలు:**

ఈ కాలంలో ఉత్తర భారతంలో ప్రధాన సామ్రాజ్యాలుగా ఉండిన పాల, ప్రతీహార, రాష్ట్రకూట సామ్రాజ్యాలలో గుప్తుల కాలంలోను, హర్షుడి కాలంలోను ప్రవేశపెట్టిన పాలనావిధానాలను, ఆలోచనలను కొనసాగించారు. మునుపటిలాగే ఇప్పుడు కూడా చక్రవర్తి సర్వం సహాధికారి. చక్రవర్తే పాలనాధికారి. అతడే సైన్యాలకు సర్వాధికారి. బ్రహ్మాండమైన దర్బారులో చక్రవర్తి ఆసీనుడై వుంటాడు. కాల్బలం, ఆశ్వికబలం దానికి ముందు ఆవరణలో ఉంటాయి. యుద్ధాల్లో పట్టుకున్న గజబలాన్ని, ఆశ్వికబలాన్ని అతడిముందు కవాతుద్వారా ప్రదర్శిస్తారు. ప్రతీహారి లేదా కంచుకి చక్రవర్తి దర్శనాల కార్యక్రమాన్ని సమన్వయపరుస్తాడు. సామంత ప్రభువులు, జమీందారులు, రాయబారులు, ఇతర ఉన్నతాధికారులు చక్రవర్తిని నిత్యం దర్శిస్తూ వుండాలి. చక్రవర్తే న్యాయాధికారి కూడా.

చక్రవర్తి దర్బారు కేవలం పాలనకు, రాజ్య నిర్వహణకు మాత్రమే పరిమితం కాదు. అక్కడ సాంస్కృతిక కార్యకలాపాలు కూడా తరచూ సాగుతాయి. చక్రవర్తి కొలువులో నాట్యగత్తెలు, సంగీత విద్వాంసులు ఉంటారు. పండగల్లో, ఉత్సవాల సమయంలో రాచ కుటుంబాలలోని మహిళలు కూడా దర్బారుకు హాజరవుతారు. రాష్ట్రకూటుల దర్బారులోని మహిళలు ముసుగు ధరించే ఆచారాన్ని పాటించేవారు కారు అని అరబ్బు పర్యాటకుల రచనలు తెలియజేసున్నాయి.

రాజు హోదా వంశపారంపర్యంగా సంక్రమిస్తుంది. వేరు వేరు రాజ్యాల మధ్య గాని, ఒకే రాజ్యంలో సామంతుల తిరుగబాట్లు గాని తరచూ జరుగుతూవుండే కాలం అది. అందుచేత ప్రభువుకు అత్యంత విశ్వసనీయంగా నడుచుకోవడం అనేది తక్కిన అన్ని గుణాలకన్నా గొప్ప సుగుణంగా పరిగణించబడేది. ఆవిధంగానే అప్పటి మేధావులు ప్రచారం చేసేవారు. పురాణాలూ చెప్పాయి. తమ తమ రాజ్యాల్లో శాంతి, భద్రతలను కాపాడడం రాజు బాధ్యతగానే పరిగణించినా, దొంగతనాల నుంచి, ప్రాణహాని తలపెట్టినవారినుంచి తమను తాము కాపాడుకోవడం ప్రజల అవసరంగా ఉండేది. మేధాతిథి అనే ఆ కాలపు ఒక మేధావి మాత్రం రాజు అన్యాయానికి పాల్పడితే ప్రతిఘటించడం ప్రజల హక్కు అని ప్రచారం చేశాడు. అంటే పురాణాలలోని భావజాలాన్ని వ్యతిరేకించే మేధావులు ఆనాడు ఉండేవారని తెలుస్తోంది.

రాజు తదనంతరం అతడి పెద్ద కుమారుడు రాజు కావాలన్నది ఆచారంగా ఉన్నా, అనేక సందర్భాలలో తక్కిన కుమారులు పెద్ద కుమారుడితో రాజ్యాధికారం కోసం తలపడిన సందర్భాలు ఉన్నాయి. రాష్ట్రకూట రాజులు ధృవుడు, 4వ గోవిందుడు తమ కన్నా పెద్ద సోదరులపై తిరుగుబాట్లు చేసి తామే ప్రభువులమని ప్రకటించుకున్నారు. ముందు జాగ్రత్తగా రాజు తన కుమారుడికి యువరాజ పట్టాభిషేకం చేసి అతడికి క్రమంగా రాజ్య పాలనా వ్యవహారాలమీద పట్టు కల్పించేవాడు. ఒక్కోసారి పెద్దకొడుకును పక్కన పెట్టి చిన్న కుమారుడికే యువరాజ పట్టాభిషేకం చేసిన సందర్భాలు ఉన్నాయి. పెద్ద కొడుకు రాజు అయినప్పుడు తక్కిన కుమారులని ఆయా ప్రాంతాల సామంతప్రభువులుగా నియమించే విధానం ఉండేది.

రాజుకు సలహాదారులుగా మంత్రులు ఉండేవారు. సాధారణంగా రాజ్యం లోని ఉన్నత, సంపన్న కుటుంబాలనుంచి తన మంత్రులను రాజు ఎంపిక చేసేవాడు. వీరి నియామకాలలో కూడా వంశపారంపర్యత పాటించేవారు. శాసనాలను బట్టి, సాహిత్యాన్ని బట్టి చూస్తే ఎక్కువ రాజ్యాలలో విదేశీ వ్యవహారాలను చూసే మంత్రి, రెవెన్యూ మంత్రి, కోశాధికారి, సైన్యాధిపతి, ప్రధాన న్యాయమూర్తి, పురోహితుడు రాజు కొలువులో సహాయకులుగా ఉండేవారు. ఒకటి కన్నా ఎక్కువ శాఖలను చూడగలిగిన సమర్థుడు, లేదా తక్కినవారికన్నా సామర్థ్యంలో ఆధిక్యత చూపినవాడు ఉంటే అతడిని ప్రధానమంత్రిగా నియమించిన సందర్భాలూ ఉన్నాయి. పురోహితుడు తప్ప తక్కిన మంత్రులు యుద్ధంలో సైన్యాన్ని నడిపించగల సామర్థ్యం కలిగివుండాలి. వీరు కాక, అంత:పుర వ్యవహారాలను పర్యవేక్షించడానికి ఒక అధికారి ఉండేవాడు. సర్వాధికారాలూ రాజుకే ఉండడంతో ఒక్కోసారి ఈ అంత:పుర అధికారి కీలకం అయేవాడు కూడా.

**బలం ఉన్నవాడిదే రాజ్యం**

అన్నింటికన్నా సైన్య విభాగమే కీలకంగా ఉండేది. ఇటు అధికారాన్ని పటిష్టపరచుకోడానికి గాని, అటు రాజ్యాన్ని విస్తరించడానికి గాని సైన్యమే కీలకం. ఈ మూడు ప్రధాన సామ్రాజ్యాలూ చాలా భారీ సంఖ్యలో పదాతి, ఆశ్విక, గజ దళాలను నిర్వహించేవారు. పాల రాజుల దగ్గర గజ దళాలు ప్రసిద్ధికెక్కాయి. ప్రతీహార, రాష్ట్రకూట రాజులు చాలా నాణ్యత కలిగిన గుర్రాలను అరబ్బు ప్రాంతాలనుండి దిగుమతి చేసుకున్నారు. జీను వేసిన గుర్రాలు యుద్ధంలోను, ప్రయాణాలలోను చాలా బాగా ఉపయోగపడేవి. వేగంగా గుర్రాలు పరుగెత్తినా, ఆశ్వికుడు దానిమీదనుంచి పడిపోకుండా పట్టివుంచడానికి, చేతులను ఆయుధాలు ప్రయోగించడానికి తోడ్పడేవి. దాంతో ఆశ్విక దళం ఆక్రమణల సందర్భంలో, కాల్బలాలను చెల్లాచెదురు చేయడంలో కీలకపాత్ర పోషించేవి. ఇక రథాలను ఉపయోగించడం దాదాపుగా అదృశ్యమైపోయింది. రక్షణ కోసం రాజులు

**❝ సామంతరాజులకు వారి వారి పరిధిలోకి వచ్చే భూభాగాల మీద పాలనాధికారం ఉండేది. దాదాపుగా అన్ని వ్యవహారాలూ సామంతరాజులే నిర్వహించే వారు. చక్రవర్తికి విధేయత కలిగివుండడం, ఒక నిర్ధారించబడిన మొత్తాన్ని కప్పంగా చెల్లిస్తూవుండడం, అవసరం పడినప్పుడు సైనిక దళాలను చక్రవర్తి సేవకు పంపడం సామంతరాజుల విధి. ఒక్కోసారి విశ్వాస పాత్రుడైన సామంతరాజు తన కుమారులను చక్రవర్తి ప్రత్యక్షసేవలో ఉంచేవారు. ❞**

కోటలను, అనేక దుర్గాలను నిర్మించారు. వాటిలో ప్రత్యేక సైనిక దళాలను మోహరించే వారు. కాల్బలంలో శాశ్వత సైనికులు, యుద్ధ సమయంలో అవసరార్థం నియమించ బడినవారు రెండు తరహాలూ ఉండేవారు. శాశ్వత దళాలలో వంశపారంపర్యంగా ఉద్యోగాలను కల్పించే సాంప్రదాయం కూడా ఉంది.

ఇక సామంతరాజులకు వారి వారి పరిధిలోకి వచ్చే భూభాగాల మీద పాలనాధికారం ఉండేది. దాదాపుగా అన్ని వ్యవహారాలూ సామంతరాజులే నిర్వహించే వారు. చక్రవర్తికి విధేయత కలిగివుండడం, ఒక నిర్ధారించబడిన మొత్తాన్ని కప్పంగా చెల్లిస్తూవుండడం, అవసరం పడినప్పుడు సైనిక దళాలను చక్రవర్తి సేవకు పంపడం సామంతరాజుల విధి. ఒక్కోసారి విశ్వాస పాత్రుడైన సామంతరాజు తన కుమారులను చక్రవర్తి ప్రత్యక్షసేవలో ఉంచేవారు. ఈ సామంత రాజులు చక్రవర్తి పై తిరుగబాట్లు ప్రకటించడం, వారితో చక్రవర్తి యుద్ధాలు చేయడం తరచూ జరిగేది. ఆ విధంగా రాష్ట్రకూట చక్రవర్తులు ఆంధ్ర ప్రాంత (వేంగీ) సామంతులతో పలుమార్లు యుద్ధాలు చేశారు. ప్రతీహార చక్రవర్తులు మాల్వ ప్రాంతపు సామంతులు పరమారులతోను, బుందేల్‌ఖండ్ సామంతులు చందెల్లాలతోను యుద్ధాలు చేశారు.

### పాలన వికేంద్రీకరణ

పాల, ప్రతీహార సామ్రాజ్యాలలో ఒక్కో సామంత రాజ్యం పరిధిని భుక్తి (ప్రాంతం, లేదా ప్రదేశం) గాను, వాటిని తిరిగి మండలాలుగా (జిల్లా) విభజించారు. ఒక ప్రదేశానికి అధిపతిగా నియమించబడినవాడు ఉపారికుడు. మండలాధికారి విషయపతి. ఉపారికుడు తన ప్రాంతంలో పాలనకు బాధ్యత వహిస్తూ సైన్యం సహాయంతో శాంతి భద్రతలను కాపాడాల్సివుంటుంది. మండలం పరిధిలో విషయపతి కూడా అదే బాధ్యత చూడాలి. వీరి కింద దొంతర కూడా తర్వాత కాలంలో ఏర్పడింది. ఆ స్థాయి బాధ్యులను భోగపతి అనేవారు. ఇక రాష్ట్రకూట సామ్రాజ్యం రాష్ట్రాలుగా, రాష్ట్రాలు విషయ, భుక్తి గా విభజించబడ్డాయి. రాష్ట్రాలకు అధికారులను రాష్ట్రపతులు అనేవారు. దాని దిగువన విషయ అనేది ప్రస్తుత జిల్లా మాదిరిగా ఉండేది. దాని దిగువన భుక్తి అనే ఇంకా చిన్న విభాగం ఉండేది. ఈ చిన్న విభాగాల పని ప్రధానంగా ప్రజలనుండి పన్నులను వసూలు చేసి జమ చేయడం.

### గ్రామ పాలనా వ్యవస్థ

ఈ ప్రాంతీయ అధికార వ్యవస్థలకు దిగువ గ్రామం ఉండేది. గ్రామానికి పెద్ద, లెక్కలు చూసేవాడు–ఇద్దరు అధికారులు ఉండేవారు. తర్వాత కాలంలో వారే మునసబు, కరణం అయారు. వీరి పదవులు సాధారణంగా వంశపారంపర్యంగా ఉండేవి. వారికి వేరే వేతనాలు చెల్లించకుండా పన్ను మిహాయింపు కల భూమిని కేటాయించారు. గ్రామ పెద్దకు సహాయకారిగా రాష్ట్రకూట రాజ్యంలో గ్రామపెద్దల కూటమి ఉండేది. గ్రామంలోని పాఠశాలను, చెరువులను, దేవాలయాలను, రహదారులను నిర్వహించే పని గ్రామ కమిటీలు చూసే విధానం ఉండేది. ఈ కమిటీలు గ్రామపెద్ద పర్యవేక్షణలో పని చేసేవి. వాటికి గ్రామంలో వసూలైన పన్నులో కొంత వాటా చెల్లించేవారు. దేవాలయాలకు, స్కూళ్ళకు కొంత ఆస్థిని ట్రస్టు రూపంలో కేటాయించి దానిని నిర్వహించేపనిని ఈ కమిటీలకు అప్పజెప్పే పద్ధతి కూడా ఉండేది. ఇక పట్టణాలలో శాంతి, భద్రతల బాధ్యతను కొత్వాలు చూసేవాడు.

ఈ గ్రామ పెద్ద, రెవెన్యూ పద్దు చేసే అధికారి బాధ్యతలు వంశపారంపర్యంగా కొనసాగడంతో క్రమంగా ఈ పదవుల చుట్టూ గ్రామ అధికారాలు కేంద్రీకృతం అయాయి. గ్రామ కమిటీలు నామమాత్రం అయిపోతూవచ్చాయి. దీనినే మనం ప్రభుత్వం రాను రాను ఫ్యూడల్ స్వభావాన్ని సంతరించుకుంది అని అంటాం.

### మతం–రాజ్యం

ఇక మత వ్యవస్థ విషయానికి వస్తే పాలకులు శైవ, వైష్ణవ, బౌద్ధ, జైన మతాలలో దేనినో ఒకదానిని అనుసరించేవారు. వారనుసరించే మతంతో నిమిత్తం లేకుండా బ్రాహ్మణులకు, బౌద్ధ ఆరామాలకు, జైన విహారాలకు గ్రాంట్లు మంజూరు చేసేవారు. మతం పేరుతో ప్రజలను వేధించే పద్ధతి ఎక్కడా మనకి కనిపించదు. రాష్ట్రకూట ప్రభువులు ముస్లింలను కూడా ఆహ్వానించి, ఇస్లాం మత ప్రచారాన్ని చేసుకోడానికి అనుమతించారు. ధర్మశాస్త్రాలలో పేర్కొన్న నియమాల విషయంలో రాజు జోక్యం చేసుకునేవాడు కాదు. బ్రాహ్మణులకు రక్షణ కల్పించడం, కట్టుదిట్టంగా కుల కట్టుబాట్లు అమలు జరిగేలా చూడడం రాజు బాధ్యతగా ఉండేది. వేదాలనుండి, ధర్మ శాస్త్రాలనుండి రాజుకు సంక్రమించిన


## ‘మార్క్సిస్టు’ పై మీ అభిప్రాయాలు తెలపండి!

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.


మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**

**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

అధికారాలు వేరుగా, అర్థశాస్త్రం నుండి సంక్రమించిన అధికారాలు వేరుగా పరిగణించడం జరిగేది. అంటే అధికారాలన్నీ రాజు దగ్గరే కేంద్రీకృతం అయినప్పటికీ, రాజు మతాన్ని, పాలనను విడివిడిగా పరిగణించేవాడు అన్నది స్పష్టం ఔతోంది. సంఘపరివారం శక్తులు నిరంతరం మనది హిందూ రాజ్యంగా ఉండేదంటూ చేసే ప్రచారానికి ఏ ప్రాతిపదికా లేదని స్పష్టం ఔతోంది. ఈ కాలంలో రాజ్యం లౌకిక స్వభావాన్ని కలిగివుండేదని కూడా స్పష్టంగా చెప్పగలం.

**❝ పల్లవులకు సామంతుడిగా ఉండిన విజయాలయుడు చోళ సామ్రాజ్యాన్ని స్థాపించాడు. క్రీ.శ.850 లో అతడు తంజావూరును స్వాధీనం చేసుకున్నాడు. 9వ శతాబ్దం ముగిసేనాటికి చోళులు కంచిని కూడా తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. పాండ్యులను బాగా దెబ్బ తీసి తొండమండలాన్ని (అంటే దక్షిణ తమిళనాడు) తమ అదుపులోకి తీసుకున్నారు. ❞**




**చోళ సామ్రాజ్యం**
**(క్రీ.శ. 9వ శతాబ్దం నుండి 12వ శతాబ్దం వరకూ)**

దక్షిణ భారత ఉపఖండంలోని అత్యధిక భాగాన్ని చోళసామ్రాజ్యం తన ఆధీనంలోకి తెచ్చుకుంది. బలమైన నావికా సైన్యాన్ని నిర్మించుకోగలిగినందున, చోళులు హిందూ మహాసముద్రం గుండా జరిగే వాణిజ్యాన్ని పెంచుగలిగారు, అదుపు చేయగలిగారు. అంతే గాక, శ్రీలంక, మాల్దీవులను తమ స్వాధీనం లోకి తెచ్చుకున్నారు. ఇతర ఆగ్నేయ ఆసియా దేశాలమీద కూడా చోళుల ప్రభావం పడింది.

**చోళ సామ్రాజ్య స్థాపన**

పల్లవులకు సామంతుడిగా ఉండిన విజయాలయుడు చోళ సామ్రాజ్యాన్ని స్థాపించాడు. క్రీ.శ.850 లో అతడు తంజావూరును స్వాధీనం చేసుకున్నాడు. 9వ శతాబ్దం ముగిసేనాటికి చోళులు కంచిని కూడా తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. పాండ్యులను బాగా దెబ్బ తీసి తొండమండలాన్ని (అంటే దక్షిణ తమిళనాడు) తమ అదుపులోకి తీసుకున్నారు. ఐతే ఇదే కాలంలో చోళులు దక్కను వైపు నుండి రాష్ట్రకూటుల తాకిడిని తరచూ ఎదుర్కోవలసివచ్చింది. రాష్ట్ర కూట ప్రభువు 3వ కృష్ణుడు చోళులను ఓడించి ఆ సామ్రాజ్యంలోని ఉత్తర భాగాన్ని చేజిక్కించుకున్నాడు. ఈ ఎదురుదెబ్బ నుండి చోళులు 3వ కృష్ణుడి మరణానంతరం రాష్ట్ర కూట సామ్రాజ్యం పతనం కావడంతో క్రీ.శ. 965 నాటికి కోలుకోగలిగారు.

**రాజరాజ చోళుడు, ఒకటవ రాజేంద్ర చోళుడు**

985 నుండి 1014 వరకు పాలించిన రాజరాజ చోళుడు, 1014 నుండి 1044 వరకు పాలించిన ఒకటవ రాజేంద్ర చోళుడు చోళ ప్రభువులలోకెల్లా ప్రసిద్ధి చెందినవారు. తన తండ్రి కాలంలో యువరాజుగా పట్టాభిషిక్తుడైన రాజరాజ చోళుడు సింహాసనాన్ని మహారాజుగా అధిష్టించక ముందే చాలా లోతైన పరిపాలనా సామర్థ్యాన్ని, యుద్ధనీతిని తెలుసుకున్నాడు. తర్వాత చేర సామ్రాజ్య నావికా దళాన్ని త్రివేంద్రం వద్ద చిత్తు చేశాడు. అక్కడినుంచి క్విలన్‌ను ఆక్రమించాడు. అక్కడి నుండి మదురైను ఆక్రమించుకుని పాండ్యరాజును బందీగా పట్టుకున్నాడు. శ్రీలంక మీదకు దండెత్తి ఉత్తర భాగాన్ని తన ఆధీనంలోకి తెచ్చుకున్నాడు. తూర్పున తొండ మండలం, పశ్చిమాన మలబారు తీరం భారత ఉపఖండానికి అంతర్జాతీయ వాణిజ్యంలో కీలకంగా ఆనాటికి ఉన్నాయి. ఆ ప్రాంతాలను తన ఆధీనంలోకి తెచ్చుకుని ఆగ్నేయ ఆసియా దేశాలతో వాణిజ్యాన్ని తన అదుపులోకి తీసుకోవాలన్న లక్ష్యంతోటే రాజరాజ చోళుడు ఈ దండ యాత్రలను సాగించాడు. ఈ క్రమంలో మాల్దీవులను కూడా స్వాధీనం చేసుకున్నాడు. తన రాజ్యానికి ఉత్తరాన ఉన్న గాంగుల రాజ్యాన్ని, వేంగీ రాజ్యాన్ని కూడా స్వాధీనం చేసుకున్నాడు.

ఒకటవ రాజేంద్ర చోళుడు రాజరాజ చోళుని అనంతరం అధికారం చేపట్టాడు. తండ్రి అనుసరించిన మార్గాన్నే కొనసాగించి దూకుడుగా రాజ్య విస్తరణ కొనసాగించాడు. పాండ్య, చేర రాజ్యాలను పూర్తిగా జయించి తన సామ్రాజ్యంలో విలీనం చేసుకున్నాడు. శ్రీలంకను కూడా పూర్తిగా స్వాధీనం చేసుకున్నాడు. ఆ తర్వాత మరొక 50 సంవత్సరాల వరకూ శ్రీలంక తిరిగి చోళుల పెత్తనం నుంచి విముక్తి పొందలేకపోయింది.

( చూ. చోళ సామ్రాజ్యం పటం)
(తరువాయి వచ్చే సంచికలో )

సందర్భం

# చైనా 'లాంగ్ మార్చ్' కొనసాగుతోంది

## (అక్టోబర్ 1న ప్రజాచైనా 75వ వార్షికోత్సవం)




పి జయప్రకాష్

(రచయిత ఈసిఐఎల్ విశ్రాంత అధికారి)


అది 6,000 మైళ్ళు, పదకొండు రాష్ట్రాల గుండా సాగిన సుదీర్ఘ, దుర్లభ ప్రయాణం. 1934 అక్టోబర్‌లో తమను చియాంగ్-కై-షేక్ విప్లవ ప్రతీఘాత సైన్యాలు నలువైపులనుండి ముట్టడిస్తున్న సమయంలో అనివార్యమై వెనకడుగు వేసిన చైనా కమ్యూనిస్టు పార్టీ దక్షిణ చైనాలోని కియాంగ్-ఫు-కేయిన్ స్థావరాన్ని వదిలి మరోచోట తలదాచుకోవటానికి లక్ష మంది కమ్యూనిస్టు యోధులతో బయలుదేరింది. తమ మిలిటరీ సరఫరాలతో పాటు విప్లవ ప్రభుత్వానికి అవసరమైన సామగ్రి, అచ్చు యంత్రాలు, ఇతర మెషినరీ, ప్రచార సామాగ్రి, ముఖ్యమైన డాక్యూమెంట్లతో ఈ లక్షమంది జైత్రయాత్ర వాయవ్య దిశన ఉన్న షేన్-సి రాష్ట్రం చేరేవరకు కొనసాగింది. ఈ సుదీర్ఘ ప్రయాణమే చైనా "లాంగ్ మార్చ్"గా చరిత్రలో ప్రసిద్ధి కెక్కింది.

ఒకవైపు తమను తరుకొస్తున్న చియాంగ్ కైషేక్ సైన్యం, మరోవైపు ప్రాంతీయ యుద్ధప్రభువుల కిరాయి సైన్యాల దాడులు, ఇంకోవైపు ఆదివాసీ శత్రుతెగల అడ్డంకులు...వీటన్నిటినీ తప్పించుకుంటూ, భయంకరమైన వాతావరణ పరిస్థితులను ఎదురొడ్డుతూ కమ్యూనిస్టుల లాంగ్ మార్చ్ సాగింది. కొండ చరియలు, గుట్టలు, మంచు ఎడారులు, వాగులు వంకలు, బురద మైదానాల గుండా సాగిన ప్రయాణం అది. వారు షేన్-సి చేరే సరికి ఆ లక్షమందిలో 7,000 మతమే ప్రాణాలతో మిగిలారు. అంటే ప్రతి పద్నాలుగు మందికి ఒక్కరు మాత్రమే మిగిలారు. దీన్ని బట్టి వారి లాంగ్ మార్చ్ ఎంతటి భయంకర పరిస్థితులను ఎదురొడ్డి సాగిందో అర్థమవుతుంది.

చియాంగ్ కైషేక్, అతని సైన్యాలు, ఇతరులు కూడా కమ్యూనిస్టులు అంతమైపోయారన్న అభిప్రాయానికి వచ్చారు. సమూల శత్రు సంహారం జరిగిందని ఆనందపడిపోయారు. కానీ మావో జెడాంగ్ సమర్థవంతమైన నేతృత్వంలో మిగిలిన 7000 మందీ ఓటమిని విజయంగా మార్చారు. నిదానంగా, జాగ్రత్తగా షేన్-సిలో తమ స్థావరాన్ని సుస్థిర పరుచుకుంటూ బలమైన క్యాడర్ని నిర్మించుకుని, తమ ఉద్యమాన్ని పునర్నిర్మించారు. అజేయులైన వీరు 14 ఏళ్ల తరువాత అసాధ్యం అనుకున్న దాన్ని సుసాధ్యం చేసి చూపించారు. 1949 అక్టోబర్ 1న మావో అప్పటి చైనా రాజధాని పెకింగ్ (నేటి బీజింగ్)లో తమ కమ్యూనిస్టు విప్లవ విజయాన్ని, 'పీపుల్స్ చైనా' ఏర్పాటును ప్రకటించారు.

ఆ ప్రకటన వెలువడి ఈ అక్టోబర్ 1కి 75 సంవత్సరాలవుతోంది.

----------------

చైనాలో శతాబ్దాల దోపిడీ, పీడనలకు చరమగీతం పాడేందుకు సాగిన ప్రజా విప్లవ పోరాటంలో కమ్యూనిస్టుల వ్యూహాత్మక వెనకడుగే "లాంగ్ మార్చ్".

1911లో సన్-యెట్ సెన్ నేతృత్వంలోని కొమింటాంగ్ పార్టీ ద్వారా చైనాలో రిపబ్లిక్ ప్రభుత్వ స్థాపన జరిగింది. కానీ సన్-యెట్ సెన్ అనుయాయులు జనరల్ యువాన్-షి-కాయ్ కోసం రిపబ్లిక్‌ను త్యాగం చేయవలసి వచ్చింది. రిపబ్లిక్‌కు అధ్యక్షునిగా ఉన్న జనరల్ యువాన్-షి-కాయ్ త్వరలోనే సర్వాధికారాలు తనవద్ద పెట్టుకుని నియంతగా మారాడు. 1916లో అతని మరణం తరువాత తిరిగి దేశంలో రాజకీయ అనిశ్చిత ఏర్పడింది. ప్రాంతీయ యుద్ధ ప్రభువులు (వార్ లార్డ్స్) అధికారం కోసం పోట్లాడుకోసాగారు.

ఈలోగా సన్-యెట్ సెన్ దక్షిణ చైనాలో తిరిగి రిపబ్లిక్కును స్థాపించి స్థిరమైన ప్రభుత్వానికి ప్రయత్నాలు ప్రారంభించాడు. కానీ 1922లో యుద్ధ ప్రభువులు అతడిని షాంఘై నుంచి బహిష్కరించారు. అప్పుడు డాక్టర్ సన్-యెట్ సెన్ శైశవదశలో ఉన్న చైనా కమ్యూనిస్టు పార్టీతో చేతులు కలిపాడు. చైనా కమ్యూనిస్టు పార్టీ అంతకు సంవత్సరం క్రితమే షాంఘైలో స్థాపించబడింది. సన్-యెట్ సెన్‌కు చెందిన కొమింటాంగ్ పార్టీ (దీనినే నేషనలిస్ట్ పార్టీ అని కూడా అంటారు) కాంటన్ నగరానికి తిరిగి వచ్చి సైన్యాన్ని సమకూర్చుకోవడం మొదలు పెట్టింది. 1925లో డాక్టర్ సన్-యెట్ సెన్ మరణం తరువాత కొమింటాంగ్ కి చియాంగ్-కై-షెక్ నాయకుడయ్యాడు. ఇతను పచ్చి కమ్యూనిస్టు వ్యతిరేకి. విప్లవ ప్రతీఘాతకుడు.

1927లో చియాంగ్-కై షెక్ కమ్యూనిస్టులపై దాడికి దిగి, పట్టణ ప్రాంతాల్లో ఉన్న కమ్యూనిస్టులను ఊచకోత కోశాడు. చియాంగ్-కై షెక్ సైన్యాలనుండి తప్పించుకున్న కొంతమంది కమ్యూనిస్టులు సుదూర

గ్రామీణ ప్రాంతాల్లో తలదాచుకున్నారు. 1928లో చియాంగ్–కై షెక్ ప్రాంతీయ యుద్ధ ప్రభువులపై (వార్ లార్డ్స్‌పై) దండయాత్ర చేసి, చైనాలోని చాల భాగాన్ని ఆక్రమించి నాన్కింగ్ నగరంలో జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాడు.

మావో జెడాంగ్ కొంతమంది సహచరులతో తప్పించుకుని కియాంగ్సి, హ్యూనాన్ మధ్యగల పర్వతప్రాంత సరిహద్దు గ్రామాల్లో తిరిగి విప్లవోద్యమ నిర్మాణం మొదలు పెట్టాడు. భూస్వామ్య దోపిడీ, దారిద్ర్యం, కరువు, వరదలు, యుద్ధాలతో పాటు అంటు వ్యాధులతో అతలాకుతలమైన రైతులు మార్పుకోసం పరితపిస్తూ ఉన్నారు. దానికి తోడు 1916–27 మధ్య జరిగిన యుద్ధప్రభువుల యుద్ధాలు, భూస్వాములు రైతులను బానిసలను చేసుకోవటం పరిస్థితిని మరింత దిగజార్చాయి. యుద్ధ ప్రభువులు రైతులపై విపరీతమైన పన్నుభారం వేయటంతోపాటు పది, పన్నెండేళ్ల పన్నుని ముందుగానే వసూలు చేసేవారు. ఈ పన్ను వారి సైనికశక్తిని పెంచుకోవడానికి ఉపయోగించేవారు. వారి సైనికులు పొలాలపై దాడిచేసి ఉన్నదంతా ఊడ్చుకు పోయేవారు. యుద్ధ ప్రభువులు నగరాల్లో స్థిర నివాసం ఏర్పరుచుకుని తమ మధ్యవర్తులను పన్ను వసూలుకు ఉంచేవారు. వీళ్ళు చాలాభాగం తాముంచుకుని కొద్దిభాగం ప్రభువులకిచ్చేవారు. భూస్వామ్య దోపిడీపై చైనా రైతాంగం ఆగ్రహంతో ఊగిపోతోంది.

వారి వెతలకు, అప్పటికే అక్కడ వేళ్ళూనుకున్న అమెరికా ఇతర పశ్చిమదేశ సామ్రాజ్యవాదుల దోపిడీ తోడైంది. ఇలాంటి విపత్కర, విపరీత పరిస్థితుల్లో మావో విప్లవ నిర్మాణం మొదలు పెట్టాడు. "రైతులారా లేవండి, మిమ్ములను అణిచివేస్తున్న వాళ్ళ పీచమణచండి" అన్న మావో పిలుపు రైతులను నమరోత్సాహ పరిచింది. లోలోపలే కుతకుతలాడుతున్న వారికోపం బద్దలైంది. రైతులు యుద్ధప్రభువులకి, ప్రాంతీయ అధికారులకి వ్యతిరేకంగా ఉద్యమించడం మొదలైంది. రైతుల్లోగల ఈ ప్రాథమిక ఉద్వేగాలు తగ్గిన తరువాత కమ్యూనిస్టులు గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి, భూములు పంచడం, పార్టీ ప్రాంతీయ ప్రతినిధులను నియమించడం మొదలు పెట్టారు.

కమ్యూనిస్టు ఎర్ర సైన్యం (రెడ్ ఆర్మీ) రైతు ఉద్యమంలో అంతర్భాగమయింది. ఈ ఎర్ర సైన్యాన్ని 1927లో ఘూటే ప్రారంభించాడు. ఘూటే...చియాంగ్–కై షెక్ ప్రభుత్వానికి

**❝ శత్రువు ముందుకు వస్తే వెనకడుగు వేయటం, శత్రువు ఆగినప్పుడు కల్లోల పర్చడం, శత్రువు వెనక్కి తగ్గినప్పుడు దాడి చేయటం... ఇదీ గెరిల్లా యుద్ధతంత్రం. దీన్ననుసరించి విప్లవ గెరిల్లా దళాలు శత్రుసైన్యాలను చీకాకుపరిచి, తుదకు విజయం సాధిస్తాయి. ఈ రెండు యుద్ధాల్లో గెరిల్లా విజయం వారి మనోబలాన్ని పెంచింది. ఇది గమనించిన ఇతర రైతులు కూడా గెరిల్లా దళాలతో చేరారు. 1933 నాటికి ఎర్రసైన్యం 30,000 మందికి పెరిగింది. ❞**

వ్యతిరేకంగా జరిగిన తిరుగుబాటుకి నాయకత్వం వహించిన సైనిక జనరల్. తరువాత ఆయన మావోతో చేరిపోయాడు. 1929 నాటికి ఘూటే 10,000 మందితో కూడిన గెరిల్లా సైన్యాన్ని తయారు చేశాడు. "ఈ గెరిల్లా సైన్యం, దేశంలోని వివిధ వర్గాలనుండి వచ్చినవారు. వాళ్ళ దగ్గరున్నవి ఈటెలు, బరిసెలు ఇతర బండబారిన ఆయుధాలు మాత్రమే. వీరు ఈ ఆయుధలోపాన్ని తమ స్ఫూర్తి, పట్టుదలతో అధిగమించారు" అని పేర్కొంటూ మావో వాళ్లను ప్రశంశించాడు.

ఎర్ర సైన్యానికి 1930లో మొదటి పరీక్ష ఎదురైంది. కమ్యూనిస్టుల నాయకత్వంలో హ్యూనాన్ లోని రైతులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారని తెలిసిన చియాంగ్–కై షెక్ వారిని అణచివేయడానికి లక్షమంది సైన్యాన్ని ఆధునిక ఆయుధాలతో పంపించాడు. కానీ చియాంగ్–కై షెక్ నేషనలిస్టు సైన్యం తామెదురుచూడని ఓటమిని చవిచూసింది. కమ్యూనిస్టుల వినాశనాన్ని కోరుకున్న చియాంగ్–కై షెక్ 1931లో ఒకసారి, 1933లో మరోసారి తన సైన్యాన్ని పంపాడు. ఈ రెండుసార్లు కూడా అతని సైన్యం అవమానకర ఓటమిని ఎదుర్కొంది. శత్రువు ముందుకు వస్తే వెనకడుగు వేయటం, శత్రువు ఆగినప్పుడు కల్లోల పర్చడం, శత్రువు వెనక్కి తగ్గినప్పుడు దాడిచేయటం... ఇదీ గెరిల్లా యుద్ధతంత్రం. దీన్ననుసరించి విప్లవ గెరిల్లా దళాలు శత్రుసైన్యాలను చీకాకుపరిచి, తుదకు విజయం సాధిస్తాయి. ఈ రెండు యుద్ధాల్లో గెరిల్లా విజయం వారి మనోబలాన్ని పెంచింది. ఇది గమనించిన ఇతర రైతులు కూడా గెరిల్లా దళాలతో చేరారు. 1933 నాటికి ఎర్రసైన్యం 30,000 మందికి పెరిగింది. అదే సంవత్సరం పర్వతప్రాంతమైన జు–కిన్ లో తాత్కాలిక ప్రజా ప్రభుత్వం ఏర్పడినట్లు మావో ప్రకటించాడు.

దీంతో కోపోద్రిక్తుడైన చియాంగ్ 1933 అక్టోబర్‌లో ఏడులక్షల సైన్యాన్ని కమ్యూనిస్టుల పైకి పంపాడు. మొత్తం దక్షిణ ప్రాంతాన్ని స్వాధీన పర్చుకోవడం అతని లక్ష్యం. ఒక పద్ధతి ప్రకారం కమ్యూనిస్టు ప్రాంతాలను చుట్టుముట్టి, కమ్యూనిస్టులకి బయటినుండి ఏదీ అందకుండా అన్నివైపులా నుండి దిగ్బంధనం చేసి మట్టుబెట్టాలన్నది వీరి వ్యూహం. చియాంగ్–కై షెక్ దిగ్బంధంలో నెలలు గడిచిపోయాయి. మావో అతని సహచరులు, ఆహారం, మందులు, ఆయుధాలు ఇంకా ఇతర అవసరమైన సామగ్రి లభించక తల్లడిల్లారు. ఆ సంవత్సరాంతానికి తమ పరిస్థితి చాలా నిరాశాజనకంగా ఉందన్న విషయం వారికి అర్థమయింది. కానీ లొంగిపోయే ప్రసక్తే లేదు. ధైర్యంచేసి నేషనలిస్టు సైన్యాల దిగ్బంధనాన్ని ఛేదించి వాయవ్యంలో ఉన్న షేన్–సి ప్రాంతానికి ప్రయాణమవడానికి నిర్ణయించుకున్నారు. అదీ... అప్పుడు మొదలయింది వారి –లాంగ్ మార్చ్– సుదీర్ఘ జైత్రయాత్ర.

---

కమ్యూనిస్టులు చిన్న చిన్న దళాలుగా ఏర్పడి నేషనలిస్టు సైన్యాల కన్నుగప్పి వారి దిగ్బంధనాన్ని ఛేదించుకుని పడమరకు సాగారు. దుర్గమమైన ప్రాంతం, తమను తరుముకు వస్తున్న నేషనలిస్టు సైన్యాలతో కొన్నిసార్లు పోరాడుతూ, మరి కొన్నిసార్లు తప్పించుకుంటూ హ్యూనాన్, క్వాన్గ్–సి, సరిహద్దులకు చేయుకున్నారు. ఈ ప్రయాణంలో వారు నేషనలిస్టు సైన్యాలతో పోరాటంలో బాగా నష్టపోయారు. వాళ్ళు క్వేయి–చౌ ప్రాంతానికి చేరేసరికి 33 శాతం సహచరులను కోల్పోయారు. అక్కడ వీళ్ళు తమకు అవసరంలేని బరువుని వదిలించుకుని తిరిగి మరోసారి తరుముకు వస్తున్న సైన్యాలను దారి మళ్లిస్తూ ముందుకి సాగారు. చిన్న చిన్నదళాలు సైన్యాన్ని దారి మళ్లిస్తుంటే ముఖ్యమైన దళం ముందుకు సాగింది.

**❝ విషయం తెలుసుకున్న చియాంగ్-కై షెక్ కమూనిస్టులు యాంగ్సే నదిని దాటకుండా వేలాది సైనికుల్ని నియమించాడు. వారు వంతెనలు నాశనం చేసి, పడవల ద్వారా దాటకుండా చిన్నచిన్న పడవలను అక్కడినుండి తీసివేయించారు. రోడ్లన్నిటినీ బ్లాక్ చేశారు. దాంతో విప్లవ సైన్యం అక్కడ నేషనలిస్టు సైన్యాలను తప్పించుకుంటూ, అవసరమైనప్పుడు ఎదురుదాడి చేస్తూ సుమారు 4 నెలలు గడిపి దక్షిణాన ఉన్న యునాన్ అడవుల్లోకి వెళ్లి అటునుండి చౌ-పింగ్ కోట వద్ద యాంగ్సే నదిని దాటింది.❞**

విషయం తెలుసుకున్న చియాంగ్, కమూనిస్టులు యాంగ్సే నదిని దాటకుండా వేలాది సైనికుల్ని నియమించాడు. వారు వంతెనలు నాశనం చేసి, పడవల ద్వారా దాటకుండా చిన్న చిన్న పడవలను అక్కడినుండి తీసివేయించారు. కమ్యూనిస్టులు వచ్చే రోడ్లనన్నిటినీ బ్లాక్ చేసి అడ్డంకులు సృష్టించారు. దాంతో విప్లవ సైన్యం అక్కడ నేషనలిస్టు సైన్యాలను తప్పించుకుంటూ, అవసరమైనప్పుడు ఎదురుదాడి చేస్తూ సుమారు నాలుగు నెలల పాటు గడిపి దక్షిణాన ఉన్న యునాన్ అడవుల్లోకి వెళ్లి అటునుండి చౌ-పింగ్ కోట వద్ద యాంగ్సే నదిని దాటింది. అక్కడ నది వెడల్పు తక్కువగా ఉండడంతో పాటు లోతు కూడా ఎక్కువ లేదు అందువల్ల రెడ్ ఆర్మీ నదిని దాటటం అంత కష్టం కాలేదు.

ముందుకి సాగుతున్న కమ్యూనిస్టు సేన తిరిగి టూటూ నదిపై ఉన్న వంతెన వద్ద అతి పెద్ద సవాలును ఎదుర్కోవలసి వచ్చింది. అక్కడ నది లోతయిన లోయగుండా ఉధృతంగా ప్రవహిస్తుంది. ఆ లోయను కలుపుతూ ఒక గొలుసుల వంతెన ఉంది. రెండు వైపులా దృఢంగా గొలుసులతో బిగించబడి మధ్యలో నడవడానికి వీలుగా చెక్క పలకలు పరిచిన వంతెన అది. నేషనలిస్టు సైనికులు వంతెన మధ్యలోని చెక్క పలకలు తొలగించారు.. ఆ పరిస్థితుల్లో 22 మంది కమ్యూనిస్టు యోధులు ధైర్యం చేసి, మిగతా వాళ్ళు తమను రిఫైళ్ళతో కవర్ చేస్తుంటే ఒకరి చేయి ఒకరు పట్టుకుని గొలుసులు ద్వారా వేళ్ళాడుతూ వంతెనదాటి ఆవలి ఒడ్డుకు వెళ్లారు. తమవద్ద ఉన్న బాంబులతో నేషనలిస్టు సైనికులను పారద్రోలారు. వెంటనే వారు తిరిగి పలకలు పరవడంతో మిగిలినవారు నదిని దాటారు. ఈ మొత్తం ప్రక్రియలో అనేకమంది కమ్యూనిస్టు యోధులు శత్రువుల తుపాకీ గుళ్లకు బలై నదిలోకి జారిపోయారు.

నదిని దాటిన విప్లవ సైన్యం మౌకాంగ్ ప్రాంతంలో కొంతకాలం ఆగి తిరిగి మరింత కఠోరమైన సవాళ్ళను ఎదుర్కుంటూ ముందుకి సాగింది. ఈసారి వారి ప్రయాణం మంచు పర్వతాలగుండా సాగింది. ఆ ప్రయాణంలో వారు మంచు తుపాన్లను, రక్తం గడ్డకట్టించే చలిని ఎదుర్కోవలసి వచ్చింది. మరింత కొంత ముందుకు వెళితే చిత్తడితో నిండిన గడ్డి మైదనాలు దాటువలసి వచ్చింది. పదిరోజుల ఈ ప్రయాణంలో వారికి సరైన భోజనం లేదు, ఎక్కడా తలదాచుకోవడానికి స్థలం లేదు. పైగా అనారోగ్యం, బలహీనత వారిని చుట్టూ ముట్టాయి. మరో ఆరు వారాల తరువాత వాళ్ళు పశ్చిమాన ఉన్న షెన్-సి ప్రాంత యేనాన్ చేరుకున్నారు.

---

కమ్యూనిస్టులు యేనాన్ చేరుకునేసరికి మొదట్లో బయలుదేరిన లక్ష మందిలో 7,000 మంది మాత్రం మిగిలారు. వీరితోపాటు మార్గమధ్యంలో తమతో చేర్చుకున్న మరో 15,000 మంది ఉన్నారు. ఆ మరు సంవత్సరం చైనాలోని ఇతర ప్రాంతాల్లో ఏర్పడ్డ రెండు కమ్యూనిస్టు దళాలు కూడా చియాంగ్-కై షెక్ నుండి తప్పించుకుని వీళ్ళతో కలిసింది. ఈ సుదీర్ఘ ప్రయాణం చైనాలో కమ్యూనిస్టు ప్రభత్వం ప్రజా చైనా ఏర్పాటుకి పునాది అయింది. అంతేకాక ప్రయాణంలో బ్రతికిన వీరికి, ఆకలి దప్పులు, రోగాలు, బాధ, అత్యంత వేడిమి, విపరీతమైన చలిని భరించగలిగే శక్తినిచ్చి ఈ 7.000 మందిని రాటుదేల్చి అజేయులను చేసింది.

వాళ్ళు ఒక సమర్ధవంతమైన, కఠోరదీక్ష కలిగిన అనుభవంతో కూడిన నాయకుల య్యారు. వారి ఈ ప్రయాణంలో గ్రామీణ ప్రాంత రైతులు ఇతర ప్రజలతో మంచి సంబంధాలు ఏర్పరుచుకున్నారు. వారి బాధలకు సానుభూతి చూపించి, మంచిరోజులు వస్తాయన్న భరోసా కలిగించారు. తరువాతి రోజుల్లో వారు చూపించిన ఈ సానుభూతే వారికి లాభదాయకమైంది. ఈ జైత్రయాత్ర ద్వారా మావో ఒక తిరుగులేని నాయకుడుగా ఎదిగాడు.

ఈలోగా చైనా అనివార్య పరిస్థితుల్లో జపానుతో యుద్దానికి దిగాల్సి వచ్చింది. 1931లో చైనా పారిశ్రామిక ప్రాంతమైన మంచూరియాను జపాను ఆక్రమించడంతో చైనా, జపానుల మధ్య ఘర్షణ మొదల యింది. మంచూరియాను ఆక్రమించిన జపాను అక్కడ ఒక తోలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. జపాన్‌ను ఎదుర్కోవ డానికి చియాంగ్- కై షెక్ ఏ మాత్రం ఆసక్తి చూపలేదు.. కానీ, కమ్యూనిస్టులు మాత్రం వెంటనే జపానుపై యుద్ధం ప్రకటించారు. 1933లో జపాను చైనాలోని మరో రాష్ట్రాన్ని ఆక్రమించి, ఉత్తర చైనాలోని మంగోలియాలోకి చొచ్చుకు పోయింది. జపాను చేసిన ఈ అక్రమణతో చైనీయుల్లో జాతీయవాద భావన మేల్కొంది. దాంతో చైనాలోని చాలా ప్రాంతాల్లో చియాంగ్-కై షెక్ అనుసరిస్తున్న నిరాసక్త ధోరణిని ప్రజలు అసహ్యించుకున్నారు. జపాను ముసుముందుకు తోసుకువస్తున్నా కూడా చియాంగ్ 'బందిపోటు దొంగల అంతం' పేరిట కమ్యూనిస్టుల వెంటపడ్డంతో చాలామంది అతని అనుయాయులు అతణ్ని విడిచిపోయారు. 1938 డిసెంబర్‌లో షేన్-సి రాష్ట్రంలోని కమ్యూనిస్టుల అంతంకోసం చియాంగ్ ప్రచారం చేస్తుండడంతో ఆ ప్రాంతపు యుద్ధప్రభువు అతణ్ని బందీచేసి, జపానుకి వ్యతిరేకంగా పోరాడుతున్న కమ్యూనిస్టులతో చేయి కలపమని ఒత్తిడి తెచ్చాడు. దాంతో అయిష్టంగానైనా చియాంగ్-కై షెక్ జపానుతో యుద్ధానికి అంగీకరించాడు.

చియాంగ్, కమ్యూనిస్టులతోపాటు జాతీయ భావాలు ఉప్పొంగుతున్న చైనీయులు ఒక్కటైతే చైనాను ఆక్రమించడం అసంభవం అనుకున్న జపాను 1937 జులై 7న పెకింగ్ దగ్గరలోని మార్కోపోలో వంతెనవద్ద యుద్దానికి దిగింది. అప్పటికే చియాంగ్ సైన్యం కమ్యూనిస్టులను వెంబడించి, వెంబడించి విసిగిపోయి ఉంది. యుద్ధం అంటే వారిలో నిరాసక్తత కలిగింది. దాంతో పాటు వీరివద్ద ఉన్న అయిదాలు జపానువద్ద ఉన్న అత్యాధునిక ఆయుధాల ముందు తీసికట్టు. 1937

డిసెంబర్‌లో నాన్-కింగ్ జపాను వశమైంది. చియాంగ్ మొదట తన ప్రభుత్వాన్ని హాంకౌ కి ఆ తరువాత చుంగ్-కింగ్ కి మార్చాడు. అక్టోబర్ 1938 నాటకి జపాను చైనాలోని మూడింట రెండువంతుల భూ భాగాన్ని ఆక్రమించుకుంటుంది. అన్ని ప్రధాన పరిశ్రమలు, ఓడరేవులు జపాను సైన్యం ఆధీనంలోకి తెచ్చుకుని చియాంగ్ ని లొంగిపొమ్మని హెచ్చరించింది. చియాంగ్ అందుకు నిరాకరించాడు. జపాను ఎదో ఒక రోజు అమెరికాను రెచ్చ గొడుతుందని, అల జరిగితే అమెరికా తనకు రక్షణగా ఉంటుందనేది ఆయన ఆలోచన.

ఇంతలో ఉత్తర చైనాలో కమ్యూనిస్టులు గెరిల్లా యుద్ధాన్ని మొదలు పెట్టారు. వారు రెండు విధాల తమ కార్యక్రమాన్ని సాగించారు. మొదటిది జపానుని నిలువరించడం, రెండవది, భూ సంస్కరణలు. దీంతో చైనా రైతులకు కమ్యూనిస్టులపై భరోసా ఏర్పడింది. గ్రామాల్లో ప్రజలు వీరికి సహకరించసాగారు. గ్రామం తరువాత గ్రామంగా కమ్యూనిస్టులు ముందుకు సాగారు. రైతు, రైతుకూలి, ఎర్ర సైనికుడితో కూడిన సంఘాలుగా ఏర్పడి, పొలాలు దున్నడం సాగించడంతో ధాన్యం ఉత్పత్తి పెరిగి గ్రామీణ ప్రజలు ఆకలి బాధనుండి బయట పడ్డారు. రోజు రోజుకి కమ్యూనిస్టులను ఆదరించి, వారికి కావలసిన సహాయం అందిచడానికి రైతులు ముందుకు వచ్చారు.

1941 డిసెంబర్ 7న జపాన్ అమెరికాలోని పెరల్ హార్బర్‌లోని అమెరికన్ యుద్ధ నౌకపై దాడిచేసింది. 1939లో రెండవ ప్రపంచయుద్ధం మొదలైనా అమెరికా ఇంకా యుద్ధంలోకి దిగలేదు. కానీ పెరల్ హార్బర్‌లో జపాను దాడి జరిగిన రెండవ రోజునే అమెరికా ఫాసిస్ట్ శక్తులపై యుద్ధంప్రకటించింది. ఫాసిస్టు యాక్సిల్‌లో భాగంగా ఉన్న జపానుపై యుద్ధా నికిదిగి, నేషనలిస్టు (చియాంగ్) సైన్యానికి సహాయం చేయడానికి ముందుకొచ్చింది. జపానుపై దాడికి కావలిసిన యుద్ధ విమానా లు, ఆయుధాలు ఇతర యుద్ధ సామాగ్రిని చాయాంగ్ సైన్యానికి అందజేస్తుంది. దాంతో పాటు తమ జనరల్ ఒకరిని చియాంగ్ సైన్యానికి అధిపతిగా నియమించింది. అమెరికా సహాయం తరువాత కూడా చియాంగ్, జపానుపై తీవ్రమైన దాడి చేయడానికి ఆసక్తి చూపలేదు. అమెరికన్ జనరల్ మాట వినడానికి చియాంగ్ నిరాకరించాడు.

-------------

**"మొదటి రెండు సంవత్సరాలు యుద్ధం మంచూరియా వద్ద కేంద్రీకృతమైంది. చియాంగ్ సైన్యాలకు ప్రారంభంలో విజ యాలు లభించాయి. అమెరికా పూర్తిగా చియాంగ్ తర పున పనిచేసింది. అయినా చియాంగ్- కై షెక్ సైన్యానికి ఓటమి తప్పలేదు. 1948 చివరకి పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (రెడ్ ఆర్మీ) జనరల్ లిన్-పియావో నాయకత్వంలో మంచూరియాను స్వాధీనం చేసుకుంది. ఉప్పొంగుతున్న ఉత్సాహంతో రెడ్ ఆర్మీ విజయం తరువాత విజయం సాధిస్తూ దక్షిణానికి సాగింది."**



**1949 అక్టోబర్ 1న పెకింగ్ (నేటి బీజింగ్)లోని ఫర్‌బిడెన్ సిటీ రాజప్రాసాదం నుండి మాట్లాడుతూ "చైనా ప్రజా రిపబ్లిక్" ఏర్పాటును ప్రకటిస్తున్న మావో జెడాంగ్**

1945లో రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత మళ్ళీ చియాంగ్, కమ్యూని స్టుల మధ్య జపాను ఆక్రమిత ప్రాంతాలపై ఘర్షణ మొదలయింది. ఇరు పక్షాలుకూడా ఆ ప్రాంతాలను ఆక్రమించుకో డానికి ప్రయత్నించాయి. మధ్యవర్తిత్వం పేరుతో అమెరికా జోక్యం చేసుకోడానికి ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. దాంతో 1946లో చైనాలో అంతర్యుద్ధం మొదలైంది. చియాంగ్ సైన్యం, ఎర్ర సైన్యం (రెడ్ ఆర్మీ) కంటే నాలుగింతలు ఎక్కువ ఉంది. అంతే కాకుండా చియాంగ్ వద్ద అమెరికా అందించిన అత్యంతాధునిక ఆయుధాలు, యుద్ధ విమానాలు ఉన్నాయి.

మొదటి రెండు సంవత్సరాలు యుద్ధం మంచూరియా వద్ద కేంద్రీకృతమైంది. చియాంగ్ సైన్యాలకు ప్రారంభంలో విజయాలు లభించాయి. అమెరికా పూర్తిగా చియాంగ్ తరపున పనిచేసింది. అయినా చియాంగ్- కై షెక్ సైన్యానికి ఓటమి తప్పలేదు. 1948 చివరకి పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (రెడ్ ఆర్మీ) జనరల్ లిన్-పియావో నాయకత్వంలో మంచూ రియాను స్వాధీనం చేసుకుంది. ఉప్పొంగుతున్న ఉత్సాహంతో రెడ్ ఆర్మీ విజయం తరువాత విజయం సాధిస్తూ దక్షిణానికి సాగింది. చియాంగ్ కి ఓటమితో పాటు అతని ఆర్థిక స్థితి పూర్తిగా దిగజారింది. దాంతో చియాంగ్ ప్రజలపై దమనకాండకి దిగడంతో అతణ్ణి సమర్థించే వాళ్ళు కూడా పెద్ద సంఖ్యలో కమ్యూనిస్టుల్లో కలవసాగారు. ఉత్సాహంతో, నిబద్ధతతో ముందుకి సాగుతున్న (కమ్యూనిస్టు) రెడ్ ఆర్మీ యుద్ధంతో తల్లడిల్లుతున్న ప్రజానీకానికి ఊరట కలిగించసాగింది. రోజు రోజుకీ రెడ్ ఆర్మీ సంఖ్య పెరిగిపోయింది. చరిత్రలో లిఖించదగిన, నిర్ణయాత్మకమైన యుద్ధం, 1948 నవంబర్‌లో హ్వాయి-హాయ్ ప్రాంతంలో జరిగింది. ఇది మధ్య చైనాలో అతి ముఖ్యమైన రైల్వే జంక్షన్. సుమారు 65 రోజులపాటు 50,000 మంది రెడ్ ఆర్మీ సైనికులు ఈ యుద్ధంలో పాలుపంచుకున్నారు. చివరికి ఆ ప్రాంతం రెడ్ ఆర్మీ వశమైంది. నేషనలిస్టు సైన్యాలు పెద్దఎత్తున నాశనమయ్యాయి. చియాంగ్ అతి కొద్దిమందితో ఫార్మోజా పారిపోయి అక్కడ ప్రవాస ప్రభుత్వం

**" 1934లో ప్రారంభమైన వారి ఈ జైత్రయాత్ర ప్రజా చైనా ఏర్పడిందన్న ప్రకటనతో ఆగిపోలేదు. అదింకా ఈనాటి వరకూ అప్రతిహతంగా సాగిపోతూనే ఉంది. భారతదేశానికి స్వతంత్ర్యం వచ్చిన రెండేళ్లకు ప్రజా చైనా స్థాపన జరిగింది. అప్పటికి అది వ్యవసాయిక దేశం. ప్రపంచంలోనే అతి పెద్ద జనాభా గల దేశం. అలాంటి దేశం ఈనాడు ప్రగతి సాధించని క్షేత్రం లేదు. వ్యవసాయికం, పారిశ్రామిక రంగం, రవాణా, శాస్త్రసాంకేతిక రంగాలతో పాటు అంతరిక్ష క్షేత్రం లోనూ అద్వితీయ ప్రగతిసాధించింది. "**



యవ్వనంలో మావో జెడాంగ్

ఏర్పాటు చేస్తాడు.

దాంతో 1949 అక్టోబర్ 1న మావో–సే–టుంగ్ పెకింగ్‌లో 'పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా' ఏర్పడినట్లు ప్రకటించాడు.

--------------

1934లో ప్రారంభమైన వారి ఈ జైత్రయాత్ర ప్రజా చైనా ఏర్పడిందన్న ప్రకటనతో ఆగిపోలేదు. అదింకా ఈనాటి వరకూ అప్రతిహతంగా సాగిపోతూనే ఉంది. భారతదేశానికి స్వతంత్ర్యం వొచ్చిన రెండేళ్లకు ప్రజా చైనా స్థాపన జరిగింది. అప్పటికి అది వ్యవసాయిక దేశం. ప్రపంచంలోనే అతి పెద్ద జనాభా గల దేశం. అలాంటి దేశం ఈనాడు ప్రగతి సాధించని క్షేత్రం లేదు. వ్యవసాయికం, పారిశ్రామిక రంగం, రవాణా, శాస్త్రసాంకేతిక రంగాలతో పాటు అంతరిక్ష క్షేత్రం లోనూ అద్వితీయ ప్రగతిసాధించింది. ఇంకా సాధిస్తూనే ఉంది. ముఖ్యంగా ఎలెక్ట్రానిక్ రంగం. ఈ నాడు చైనా మొబైల్ ఫోన్‌లు వాడని దేశం లేదంటే అతిశయోక్తి కాదు. ఇది అది అని కాదు అన్ని రంగాల్లోనూ అది ముందుండి అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన అమెరికాకే పోటీగా నిలుస్తోంది. చైనాలోని ప్రతి రెండో ఇంట్లో ఒక లఘు పరిశ్రమ ఉన్నట్లు నేను ఒక వ్యాసంలో చదివాను.

ప్రజాచైనా చరిత్రలో తియాన్మెన్ స్క్వేర్ లాంటి సంఘటనలు జరిగినా అది వాటిని తట్టుకుని ముందుకు సాగింది. 1978లో అది సంస్కరణలు ఆమోదించిన తరువాత చైనా తమ దేశంలోని కొన్ని ప్రాంతాలను విదేశీ పెట్టుబడులకూ, సాంకేతిక పరిజ్ఞానానికీ తెరిచింది. అయితే అది ప్రభుత్వ షరతులతో మాత్రమే. ప్రభుత్వ విధానాలను ఆమోదించినప్పుడు మాత్రమే విదేశీ పెట్టుబడులకు చైనాలోకి ప్రవేశం ఉంటుంది. ఇక్కడ భారతదేశంలో లాగా కార్పొరేట్లకు విపరీత లాభాలు ఇవ్వటానికి మాత్రం కాదు.

చైనా ఇంతటి అభివృద్ధి సాధించడం ఎలా సాధ్యమైంది.

కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వ సంకల్పం, ఆ సంకల్పానికున్న నిబద్ధతవల్ల చైనా ఈ ప్రగతిని సాధించింది. ఈనాడు భారతదేశం, అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో 5వ ఆర్థిక వ్యవస్థగా ఎదిగినట్లు భారత్ ప్రభుత్వం చెప్పుకుంటోంది. అయినా దేశంలోని 80 కోట్ల మందికి ఉచిత రేషన్ పంచుతున్నామని కూడా అదే ప్రభుత్వం చెబుతుంది. అదీ 5 కిలోలు మాత్రమే. ఇక నిరుద్యోగం గత 45 ఏళ్లలో ఎన్నడూ లేనంత స్థాయిలో ఉందని ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయి. కారణం ప్రస్తుత ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేయటమే. ఒక చిన్న ఉదాహరణ చుద్దాం. ఈ మధ్య ప్రభుత్వం కార్పొరేట్లకు లాభం చేకూర్చిదానికి మొబైల్ ఛార్జీలను పెంచి సాధారణ ప్రజానీకం నడ్డి విరిచింది. ఈ పెంపు అంతకుముందు చెల్లిస్తున్న దానికంటే ప్రతి నెల 29/– రూ పెరిగింది. ఒక లెక్క ప్రకారం జియో కి 43 కోట్ల వాడకందారులున్నారు. వీరందరూ నెలకి 29/– రూ అదనంగా చెల్లించాలి. ఈ 43 కోట్లమంది నెలకి 29/–చొప్పున నెలకి 1256/– కోట్లు, సంవత్సరానికి 15072/– కోట్లు అంతకు ముందు చెల్లిస్తున్నదానికంటే అదనంగా చెల్లిస్తున్నారు. సోషలిస్టు చైనా ప్రజాక్షేమం కోసం పనిచేస్తే మన ప్రభుత్వం కార్పొరేట్ల కోసం పనిచేస్తుంది. ఇదీ చైనాకి మనకి ఉన్న తేడా.

చైనా అభివృద్ధిలో అనేక అడ్డంకులు, సవాళ్లు ఎదురవుతున్నా అది వాటిని అదిగమిస్తూ ముందుకు సాగుతోంది, ఇక ముందు కూడా అదే విధంగా పురోగమించ గలమనే విశ్వాసంతో ప్రభుత్వం, ప్రజలు పనిచేస్తున్నారు. 2025 నాటికి చైనా దేశంలో దారిద్ర్యాన్ని పూర్తిగా నిర్మూలించి ఒక మాదిరి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలని నిర్దేశించుకుంది. ఆ లక్ష్యాన్ని రెండేళ్ల ముందుగానే సాధించింది. ఇక ఇప్పుడు 2049 నాటికి అంటే చైనా విముక్తి చెంది 100 వచ్చే సరికి దేశం అభివృద్ధి చెందిన ఆధునిక సోషలిస్టు దేశంగా ఎదగాలని అక్కడి కమ్యూనిస్టు పార్టీ, ప్రభుత్వం నిర్దేశించు కున్నాయి. ఆ లక్ష్య సాధనలో భాగంగా 2035 నాటికే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని నిర్ణయించుకున్నాయి. ఆ లక్ష్యాల దిశగా చైనా ముందుకు సాగుతోంది.

❊

నివాళి

# అసామాన్యుడు ఎజి నూరాని

తీస్తా సెతల్వాడ్



రచయిత ప్రముఖ సామాజిక కార్యకర్త

ఎల్లప్పుడూ ధిక్కార స్వభావిలా కనిపించే అబ్దుల్ గఫూర్ నూరాని 94 సంవత్సరాల వయసు పూర్తి కావటానికి 18 రోజులు ముందుగా, గత ఆగస్టు 29వ తేదీన మరణించారు. "హృదయం విచారకరంగా ఉన్నప్పటికీ లౌకికశక్తులు పున:సమీకరణ అవుతాయన్న ఆశాభావంతో ఉన్నాను" అని 10 సంవత్సరాల మూడు నెలల క్రితం అంటే 2014, జూన్ 1వ తేదీన ఆయన రాశారు.

"బాబ్రి మసీదు విధ్వంసం జాతికే అవమానం" గ్రంథం మూడవ భాగానికి ఆయన రాసిన పరిచయంలోని చివరి వాక్యం ఇది. తులికా వారు ప్రచురించిన "బాబ్రి మసీదు 1528–2004, ఎ క్వశ్చన్ ఆఫ్ నేషనల్ హానర్" గ్రంథం రెండు భాగాలకు కొనసాగింపుగా దీనిని రాశారు. అందరినీ నిర్విణ్ణులను చేసే విధంగా 2019, నవంబరులో బాబ్రిమసీదు సమస్యపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరోగ్యం క్షీణిస్తున్నప్పటికీ ఈ అంశంపై తాను చేసిన రచనలను ఒకటిగా కూర్చేందుకు పూనుకున్నారు. 2024, జూన్ 4వ తేదీన ప్రతిపక్షాలకు మరింత బలాన్ని చేకూర్చే విధంగా ప్రజల తీర్పు వెల్లడైన తర్వాత ఆయన ఎటువంటి భావావేశాలతో ఉంటాడా అని నేను ఆలోచిస్తుండేదానిని.

1990వ దశాబ్దంలో భారత ప్రజాస్వామ్యం, పరిపాలనా విధానంపై నిర్ణయాత్మకమైన దాడులు జరిగాయి. మనదేశ ప్రజాస్వామ్యంలో లౌకికవాదం మౌలికమైనదని గఫూర్ సాహెబ్ ఎల్లప్పుడూ చెబుతుండేవారు. ఆ భావనను తిరగదోడటానికి చేస్తున్న ప్రయత్నాలలో భాగంగా, అప్పటికి సమాజంలో వివిధ స్థాయిలలో కనిపిస్తున్న చీలికలను, వైరుధ్యాలను మరింత పెద్దవిగా, లోతైనవిగా చేశారు.

1990వ దశాబ్దం మొదట్లో బాబ్రిమసీదును కూల్చివేశారు (1992, డిసెంబరు 6న). దానికి ముందు వివిధ ప్రజాస్వామిక సంస్థలను లోపలి నుండి తొలిచివేశారు. రాజకీయ నాయకుల స్థాయిని దిగజార్చారు. ఆ సమయం నుండే నూరానితో నా సాన్నిహిత్యం పెరగటం మొదలైంది. బాంబే హైకోర్టు బార్ కౌన్సిల్ లైబ్రరి హాలులో ఆయన టై, కోటు ధరించి, కప్పులోని టీని చప్పరిస్తూ కనిపించేవారు. మొదట స్వల్ప సమయం జరిగే చర్చలు తర్వాత సుదీర్ఘమైన సమావేశాలుగా మారాయి. కొన్ని సందర్భాలలో నేపియన్ సీ రోడ్‌లోని ఆయన నివాసంలోనే ఈ సమావేశాలు జరిగేవి. న్యాయ, సామాజిక శాస్త్రాలను అధ్యయనం చేస్తున్న, పత్రికా రచయితలుగా ఉన్న మాలాంటి వారం 1984లో జరిగిన భివాండి–బొంబాయి హింసాకాండను చూశాం. దానిపై పత్రికలలో రాశాం. అదే సంవత్సరం న్యూఢిల్లీలోనూ, ఇతర నగరాలలోనూ సిక్కులపై హత్యాకాండకు భారతదేశంలోని అతి పెద్ద రాజకీయ పార్టీ నాయకత్వం వహించటాన్ని భయంతో తిలకించాం. పక్కనే ఉన్న గుజరాత్‌లో 1985లో జరిగిన మతోన్మాద విధ్వంసాన్ని సన్నిహితంగా పరిశీలించాను. గతంలో మొరదాబాద్(1980), హషింపురా–మీరట్ (1987), భాగల్పూర్(1989)లలో ఇటువంటి ఘటనలు జరిగిన సందర్భాలలో ప్రచారం తీరును పరిశీలించాను. వాటిలో మొదట ఎవరు దాడి చేశారు అన్నది ప్రధానాంశంగా వార్తలు, విశ్లేషణలు వచ్చాయి. వీటిని పరిశీలిస్తే ఘర్షణలకు పాల్పడుతున్నవారు అన్ని సంఘటనలలోనూ ఒకే విధమైన ప్రచార పద్ధతులను అనుసరించారని స్పష్టమైంది. "మొదట ఎవరు రాయి విసిరారు" అన్న ప్రశ్నతో ప్రారంభించి, తమ ప్రత్యర్థి గ్రూపులే మొదట దాడి చేసినట్లు ప్రచారం చేశారు. దానినే మళ్ళీమళ్ళీ చెబుతూ, ప్రజల మనసులలోకి ఎక్కించే ప్రయత్నం చేశారు.



మతతత్వవాదులు రాజకీయాలను ఏ విధంగా వినియోగించుకుంటారన్న అంశాన్ని ఎక్కువ మంది పట్టించుకోరు. కొద్దిమంది మాత్రమే ఇటువంటి ప్రశ్నలు వేస్తారు. ఈ ప్రశ్నలకు ఎజి నూరానితో జరిపే చర్చలలో సమాధానాలను తెలుసుకొనేదానిని. భివాండిలో జరిగిన మతోన్మాద హింసను ఆయన లోతుగా అర్థం చేసుకున్నారు. మండల్ కమిషన్ ఇచ్చిన చరిత్రాత్మకమైన నివేదిక(1970) ప్రజల కళ్ళు తెరిపించింది. 1970వ దశాబ్దంలో జరిగిన హింసాకాండ, భారతదేశ లౌకిక పునాదులను క్రమపద్ధతిలో దెబ్బతీయటానికి చేస్తున్న ప్రయత్నాలపై చేసిన సునిశిత అధ్యయనం భారతదేశంలోని అత్యున్నతమైన న్యాయ నిపుణులలో ఆయనకు స్థానం కల్పించింది.

నూరానీ వృత్తిరీత్యా న్యాయవాది అయినా పత్రికా రచయితలంత నిశితంగా పరిశీలన చేసి, ఆయా సంఘటనలను పూర్తి వివరాలతో నమోదు చేశారు. దక్షిణ ముంబయిలోని ఆయన ఇల్లు పుస్తకాలు, వార్తా పత్రికలలో వచ్చిన ముఖ్యమైన వార్తలను కత్తిరించిన ఫైళ్ళతో నిండి ఉండేది. వివిధ అంశాలపై నిరంతరం చర్చలు జరుగుతుండేవి. ఆయన సమయాన్ని ఖచ్చితంగా పాటించేవారు. చర్చలు జరుపు

**❝ఆయన రాసిన ఆర్టికల్ 370:ఎ కాన్స్టిట్యూషనల్ హిస్టరి ఆఫ్ జమ్మూ అండ్ కాశ్మీర్ 2011, ది డిస్ట్రక్షన్ ఆఫ్ హైదరాబాద్ 2014 ...మొదలైన వ్యాసాలు ఉన్నత ప్రమాణాలతో ఉన్న ఫ్రంట్‌లైన్, డాన్ పత్రికలలో మాత్రమే ప్రచురించబడటం ఏ మాత్రం ఆశ్చర్యం కలిగించదు. ఆయన రాసిన ప్రతి వ్యాసమూ న్యాయవ్యవస్థ ఇస్తున్న తీర్పులను విశ్లేషిస్తూ రాసేవారికి, మీడియాలో పనిచేసే వారికి పాఠ్య పుస్తకాల వంటివి.❞**

తున్నపుడు ఆయన ఒక షెల్ఫ్‌లోని ఒక భాగాన్ని చూయించి, మాట్లాడుతున్న అంశానికి సంబంధించిన ఫైలును తీసి, దానిలోని విషయాన్ని నీతో పంచుకుంటే నీవెంతో అదృష్టవంతుడివి.

దశాబ్దాల నుండి సేకరించిన పుస్తకాలు, పేపరు కటింగ్‌లతో పాటు తమ వృత్తిలో అత్యున్నత స్థాయిలో కృషి చేసిన కొందరు, కొద్దిమంది ప్రచురణకర్తలతో ఆయన సన్నిహితంగా ఉండేవాడు. కొన్ని రకాల ఆహార పదార్థాలను ఆయన ఇష్టంగా తినేవాడు. ఆధునికమైన వాటికి, ఎలక్ట్రానిక్ పరికరాలకు దూరంగా ఉండేవాడు. ఆయన ప్రతి వ్యాసాన్ని పూర్తిగా చేతితోనే రాసి, బాంబే హైకోర్టుకు దగ్గరలో ఉన్న ఒక టైపిస్టు వద్దకు పంపేవాడు. అతను ఆ వ్యాసాలను టైపు చేసి పంపి, ఆయన పంపిన సవరణలతో అంతిమంగా టైపు చేసి ఇచ్చేవాడు.

జమ్మూ కాశ్మీర్‌లో ప్రభుత్వ చర్యలు, వైఫల్యాలు, (ఆర్టికల్ 370:ఎ కాన్స్టిట్యూషనల్ హిస్టరి ఆఫ్ జమ్మూ అండ్ కాశ్మీర్ 2011), హైదరాబాద్‌పై (ది డిస్ట్రక్షన్ ఆఫ్ హైదరాబాద్ 2014) ...మొదలైన ఆయన క్రమబద్ధంగా రాసే ప్రామాణికమైన వ్యాసాలు ఉన్నత ప్రమాణాలతో ఉన్న ఫ్రంట్‌లైన్, డాన్ పత్రికలలో మాత్రమే ప్రచురించబడటం ఏ మాత్రం ఆశ్చర్యం కలిగించదు. సుప్రీంకోర్టు తీర్పు (కేదార్‌నాథ్ సింగ్ జడ్జిమెంట్ 1962) దేశద్రోహం అంశాన్ని దొడ్డిదారిన తీసుకొచ్చిందన్న అంశంతో పాటు, ఆయన రాసిన ప్రతి వ్యాసమూ న్యాయవ్యవస్థ ఇస్తున్న తీర్పులను విశ్లేషిస్తూ రాసేవారికి, మీడియాలో పనిచేసే వారికి పాఠ్య పుస్తకాల వంటివి. నాటి ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ హెబియస్ కార్పస్ పిటిషన్‌పై ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టును తీవ్రంగా విమర్శించాడు. రాజ్యాంగ సమస్యలపై ఏర్పాటైన కోర్టులలో చర్చించే సున్నితమైన అంశాలను సెన్సేష నల్‌గా ప్రచారం (తరచుగా వక్రీకరిస్తుంటుంది) చేయటంలో "సోషల్ మీడియా" ఆసక్తి చూయిస్తున్నదని, న్యాయవ్యవస్థ తనను తాను సరిచేసుకోవటానికి చర్యలు తీసుకోవాలని ఎజి నూరాని తరచుగా చెప్పేవాడు.

నైతిక ప్రమాణాలను నిలబెట్టటం కోసం ఏ అంశాలను ఎప్పుడు గుర్తు చేసుకోవాలి, ఎప్పుడు ముందుకు తీసుకురావాలి, వాస్తవాలను ఎలా వెలికి తీయాలి, ఎలా, ఎక్కడ ప్రచురింపజేయాలి అన్న అంశాలపై సూక్ష్మమైన వివరాలకు కూడా ప్రణాళికను రూపొందించే వారు ఉన్నారు అంటే ఆయన నూరాని మాత్రమే. దృఢమైన నైతిక సూత్రాలతో కూడినవి కావటం వలన న్యాయ పరంగా, జర్నలిజం పరంగా నూరాని రచనలు అత్యున్నతంగా, ఆ రంగాల పట్ల గౌరవం పెంపొందించేవిగా ఉన్నాయి. న్యాయమని నమ్మినదాని కోసం ఆయన నిర్భయంగా మాట్లాడేవాడు. తనను వేరుచేసి దెబ్బతీయాలని ప్రయత్నం చేస్తున్న శత్రువులతో కూడా ఆయన నిర్భయంగా వ్యవహరించే వాడు.

ఆయన రచనలు – వ్యాసాలు, పుస్తకాలు:

–సావర్కర్ అండ్ హిందుత్వ (2002)

–ది బాబ్రిమసీద్ క్వశ్చన్ (1528–2003 ) ఎ మేటర్ ఆఫ్ నేషనల్ హానర్' రెండు భాగాలు, 2003

–కాన్స్టిట్యూషనల్ క్వశ్చన్స్ అండ్ సిటిజెన్స్ రైట్స్ (2006)

– ది ఆర్‌ఎస్‌ఎస్ అండ్ బిజెపి : ఎ డివిజన్ ఆఫ్ లేబర్ (2008)

– జిన్నా అండ్ తిలక్ : కామ్రేడ్స్ ఇన్ ది ఫ్రీడం స్ట్రగుల్ (2010)

– ఆర్టికల్ 370: ఎ కాన్స్టిట్యూషనల్ హిస్టరి ఆఫ్ జమ్మూ అండ్ కాశ్మీర్ (2011)

– ఇస్లాం, ది సౌత్ ఆసియా అండ్ ది కోల్డ్‌వార్ (2012)

– ది డిస్ట్రక్షన్ ఆఫ్ హైదరాబాద్ (2014)

సమకాలీన భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేయటానికి మెజారిటి మతోన్మాదులు ఫాసిస్టు దృక్పధంతో చేస్తున్న ప్రయత్నాలను ఆయన (ఆయన రాసిన వాటిలో ఇవి కొన్ని మాత్రమే) తన రచనలలో పేర్కొన్నాడు. సమకాలీనులు, విద్యార్థులు, న్యాయవాదులు, పత్రికా విలేకరులు, ప్రస్తుత పరిస్థితులతో ఆందోళన చెందుతున్న ఈ పరిస్థితులను మార్చటానికి ప్రయత్నం చేస్తున్న భారతీయులంతా ఆయన రచనలను తప్పనిసరిగా చదవాలి. సమకాలీన వాస్తవా లను ప్రతిబింబించిన అతి విలువైన పత్రా లుగా భవిష్యత్‌లో అవి ఉంటాయి.

ఆయన మరణవార్త తెలిసిన వెంటనే– నెట్‌లో నేను వివరాల కోసం అన్వేషిస్తుండగా బాబ్రిమసీదు మూడు గుమ్మటాలను కూల్చిన ఘటనల వివరాలు కనిపించాయి. జాతికి అవమానకరమైన ఈ చర్యకు పాల్పడిన ముఖ్య నాయకులు, ప్రభుత్వంలో ఉన్నవారు మోసపూరితంగా వ్యవరించారని అవి స్పష్టం చేస్తున్నాయి. భారతీయులలోని గొప్పవారిలో ఒకడైన, మైనారిటీల హక్కుల కోసం స్థిరంగా నిలబడిన, హిందువుగా అంకితభావంతో జీవించిన సి రాజగోపాలాచారి స్మృతికి ఈ మూడు గుమ్మటాలలో రెండింటిని అంకితమి చ్చారు. కాని "హంతకులు వారే, విచారణాధి కారులూ వారే. అటువంటప్పుడు నన్ను హత్య చేసినవారిని శిక్షించమని నా బిడ్డలు ఎవరిని న్యాయం అడగాలి?" అన్న మౌలానా హస్రత్ మొహాని వాక్యాలను ఉదహరిస్తూ మూడవ దానిని గురించి చెప్పినదే మనసును కలచివేసేదిగా ఉన్నది. 2014లో నూరాని రాసిన పుస్తకంలో హస్రత్ మొహాని వాక్యాలను ఉదహరించటంలో ప్రత్యేకత ఉన్నది. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా భారతీయులు దేశం మూలమూలలా తెలిపిన ప్రతి నిరసనలోనూ ప్రతిధ్వనించిన 'ఇంక్విలాబ్ జిందాబాద్' నినాదాన్ని మొదట ఇచ్చినది ఉర్దూభాషలో ప్రఖ్యాత కవి అయిన హస్రత్ మొహాని. 1921లో అహమ్మదాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ మహాసభలో స్వామి కుమారానందతో కలిసి దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలనే తీర్మానాన్ని హస్రత్ మొహాని ప్రవేశపెట్టాడు. దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని మొదట నినదించిన కొద్దిమందిలో ఆయన ఒకడు.

ఎజి నూరాని తన రచనలలో, కార్యకలాపాలలో ఈ వారసత్వాన్ని ముందుకు తీసుకుపోవటానికి పూనుకున్నాడు. 2024 ఎన్నికల ఫలితాల తర్వాత ఆయనలో నిరాశ తగ్గి, ఆగస్టులో ఆశాభావంతో మరణించి ఉంటాడని భావిస్తున్నాను. ఎజి నూరాని జీవితాంతం పోరాడిన, మరణంలో కూడా నిలబెట్టిన లక్ష్యాల సాధన కోసం భారతదేశం, దేశంలోని ప్రతిపక్ష పార్టీలు పూనుకోవాలి.

**(అనువాదం: ఎ కోటిరెడ్డి)**

రాజకీయ పరిణామాలు

# సామ్రాజ్యవాదుల కనుసన్నల్లో మోడి నడక

**ఎ కోటిరెడ్డి**



రచయిత మార్క్సిస్టు ఎడిటోరియల్ బాధ్యులు

విశ్వగురువునని తనకు తాను భుజకీర్తులు తగిలించుకున్న ప్రధాని మోడి అన్నిచోట్లా అభాసుపాలవుతున్నారు. అంతరాజ్తీయ సమస్యలపై మోడి సామ్రాజ్యవాదులకు అనుకూలంగా మాట్లాడుతున్నారు. “నవిపోదురుగాక నాకేంటి” అన్న చందంగా వ్యవహరిస్తూ అపహాస్యం పాలవుతున్నారు. పెద్ద దేశాల సంగతి అటుంచితే, సమస్యల సుడిగుండంలో ఉన్న ఉక్రెయిన్ లాంటి దేశాలు కూడా ఆయనను లెక్క చేయటం లేదు. సెప్టెంబరు 21 నుండి మూడు రోజుల పాటు మోడి అమెరికాలో పర్యటించారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని ఎలా పరిష్కరించాలని బైడెన్ మోడిని అడిగినట్లు ఆయన అనుయాయులు గొప్పగా ప్రచారం చేసుకున్నారు. కాని ఉక్రెయిన్‌కు, ఇజ్రాయిల్‌కు మనదేశం నుండి ఆయుధాలు సరఫరా అవుతున్నాయని వెల్లడవటంతో ప్రధాని, ఆయన భక్తజనం చెప్పుకొంటున్న గొప్పలు నీరుగారి పోయాయి. మారణకాండను కొనసాగించటానికి ఆయుధాలను సరఫరా చేస్తూ, మరోవైపున యుద్ధాలు వద్దు, సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సుద్దులు చెబుతూ మోడి బాగా నటిస్తున్నాడని అంతర్జాతీయ వ్యవహారాల నిపుణులు భావిస్తున్నారు.

ఉక్రెయిన్-రష్యా యుద్ధం మోడి అవకాశవాదాన్ని వెల్లడిస్తున్నది. రష్యాతో సంబంధాలను తగ్గించుకోవాలని, ఉక్రెయిన్‌కు పూర్తి మద్దతు ఇవ్వాలని అమెరికా మోడిని ఒత్తిడి చేస్తున్నది. రష్యాలో మోడి పర్యటిస్తున్నపుడూ, ఆ తర్వాత అమెరికా ప్రజాప్రతినిధులు, నాయకులు రష్యాకు మద్దతిస్తున్నందుకు మోడిని తీవ్రంగా విమర్శించారు. తమకు స్వతంత్రంగా వ్యవహరించే హక్కు ఉన్నదని మనదేశ ప్రభుత్వ ప్రతినిధులు గొనుగుతున్నా ఏ మాత్రం పట్టించుకోలేదు. “పోరాటాల సమయంలో వ్యూహాత్మక స్వాతంత్ర్యం అంటూ ఉండదని, అమెరికాతో సంబంధాలను తేలికగా తీసుకోవద్దని” భారత్‌లోని అమెరికా రాయబారి ఎరిక్ గార్సెటి మోడిని హెచ్చరించాడు. ఇదే తరహాలో అమెరికా ఇతర ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు అనేకమంది వ్యాఖ్యానించారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా మోడిని విమర్శించారు. ఉక్రెయిన్‌లో మోడి పర్యటించి వచ్చిన తర్వాత భారత్‌లోని ఉక్రెయిన్ రాయబారి మాట్లాడుతూ “ఉక్రెయిన్-రష్యాల మధ్య పోస్ట్‌మన్‌లాగా వ్యవహరించవద్దు” అని మోడిని ఉద్దేశించి పేర్కొన్నారు. ఒక చిన్న దేశపు రాయబారి పోస్ట్‌మెన్ అని హేళన చేస్తున్నా మోడి ఏ మాత్రం స్పందించలేదు. కేంద్ర మంత్రులు, బిజెపి నాయకులు ఈ విమర్శలకు సమాధానం చెప్పటానికి పూనుకోలేదు. అమెరికన్ సామ్రాజ్యవాదులు మన పాలకవర్గాలను లొంగదీసుకొని, వారి పెత్తందారి విధానాలకు మద్దతు ఇవ్వక తప్పని పరిస్థితిని కల్పించాలని ప్రయత్నిస్తున్నారు. మన పాలకవర్గాలు కూడా అదే బాటలో ముందుకు సాగుతున్నాయి.

రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధంపై ప్రభుత్వం నిర్దిష్ట వైఖరి తీసుకోలేదు. మోడి ప్రభుత్వం అమెరికాతో జట్టుకడుతున్నది. అందువలన రష్యాను లొంగదీసుకోవటానికి ఉక్రెయిన్‌ను పావుగా వాడుకుంటున్న అమెరికాను వ్యతిరేకించలేకపోతున్నది. అంతర్జాతీయ రాజకీయాలలో మధ్యేవాద విధానాన్ని అనుసరించటం, తర్వాత క్రమంగా మితవాదం వైపు మొగ్గుతూ, ఇపుడు అమెరికాతో అంటకాగే స్థితికి చేరిన భారత పాలకవర్గాల దిగజారుడును కూడా ఇది తెలియజేస్తున్నది.

ఇటలీ, చెక్ రిపబ్లిక్‌లు భారతదేశం నుండి దిగుమతి చేసుకుంటున్న ఆయుధాలను ఉక్రెయిన్‌కు అందిస్తున్నాయన్న విషయం స్పష్టంగా వెల్లడైంది. ఉక్రెయిన్ వాటిని రష్యాపై దాడికి ఉపయోగిస్తున్నది. మనదేశం నుండి ఆయుధాలు దిగుమతి చేసుకున్న దేశాలు వాటిని ఇతర దేశాలకు అందించరాదని ఒప్పందాలలో ఉన్నది. దిగుమతి చేసుకుంటున్న దేశాలు ఒప్పందాన్ని ఉల్లంఘించి ఉక్రెయిన్‌కు ఆయుధాలు సరఫరా చేస్తున్నా మనదేశం వారిని ప్రశ్నించటం లేదు. ఆ దేశాలకు ఆయుధాల సరఫరాను ఆపలేదు. మన మిత్రదేశంగా ఉన్న రష్యా ఈ అంశంపై అసంతృప్తి వ్యక్తం చేసినా ప్రభుత్వంలో స్పందన లేదు.

అమెరికా, నాటోలు రష్యాను లొంగదీసుకోవటానికి, ఆ దేశాన్ని తమ తొత్తుగా చేసుకోవటానికి ఉక్రెయిన్‌ను కీలుబొమ్మగా ఉపయోగించుకొంటున్నాయి. ఆ దేశానికి ఆయుధాలు, ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నాయి. తాము సరఫరా చేసిన ఆయుధాలను రష్యాపై ప్రయోగించకుండా నాటో దేశాలు గతంలో ఉక్రెయిన్‌ను నిరోధించాయి. ఇపుడు క్రమంగా ఆ నిషేధాన్ని సడలిస్తూ, ఆయుధాలను రష్యాపై దాడికి వినియోగించటానికి అవకాశం ఇచ్చాయి. ఆర్థికంగా కూడా అవసరమైన సహాయాన్ని అందిస్తున్నాయి. తమ దేశాలలో ఉన్న రష్యన్ ప్రభుత్వ నిధులను స్థంభింపజేసి, ఆ మొత్తానికి ఉక్రెయిన్‌కు ఆయుధాలను అందిస్తున్నాయి. ఆ విధంగా యుద్ధం కొనసాగటానికి, తమ ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే ఎలాంటి

**❝బిజెపి ప్రభుత్వం విదేశాంగ విధానంలో అవకాశవాదంగా వ్యవహరిస్తున్నదని ఈ ఘటనలు వెల్లడిస్తున్నాయి. సామ్రాజ్యవాద దురాక్రమణదారీ విధానాలను పరోక్షంగా బలపర్చటం, దురాక్రమణకు గురౌతున్న వారి పట్ల అలక్ష్యంగా వ్యవహరించటంతో ప్రభుత్వ ప్రతిష్ఠ దిగజారిపోతున్నది. ప్రభుత్వం ఇంత అవకాశవాదంగా వ్యవహరిస్తున్నది కాబట్టే చివరకు చిన్న దేశాలు కూడా మోడిని లెక్క చేయటం లేదు. వారు తీవ్రంగా విమర్శిస్తున్నా స్పందించటం లేదంటేనే ప్రభుత్వ అసమర్థత వెల్లడౌతున్నది.❞**

పరిణామాలు ఎదురౌతాయన్నది ప్రపంచ దేశాలకు తెలియజెప్పటానికి అమెరికా, ఇతర సామ్రాజ్యవాద దేశాలు దీనినొక అవకాశంగా వినియోగించుకొంటున్నాయి.

సామ్రాజ్యవాదులు రష్యాకు సహకారం అందించే దేశాలపై ఆంక్షలు విధిస్తూ, బెదిరిస్తున్నారు. మన దేశం రష్యా నుండి ఆయిల్, ఇతర ఉత్పత్తులను దిగుమతి చేసుకొంటూ, ఈ ఆంక్షలను కొంతమేరకు అమలు చేయటం లేదు. కాని అమెరికా, నాటోలు ఉక్రెయిన్‌కు ఆయుధాలు, సైనిక సహకారాన్ని అందించటాన్ని వ్యతిరేకించటం లేదు. సామ్రాజ్యవాదుల చేతులలో కీలుబొమ్మగా వ్యవహరిస్తూ, చర్చలకు అంగీకరించని ఉక్రెయిన్‌ను విమర్శించటం లేదు. ఈ అవకాశవాద వైఖరి వలననే చిన్న దేశాల రాయబారులు కూడా మోడిని విమర్శిస్తున్నారు.

### పాలస్తీనాలో మారణకాండ

గాజాపై ఇజ్రాయిల్ దాడి విషయంలో మోడి ప్రభుత్వం ఒకవైపున శాంతి జపం చేస్తూ, మరోవైపున ఇజ్రాయిల్‌ను బలపరుస్తున్నది. గాజా ప్రాంతంలో నివాసం ఉంటున్న వారినందరినీ తరిమివేసి, ఆ ప్రాంతాన్ని పూర్తిగా తన ఆధీనంలోకి తెచ్చు కోవాలని ఇజ్రాయిల్ ప్రయత్నిస్తున్నది. నివాసాలతో పాటు పాఠశాలలు, ఆసుపత్రులు, మసీదులు, మందిరాలనే విచక్షణ లేకుండా దాడులు చేస్తున్నది. చివరకు ఐక్యరాజ్యసమితికి చెందిన సహాయ సంస్థలు, రెడ్‌క్రాస్ సిబ్బంది పైన కూడా ఉద్దేశ్యపూర్వకంగా దాడులు చేస్తూ, హత్యాకాండను కొనసాగిస్తున్నది. మోడి ప్రభుత్వం ఇజ్రాయిల్ దురాగతాలను ఖండించకపోగా, ఆ దేశానికి ఆయుధాలను ఎగుమతి చేస్తూ, సన్నిహిత సంబంధాలను కొనసాగిస్తున్నది. పాలస్తీనా ప్రజలను, ఐక్యరాజ్యసమితి సిబ్బందిని ఇజ్రాయిల్ హత్య చేస్తున్నది. దేశంలోని ప్రజలపైనా, రాజకీయ ప్రత్యర్థులపైనా గూఢచర్యం కొనసాగించటానికి అవసరమైన పరికరాలను, ఆయుధాలను ఇజ్రాయిల్ నుండి దిగుమతి చేసుకొంటున్న మోడి ప్రభుత్వం ఇజ్రాయెల్‌కు అవసరమైన ఆర్థిక సహకారాన్ని కూడా అందిస్తున్నది.

గాజాపై దాడులను ప్రాంతీయ యుద్ధంగా విస్తరించే విధంగా ఇజ్రాయిల్ వ్యవహరి స్తున్నది. గత సంవత్సరం అక్టోబరు 7న గాజాపై ఇజ్రాయిల్ మారణకాండను ప్రారంభించిన తర్వాత చుట్టుపట్ల ఉన్న ఐదు దేశాలపై రాకెట్లు, డ్రోన్‌లు, వైమానికంగా 17,000కు పైగా దాడులు చేసింది. గాజాతో పాటు లెబనాన్, సిరియా, ఎమెన్, ఇరాన్‌లపై దాడులు చేసింది. రాజకీయ నాయకులు, ఆయా దేశాల సైనిక యంత్రాంగంపై ఈ దాడులను కేంద్రీకరించింది. జులై 31న లెబనాన్‌పై దాడి చేసి హమాస్ నాయకుడు ఇస్రాయెల్ హనియేను హత్య చేసింది. అంతకు ముందురోజే లెబనాన్ రాజధాని బీరూట్‌పై చేసిన దాడిలో హెజ్‌బొల్లా సీనియర్ నాయకుడు ఫౌద్ సుకూర్ మరణించాడు. ఏప్రిల్‌లో సిరియా రాజధాని డమాస్కస్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయంపై జరిపిన వైమానిక దాడిలో ఏడుగురు ఇరాన్ దౌత్య సిబ్బంది మరణించారు. సిరియాపై జరిపిన దాడులలో సామాన్య ప్రజలతో పాటు సైనికులు కూడా మరణించారు.

ఇజ్రాయిల్ గాజాపై నిరంతరం దాడులు చేస్తూ వేలాది మంది అమాయక ప్రజలను హత్య చేయటానికి అమెరికా, యూరప్ దేశాలు మద్దతు ఇస్తున్నాయి. ఏ విధమైన రక్షణలేని గాజా ప్రజలపై ఈ విధంగా ఇజ్రాయిల్ దాడులు, హత్యలు చేస్తుంటే కనీసం వారించని, దాడులను ఖండించని దేశాలు ప్రజాస్వామ్యం, సార్వభౌమాధికార హక్కుల రక్షణ గురించి మాట్లాడుతున్నాయి. ఇజ్రాయిల్ చుట్టుపక్కల దేశాలపై దాడులు చేస్తుంటే ఈ దేశాలు యుద్ధోన్మాదంతో వ్యవహరిస్తూ, ఆయుధాలు సరఫరా చేస్తున్నాయి.

ప్రస్తుతం ప్రపంచంలో యుద్ధంలో ఉన్న రెండు ప్రాంతాలలోనూ దురాక్రమణకు, జాతి హననానికి పూనుకొంటున్న వారు భారతదేశం నరఫరా చేస్తున్న ఆయుధాలను వినియోగిస్తున్నారు. పాలస్తీనా ప్రజలను నిర్మూలించి, వారి భూభాగాన్ని దురాక్రమణ చేయటం కోసం ఇజ్రాయిల్ భారతదేశం సరఫరా చేసిన ఆయుధాలను ఉపయోగిస్తున్నది. ఆయుధాలతో పాటు యుద్ధంలో పాల్గొనటానికి, అవసరమైన పనులు చేయటానికి మోడి ప్రభుత్వం భారతదేశంలోని నిరుద్యోగులను ఇజ్రాయిల్ పంపిస్తున్నది. మరోవైపున యుద్ధం విరమించాలని విజ్ఞప్తులు చేస్తున్నది.

బిజెపి ప్రభుత్వం విదేశాంగ విధానంలో అవకాశవాదంగా వ్యవహరిస్తున్నదని ఈ ఘటనలు వెల్లడిస్తున్నాయి. సామ్రాజ్యవాద దురాక్రమణదారీ విధానాలను పరోక్షంగా బలపర్చటం, దురాక్రమణకు గురౌతున్న వారి పట్ల అలక్ష్యంగా వ్యవహరించటంతో ప్రభుత్వ ప్రతిష్ఠ దిగజారిపోతున్నది. ప్రభుత్వం ఇంత అవకాశవాదంగా వ్యవహరిస్తున్నది కాబట్టే చివరకు చిన్న దేశాలు కూడా మోడిని లెక్క చేయటం లేదు. వారు తీవ్రంగా విమర్శిస్తున్నా స్పందించటం లేదంటేనే ప్రభుత్వ అసమర్థత వెల్లడౌతున్నది. "బయట పల్లకి మోతలకు కూడా కాలం చెల్లిందని" ఈ ఘటనలు స్పష్టం చేస్తున్నాయి.

ఇటువంటి పరిస్థితులలో సామ్రాజ్యవాద వ్యతిరేక విధానాన్ని అనుసరించాలని ప్రభుత్వంపై పెద్ద ఎత్తున ఒత్తిడి తీసుకురావలసిన అవసరం ఉంది. సామ్రాజ్యవాదులతో స్నేహం దేశం, ప్రజల ప్రయోజనాలకు హాని చేస్తుంది. సామ్రాజ్యవాద అనుకూల విధానాలు ఆర్థిక, సామాజిక, రాజకీయ విధానాలలో పెత్తందారులు, బడా పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలకు దారితీస్తాయి. ప్రజల ప్రయోజనాలను పక్కన పెట్టటానినికి, సంపదలను బడా పెట్టుబడిదారులు, సామ్రాజ్యవాదులు స్వంతం చేసుకోవటానికి మార్గం సుగమం చేస్తుంది. కాబట్టి విదేశాంగ విధానం కూడా ప్రజల ప్రయోజనాలకు సంబంధించినదే. అందువలన ప్రజలు, ప్రజాసంఘాలు, వివిధ సంస్థలు విదేశాంగ విధానం సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా ఉండాలని ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి తెస్తూ ఉండాలి. ❊

# సీతారామ్ ఏచూరి

*(2వ పేజీ తరువాయి)*

పనిచేసింది. 1991లో సోవియట్ యూనియన్ పతనమయ్యాక సోషలిజానికి తగిలిన ఈ తీవ్రమైన, చారిత్రాత్మకమైన ఎదురుదెబ్బను పరిగణనలోకి తీసుకుని.. సోవియట్ పతనానంతర సైద్ధాంతిక సమస్యల మీద పార్టీ తన వైఖరిని నిర్దేశించుకుంది. 1992లో మద్రాసులో జరిగిన సిపిఐ(ఎం) 14వ మహాసభలో కూలకషంగా చర్చ జరిగిన తరువాత సైద్ధాంతిక సమస్యలపై రూపొందించిన తీర్మానాన్ని మహాసభ ఆమోదించింది. ఆ మహాసభలో ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టి, చర్చలను క్రోడీకరించి ముగింపు సమాధానం సీతారామే ఇచ్చారు. పోలిట్‌బ్యూరో పక్షాన ఒక కేంద్ర కార్యదర్శివర్గ సభ్యుడు సైద్ధాంతిక తీర్మానం ప్రవేశపెట్టడం ఇదే మొదటిసారి. సీతారాంలోని సిద్ధాంతకారుడిని పార్టీ గుర్తించిందనడానికి ఇదే నిదర్శనం. కారల్ మార్క్స్ 175వ జయంతిని పురస్కరించుకొని సిపిఐ(ఎం) ఒక అంతర్జాతీయ సదస్సును నిర్వహించింది. 'వర్తమాన ప్రపంచం –మార్క్సిజం ప్రాసంగికత' అనే అంశంపై జరిగిన ఈ అంతర్జాతీయ సదస్సుకు నిర్వాహకుడుగా, సమన్వయకర్తగా సీతారాం వ్యవహరించారు. 21 దేశాల నుంచి వచ్చిన కమ్యూనిస్టు పార్టీల ప్రతినిధుల మాదిరిగానే.. బారతదేశం పక్షాన ఏచూరే పత్రాన్ని సమర్పించారు.

1992లో డిసెంబరులో బాబ్రీ మసీదు విధ్వంసం తరువాత దేశంలో మత రాజకీయాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో సీతారాం కీలకపాత్ర పోషించారు. యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వ కాలంలోనూ పెద్ద నాయకులతో కలిసి ముఖ్య పాత్ర పోషించారు. 1999లో జరిగిన సిపిఐ(ఎం) 14వ మహాసభలో పొలిట్‌బ్యూరో సభ్యులుగా ఎన్నికయ్యారు. 2004లో యుపిఏ–1 ఏర్పాటు, కార్యక్రమం రూపకల్పనలోనూ ఆయన ముఖ్యపాత్ర పోషించారు. పౌర సంఘాలు, ప్రభుత్వేతర సంస్థలు, ప్లానింగ్ కమిషన్ వంటి వాటిని కలిపి ఒక నెట్‌వర్క్‌ను చేశారు. ప్రభుత్వ విధాన నిర్ణయాల్లో జోక్యం చేసుకొని ఉపాధి హామీ, ఆహార, విద్యా, సమాచార హక్కు తదితర చట్టాల రూపకల్పనలోనూ, వాటిని అమల్లోకి తీసుకు రావడంలోనూ ముఖ్య భూమిక పోషించారు.

2005లో పశ్చిమ బెంగాల్ నుంచి రాజ్యసభకు ఎన్నికై 12 సంవత్సరాలపాటు పీడిత జనవాణిని పార్లమెంట్‌లో వినిపించారు. ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు పొందారు. 'పీపుల్స్ డెమోక్రసీ' వారపత్రికకు 20 సంవత్సరాలపాటు సంపాదకులుగా పనిచేశారు. సైద్ధాంతిక త్రైమాసపత్రిక 'ది మార్క్సిస్టు'కు కూడా సంపాదకులుగా పనిచేశారు. హిందూస్థాన్ టైమ్స్ ఆంగ్ల పత్రికలో 'లెఫ్ట్ హాండ్ డ్రైవ్' అనే కాలమ్‌ను నిర్వహించారు. ఆయన చాలా పుస్తకాలు రాశారు.

పార్టీ పక్షాన అంతర్జాతీయ వ్యవహారాల బాధ్యత చూసే సీతారాం.. ప్రపంచంలోని అనేక కమ్యూనిస్టు పార్టీలు, వర్కర్స్ పార్టీల నేతలతో రాజకీయ సంబంధాలు నెలకొల్పడంలోనూ, కొనసాగించడంలోనూ కీలక పాత్ర పోషించారు. ఆయన పని లాంఛనప్రాయ సంబంధాలకు మించి ఉండేది. సోదర పార్టీల సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణాత్మక అంశాలను చాలా లోతుగా అధ్యయనం చేసేవారు. ఆయా దేశాల కమ్యూనిస్టు పార్టీల మహాసభలకు సౌహార్ద్ర ప్రతినిధుల బృందంలో ఉండేవారు. రష్యా, చైనా, యూరప్, లాటిన్ అమెరికా దేశాల్లోని కమ్యూనిస్టు పార్టీల నాయకులతో సిపిఐ(ఎం) ప్రతినిధిగా పలుసార్లు కలిసి చర్చలు జరిపారు. 1994లో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, పార్టీ అగ్ర నేత జ్యోతిబసు తదితరులతో కలిసి క్యూబా వెళ్లారు. క్యూబా అధ్యక్షుడు ఫైడల్ కాస్ట్రోతో జరిగిన చర్చల్లో సీతారాం కూడా పాల్గొన్నారు. నేపాల్‌లో కమ్యూనిస్టు ప్రభుత్వ ఏర్పాటు సమయంలోనూ, తర్వాత వొడిదుడుకులు వచ్చినప్పుడూ తగిన సూచనలిచ్చి తోడ్పడ్డారు. ఇటీవలనే శ్రీలంక అధ్యక్షుడుగా ఎన్నికైన దిసనాయకే గత ఫిబ్రవరిలో భారత్ వచ్చినప్పుడు సీతారాంను కలిసి శ్రీలంక ఆర్థిక సంక్షోభ పరిణామాలపై చర్చలు జరిపి వెళ్లిన సంగతి తెలిసిందే.

సీతారాం ఈ ప్రయత్నాలు.. సిపిఐ(ఎం)కు అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంపై సమగ్ర అవగాహన పెంపొందించుకోవడానికి, అంతర్జాతీయ వ్యవహారాల్లో సరైన నిర్ణయాలు తీసుకోవడానికి ఎంతో దోహదపడింది.

2014లో కేంద్రంలో బిజెపి నేతృత్వంలో ఎన్‌డిఏ ప్రభుత్వం ఏర్పడింది. కార్పొరేట్లతో మిలాఖత్ అయి, మతాన్ని రాజకీయాలతో మిళితం చేసి, ఐక్యంగా సాగుతున్న భిన్నత్వ భారతంలో విభజన రాజకీయాలను కొనసాగిస్తున్న, రైతు, కార్మిక, కష్టజీవుల వ్యతిరేకి అయిన బిజెపిని ఓడించడానికి దేశంలోని వామపక్ష, ప్రజాతంత్ర లౌకిక శక్తులను ఏకం చేసేందుకు కీలకపాత్ర పోషించారు. ఈ ఐక్యతను నిర్మించడానికి అవసరమైన రాజకీయ మెళకువలను, వ్యూహాలను నైపుణ్యంతో సాధించారు.

2014 రాష్ట్ర విభజన సందర్భంగా సిపిఐ(ఎం) వైఖరిని దేశానికి తెలియజేయడం లో పార్లమెంట్‌లో ఆయన ప్రముఖ పాత్ర నిర్వహించారు. ప్రజల ప్రయోజనానికి విరుద్ధంగా రాష్ట్రాన్ని విభజించడంలో కాంగ్రెస్, బిజెపిల మ్యాచ్ ఫిక్సింగ్‌ను ఆయన ఎండగట్టారు. 'దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్' అంటూ గురజాడను ఉటంకిస్తూ..ఇరు ప్రాంతాల ప్రజలకు హాని కలిగించబోయే ఇలాంటి ముఖ్యమైన నిర్ణయం తీసుకోవడానికి వెనుకనున్న దురుద్దేశాలను ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్‌ను ఉద్దేశించి.. రెండు పడవల్లో ప్రయాణిస్తున్నారని, మునిగిపోతారని హెచ్చరించారు. 2014లో కాంగ్రెస్, ఎపి, తెలంగాణా రెండింటా ఓడిపోయిన విషయం విదితమే. విభజన సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిందిగా ఆ తరువాత అనేకసార్లు డిమాండ్ చేస్తూ వచ్చారు.

2015లో పార్టీ 21వ మహాసభల్లో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై చివరిశ్వాస విడిచే వరకూ ఆ బాధ్యతలో కొనసాగారు. మతోన్మాద శక్తుల వల్ల దేశ సమైక్యతకు ఏర్పడిన ముప్పు పట్ల సీతారాం ఎప్పుడూ ఆందోళన చెందుతుండేవారు. ముందు తరాల నుంచి మనకు సంక్రమించిన భారత సంకీర్ణ సంస్కృతి దేశ సమైక్యతను పరిరక్షిస్తుందని గట్టిగా విశ్వసించేవారు. భారత దేశ విశిష్టతలో ముఖ్య లక్షణమైన భిన్నత్వంలో ఏకత్వం పట్ల ఉద్వేగపూరిత నిబద్ధత హృదయాంతరాళాల్లో ఉండేది. దేశ రాజకీయాలు మితవాదం వైపు మొగ్గడం, రెండు సార్లు పూర్తి మెజారిటీతో, ఒక్కసారి మిత్రుల తోడ్పాటుతో బిజెపి విజయం సాధించింది. మూడు సార్లూ నరేంద్రమోడీ ప్రధానిగా అధికార పగ్గాలు చేపట్టారు. ఈ గుణాత్మకమైన మార్పులను దృష్టిలో పెట్టుకొని, రాజకీయంగా ఎదురైన ఈ సవాలును, భారత రాజ్యాంగంలోని లౌకిక–ప్రజాస్వామ్య విలువలకు ఏర్పడిన తీవ్ర ప్రమాదాలను దీటుగా ఎదుర్కోవడానికి తగిన రాజకీయ ఎత్తుగడల పంథాను రూపొందించడంలో సీతారాం నాయకత్వ పాత్ర పోషించారు. హిందూత్వ నిరంకుశ శక్తుల ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి ఒక విశాల వేదిక నిర్మాణం 'ఇండియా బ్లాక్' ఈ కారణంగానే సాధ్య పడింది.

సీతారాం భార్య పేరు సీమా చిస్తీ, పాత్రికేయులుగా పనిచేస్తున్నారు. వారి పెద్దకుమారుడు కరోనాకు గురై మరణించారు. ప్రస్తుతం వారికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. విలక్షణ నాయకుడైన సీతారాం ఏచూరి గత సెప్టెంబరు 12న శ్వాసకోశవ్యాధితో ఢిల్లీలోని ఎయిమ్స్‌లో కన్నుమూశారు. దేశం ఒక మార్గదర్శిని, పార్టీ ఒక గొప్ప నాయకుడిని, భారత పీడిత ప్రజానీకం అత్యంత బాంధవుణ్ణి కోల్పోయింది. .

❃

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2024-26, Marxistu Monthly Magazine, Volume 20, issue: 4 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36

# కుల నిర్మూలన సాధించే మార్గం

(12వ పేజీ తరువాయి)

ఐక్యత ప్రాతిపదికన సంబంధాలను పెంపొందించాలి అనుకున్నప్పుడు మనకి ఆటంకాలగురించిన భావన మారుతుంది.

ఒక ఉదాహరణతో ఇక్కడ స్పష్టత వస్తుంది. మనం పైన సూచించిన సార్వత్రిక ఆర్థిక హక్కులను అమలు చేయడానికి అదనంగా ప్రజాధనం అవసరం అవుతుంది. అదే సమయంలో కొన్ని హక్కుల అమలు మొదలైతే మరికొన్ని హక్కుల అమలుకు దారి ఏర్పడుతుంది. ఉదాహరణకు: అందరికీ ఉచితంగా నాణ్యత కల విద్యను పొందే హక్కు అమలైతే అప్పుడు అందుకోసం ఉపాధ్యాయులను పెద్ద సంఖ్యలో నియమించడం అనివార్యం అవుతుంది. వారితోబాటు పాఠశాలల నిర్వహణకు, స్కూలు భవనాల నిర్మాణానికి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, కార్మికులు అవసరం అవుతారు. ఐతే ఇందుకోసం మన జిడిపిలో 8 నుండి 10 శాతం వరకూ ఖర్చు చేయవలసివుంటుంది. మన జిడిపితో పోల్చితే వసూలయే పన్ను నిష్పత్తి ప్రపంచంలోని ఇతర దేశాలకన్నా చాలా తక్కువ. అందుచేత పన్నులను పెంచడం పెద్ద సమస్య కాబోదు. ఐతే, పన్నులను పెంచితే మదుపుదారుల విశ్వాసం దెబ్బ తింటుంది వంటి వాదనలు తెచ్చి పన్నులను పెంచకుండా అడ్డుకోవడం నయా–ఉదారవాద వ్యవస్థలో జరుగుతోంది. అందుచేత మనకి పైన చెప్పుకున్న సార్వత్రిక హక్కుల సాధనలో ప్రధాన ఆటంకంగా ఈ నయా – ఉదారవాద విధానాలు ఉంటాయి.

ఈ విధంగా పన్నుల పెంపును అడ్డుకోవడం అన్యాయం. అందరికీ వర్తించే కొన్ని సార్వత్రిక హక్కులను అమలు చేయడానికి తగిన వనరులు ఈ వ్యవస్థలో లభిస్తున్నప్పుడు ఆ హక్కుల అమలుకు ప్రాధాన్యత ఇవ్వడం కన్నా, ప్రస్తుత ఆర్థిక విధానాల కొనసాగింపుకే ప్రాధాన్యతనివ్వడం ఏ మాత్రమూ న్యాయం కాదు. అందుచేత ప్రస్తుత ఆర్థిక విధానాల చట్రం లోపలే మనం ఏ హక్కు కోసమైనా కృషి చేయాలి అని అనుకుంటే మనం ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేం.

ఇంకో విషయం కూడా చెప్పాలి. నయా–ఉదారవాదం.. ప్రభుత్వం ఒక్క మదుపుదారుల విశ్వాసాన్ని పరిరక్షించే విషయంలో తప్ప వేరే దేనిలోనూ జోక్యం చేసుకోకూడదని నిర్దేశిస్తుంది. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో స్వత:సిద్ధంగానే ఒక ప్రాప్తకాలజ్ఞత ఉంటుంది. ప్రభుత్వం జోక్యం చేసుకోకూడదని నియంత్రించడంతో ఆ ప్రాప్తకాలజ్ఞత పూర్తి స్థాయిలో విజృంభిస్తుంది. దాని ఫలితంగా అసమానతలు తీవ్రంగా పెరుగుతాయి. కార్మికుల వేతనాలు కనీస అవసరాలను తీర్చగల స్థాయి కన్నా తక్కువకే కుదించబడతాయి. నిరుద్యోగసైన్యం సైజు అంతకంతకూ పెరిగిపోతూవుంటుంది. మరొక వైపు కార్మికుల ఉత్పాదకత పెరుగుతూవుంటుంది. దాని వలన ఉత్పత్తి అయిన సంపదలో పెట్టుబడిదారుల వాటా అంతకంతకూ పెరిగిపోతూవుంటుంది. ఇప్పటికే అనేక సామాజిక, ఆర్థిక అసమానతలతో ఉన్న మన దేశంలో ఆ అసమానతలను మరింతగా పెంచే విధానాలను అదనంగా తెచ్చి బలవంతంగా అమలు చేయడం జరుగుతోంది. దాని ఫలితంగా కులపరంగా, మత పరంగా కూడా అసమానతలు పెరిగిపోతాయి. అన్ని రకాల అసమానతలకూ వ్యతిరేకంగా నిలిచి అంతరాలను తగ్గించాలనుకున్నప్పుడు అటువంటి కృషిలో భాగస్వాములయేవారు నయా–ఉదారవాద వ్యవస్థను మనం అధిగమించలేము అని భావించరాదు. అలా భావిస్తే కష్టజీవుల మధ్య ఎటువంటి విశాల ఐక్యతనూ నిర్మించడం సాధ్యం కాదు. అది సామాజిక ఘర్షణలు మరింత తీవ్రం కావడానికే దారి తీస్తుంది.

(స్వేచ్ఛానుసరణా ఎం.వి.ఎస్.శర్మ)

**చిరునామా**

**మేనేజర్,**

**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.15,** సంవత్సర చందా:**రూ.150,** పోస్టు ద్వారా **రూ. 180** పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

**ఇంటి నెంబరు** ..................................................

**వీధి** ..................................................

**గ్రామం** ..................................................

**మండలం లేదా పట్టణం** ..................................................

**జిల్లా** ..................................................

e m a i l : marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao.